నవశక్తి

Vol. 1, no. 37

(Sept. 7, 1938)

బెజవాడ, 1938

Record no. 682

Navaśakti

Vol. 1, no. 37

(Sept. 7, 1938)

Bejavāḍa, 1938

Record no. 682

తిరువాన్కూరు కాల్పులు.

Regd. No. M. 3824

నవశక్తి


ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పత్రిక

సంపాదకుడు : మద్దుకూరి చంద్రశేఖరరావు

సంపాదకవర్గం : కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 1 | బుధవారము | 7—9—38 | బెజవాడ | సంచిక 37

ఇది బ్రిటిష్ సింహమా? గ్రామ సింహమా?



హిట్లర్ ముస్సోలీనీలు ఎలా చెబితే అలా నడిచే బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేను.

సం॥ చందా 3—0—0 ⁂ 24 పేజీలు అణా.

నవశక్తి

చంచా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధసంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

* * *

అడ్వర్టైజుమెంటు రేటులు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు) కాలంలో 1" మొదలు 20" వరకు ప్రతి

అంగుళానికి రూ.	0—6—0
20" — 100" వరకు ..	0—4—0
100" పైగా ..	0—3—0
పాతిక పేజీకి	3—0—0
సగము పేజీకి	6—0—0
ఒక పేజీ మొదలు 15 పేజీల వరకు పేజీ ఒకటికి	10—0—0
15 పేజీలకు పైగా పేజీ 1కి	7—8—0

ఈ వరకు అంగీకరించిన కంట్రాక్టులకు ఈ రేట్లు వర్తించవు.

ఈ రేట్లలో కన్సెషన్సు, కమిషన్సు ఏమీ ఉండవు.

* * *

చందాదారులను చేర్పించాలి!

సెప్టెంబర్‌లో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"లు పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజా సామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీ సభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తి చేస్తారని నమ్ముతున్నాం.

సెప్టెంబర్ నెల మొదటి వారంలో

	కోటా	చేర్పించినది
విశాఖపట్టణము	10	0
తూ. గోదావరి	75	2
ప. గోదావరి	90	19
కృష్ణా జిల్లా	100	22
గుంటూరు	60	3
నెల్లూరు	50	1
రాయలసీమ	10	1
ఇతరస్థలాలు	5	2
	400	50

ప్రజలకు ! ప్రచారకులకు !!

సుప్రసిద్ధమగు జాతీయ గ్రంథములు.

1. ప్రభుత్వ ధనము — మన బీదతనము
   జె. సి. కుమారప్పగారి ఆంగ్ల గ్రంథమున కనువాదము. ఇటీవల ప్రభుత్వ నిషేధము తొలగింపబడినది.
2. గాంధీ మహాత్ముని లండను ఉపన్యాసములు
   మహాత్మాజీ లండనులో రెండవ రౌండుటేబిలు సమావేశము నందొసగిన యుపన్యాసముల కనువాదము. రచయిత: శ్రీ తిమ్మరాజు సత్యనారాయణగారు ఎం. ఎ.
3. హరిజన సమస్య
   ఆది శంకరుల నాటినుండి నేటివరకును యీ యుద్యమాభివృద్ధిని విపులముగా చర్చించిన యుత్తమ గ్రంథము, రచయిత: శ్రీ నందూరి కృష్ణమాచార్యులు బి.ఏ.
4. ఆధునిక రాజ్యాంగ సంస్థలు
   (రెండు భాగములు) నవీన రాజ్యాంగ విధానములన్నియు ఇందు చర్చింపబడెను. రచయిత: ఆచార్య రంగాగారు.
5. చైనా జాతీయోద్యమము (రెండు భాగములు)
   ఆదినుండియు చైనా జాతీయోద్యమ చరిత్రము విశదీకరించు ముఖ్యగ్రంథము. రచయిత: శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు.

ఈ 7 గ్రంథములును విడివిడిగా ప్రతి 1 కి రు 0—8—0 లును. అన్నియు నొకేసారి కోరినచో మూడు రూపాయిలును మాత్రమే.

ప్రతులకు:—

ఆంధ్ర ప్రచారిణి లిమిటెడ్, కాకినాడ.

లక్ష్మీ ప్రావిడెంటు ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్ మచిలీపట్టణము.

మా పట్టాదారులకు, ఏజంట్లకు ఆకర్షణీయమగు

కొన్ని ప్రత్యేక సదుపాయములు.

1. రు 50 లు మొదలు, రు 500 లు. వరకు భీమాచేయుటకు వీలగునట్లు. ప్రావిడెంటు ఇన్సూరెన్సు ప్రణాళికలు గలవు.
2. వైద్య పరీక్షలోను, లేకుండగను, భీమాచేయుట కవకాశము లేర్పరుప బడినవి.
3. కార్మికులకు, కర్షకులకు, పిల్లలకు, పెద్దలకు, ఉద్యోగులకు, గొప్పవారికి వీలగునట్లు పర్మనెంటు ఫండు డిపాజిట్లు గలవు.
4. పాలసీదారులు, ఏజంట్లు, పరిపాలనలో పాల్గొనుటకుగాను రెండు స్థానములు ప్రత్యేకింపబడినవి.
5. ఏజంట్లకు వంశపారంపర్య కమీషను పద్ధతులు గలవు.
6. కంపెనీ వ్యాపారము మితవ్యయముతో నిర్వహింపబడుచు, తెలుగులో వుత్తర ప్రత్యుత్తరములు జరుపబడును.

కమీషను పద్ధతి మీదగాని, జీతముమీదగాని పనిచేయుటకు అన్ని ప్రాంతములకు ఏజంట్లు ఆర్గనైజర్లు కావలెను.

వివరములకు—మేనేజింగు డైరెక్టరు పేర కంపెనీకి వ్రాయుడు.

చలంచర్ల నారాయణ మూర్తి గారి

ఫొటో మార్కు

విష్ణాంజనం

అన్ని నొప్పులకు, కవుకు దెబ్బలకు, మూలవ్యాధులకు, బోదకాళ్లకు, కాల్పులకు, నరుకులకు, తేలు, జెర్రి మొదలగు విష జంతువుల కాట్లకు, పండ్ల బాధలకు, చెవులో చీము, రక్తముకు దివ్యామృతం.

★ అన్ని షాపులయందు దొరకును.
★ ప్రతి టవునుకు యేజంట్లు కావలెను.
★ వివరములకు నేడే వ్రాయండి.

మొదటి రకం అగరువత్తులు, సెంట్లు, హైరాయిల్సు, పునుగు, జవ్వాది, కస్తూరి, జున్ను, గోరోజనం, పచ్చకర్పూరం మొదలగు పరిమళ ద్రవ్యములన్నియు దొరకును.

విష్ణాంజనం డిపో, రాజమండ్రి.


శగవ్యాధిని మొదలంట నివారించునదేది?

శెగవ్యాధి కివ్వబడునవి అనేక ఔషధము లున్నప్పటికిని అది వ్యాధిని మొదలంత నివారించు క్రిమి సంహారకములుగ లేవు. శెగవ్యాధిని మొదలంట నివారించి తిరిగి రానీయకుండ కాపాడుటకు దివ్యమైన ఔషధముగ "సుధాచంద్రిక"ను నిర్ణయించిరి. దీనిని సేవించిన వెంటనే మంట తగ్గి, వుండు మాని, డిశ్చార్జి ఆగుట, మూత్రము ధారాళముగ రాకుండుట నిలచి, ఎక్కువ సుఖము నిచ్చును. చిరకాలము లుండి యున్న శగరోగములకు కూడ ఈ మందు ధాతువుల యందు ప్రవేశించి అక్కడ యుండు దోషమును పోగొట్టి వ్యాధిని కుదుర్చును. సీసా. రు. 2—0—0.

అన్నిచోట్ల అమ్మబడును.

లేక

క్షీరసముద్రం ఫార్మసీ, రాజమండ్రి.



ప్రతి యింటా ఉండవలసినవి

కార్నిక్స్ ఆగ్ మిక్స్చర్

మలేరియా, ఇనఫ్లుయాంజా, అడవి జ్వరం, మాటిమాటికి వచ్చే జ్వరాలకు, భద్రమయిన, గ్యారంటీ అయిన మందు. తక్షణం గుణం ఇస్తుంది. మళ్లా జ్వరాలు తగలకుండా ఆపుతుంది.

బుడ్డి ఒకటికి వెల 12 అణాలు.
3 బుడ్లు 2-8-0, కాని పోస్టేజి ఉచితం.


వాడినవారందరూ

ఇండోబామ్

నే రికమండు చేస్తారు. ఎల్లప్పుడు మీవద్ద ఉంచండి.

కీళ్ల నొప్పులను, నరముల బాధ, తలనొప్పి, వెన్నుబాధ, పండ్ల బాధ, జలుబు, దగ్గులను నివారించుతుంది. వ్యాధిని సమూలంగా నాశనం చేయడంలో అద్భుతమైనది.

ఒక డబ్బీ 8 అణాలు.
3 డబ్బీలు రు 1-8-0. పోస్టేజి ఉచితం.
అణా బిళ్ల పంపు వారికి శాంపిల్ ఉచితం.



ప్రతి చోటా దొరుకును.

కార్నిక్ బ్రదర్స్, గిర్‌గాం, బొంబాయి, 4

తిరువాన్కూర్ సంస్థాన దౌర్జన్యం

ఇప్పటికి మూడుసార్లు కాల్పులు
ఇంకెన్నో అరస్టులు—లాఠీ చార్జీలు—శిక్షలు

నిర్బంధ విధానం

త్రివేంద్రం.

బి. ఎ. జూనియర్ క్లాసులో విద్యార్థులిద్దరు "స్టేట్ కాంగ్రెస్‌కి జై" అని నినాదాలిచ్చుటచే వారిని స్కూలు అధికారులు సస్పెండు చేశారు. అందుపై ఆక్లాసు విద్యార్థులందరూ కలసి ఇతర విద్యార్థులను కూడ స్కూలునుండి వచ్చి వేయ వలసినదని ప్రోత్సహించారు. అందరూ కలసి అధికారుల చర్యలను ఖండిస్తూ పెద్ద ప్రదర్శనము గావించారు. ఆ సాయంత్రము ఇంకొక పెద్ద ప్రదర్శనాన్ని బహిరంగ సభను కూడా జరిపారు. కాలేజీ అధికారులు తమ ఆర్డరును రద్దు చేసుకొనే వరకూ ఎవరూ స్కూలుకు వెళ్ళవద్దని పలువురు ఉపన్యాసాలిచ్చారు.

కాలేజీ విద్యార్థులు హరతాళ్‌చేస్తూ కాలేజీకి రావడం మానివేస్తే, వారిని తొలగిస్తామనియు, జాగ్రత్త పడవలసినదనియు విశ్వవిద్యాలయాధికారులు నోటీసైచేశారు. ఈ ఉత్తరువునకు అసమ్మతిని తెల్పుతూ హైస్కూలు కాలేజి విద్యార్థులు సమ్మెచేశారు. కాలేజి ఎదుట ప్రదర్శనాలు చేశారు. విద్యార్థినులు కూడా యీ సమ్మెలో ఎక్కువగా పాల్గొన్నారు. జయజయ ధ్వానాలతోనూ జాతీయ త్రివర్ణ పతాకాలతోడను బ్రహ్మాండమైన ఊరేగింపును జరిపారు. స్టేట్ కాంగ్రెస్ యువజన సంఘపు నినాదాలతో సభకు వెళ్ళారు. సభ జయప్రదంగా జరిగింది. విద్యార్థుల సమ్మెలు రాకుండా చేయుటకు కొత్తాయం స్కూలు మూడు వారాల వరకూ మూసివేశారు.

అల్లెప్పీ.

పి. కె. కుంజుగారి అరెస్టును నిరశిస్తూ బ్రహ్మాండమైన హర్తాళు జరిగింది. కొబ్బరి పీచు మిల్లులలో పనిచేసే కార్మికులు కూడా హర్తాళు చేశారు.

శాసన సభ్యుని అరెస్టు.

పి. జె. శెబాస్టియన్ (యం. యల్. ఎ.) వి. మాధవన్‌గార్లు ప్రభుత్వపు నిషేధపు ఉత్తర్వును ఉల్లంఘించారు. వారిని అరెస్టు చేశారు. శెబాస్టియన్ గారికి 13 నెలలు శిక్ష. 1600 రూపాయలు జరిమానా గాని 3 నెలలు శిక్షగాని అదనంగా విధించారు.

విద్యార్థులు, ఇతర ప్రజలూ యీ చర్యను ఖండిస్తూ హర్తాళు జరిపారు. ప్రతి దినమూ యీ పోరాటంలో కొత్త వారందరూ కలుస్తున్నారు. సంఖ్య కూడా నానాటికి హెచ్చిపోతోంది.

పాలై.

ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ యిక్కడ ఒక సభ జరిగింది. పోలీసులు పాపం "శాంతియుతంగానే లాఠీఛార్జి చేసి ప్రజలను బెదరగొట్టారట." యీ శాంతియుతం (Peaceful) అనే దాన్ని అనేకులు రీ యాక్షనరీలు విరామం లేకుండా వినియోగించి ప్రజలను మోసగిస్తున్నారు.

తిరువాన్కూరులో ప్రతి గ్రామం పట్టణంలోనూ ప్రభుత్వ చర్యలను ఖండించుటకును ఎదుర్కొనుటకును ప్రజాశక్తి విజృంభించి ప్రజానీకం విజృంభిస్తోంది.

నంబూద్రిపాద్‌గారి స్టేట్‌మెంటు.

ఇందుపై, అ. భా. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సహాయ కార్యదర్శి గారొక స్టేటుమెంటు యిచ్చారు. యీ యన కేరళ రాష్ట్ర కాంగ్రెసు సంఘ కార్యదర్శి గారు కూడా. "తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుల స్టేట్‌మెంటును చూచిన వారికందరికీ వారి హక్కులు సక్రమమైనవని తెల్లమగు చున్నది. వీటికి ప్రభుత్వం అడ్డు తగులుటచే శాసనోల్లంఘనాన్ని ప్రారంభించడం స్టేట్ కాంగ్రెసు సరియగు మార్గాన్నే అవలంబించింది.

తిరువాన్కూరు సంస్థానంలో ప్రజలు సాగించే పోరాటానికి బ్రిటిషు ఇండియా ప్రజలు సహాయము చేయాలి. అది మనవిధి. వారి పోరాటం వేరు, అని భావించి ఊరకొనుట ఆత్మ హత్యయే." అని ప్రకటించారు. కేరళ రాష్ట్రీ మంతటినుండియు, తిరువాన్కూరు ప్రజలకు అర్థ బలమును, మనుష్య బలమును కూడా చేకూర్చుటకు ప్రయత్నాలు జరుగు చున్నవి.

ప్రభుత్వపు నిషేధాజ్ఞను ఉల్లంఘిస్తూ మరి 5 గురు స్టేట్ కాంగ్రెస్ నాయకులు బహిరంగ సభలో ఉపన్యసించారు. వారినీ, మరికొందరు వక్తలనూ అరెస్టు చేశారు. 11 మంది విద్యార్థులను కూడా అరుస్టు చేశారు.

తరువాత పోలీసులు ప్రజలపై బడి ఘోరమైన లాఠీఛార్జి చేశారు. సభకు పల్లెలు కొందరు వచ్చారు. వారిని అరమైలు దూరము పోలీసులు తరిమిరి. వారు తిరుగబడి ఒక పోలీసు అధికారి కారును తగులబెట్టిరని వార్త వెల్వడింది. ఆ విధమగు పోరాటము లోనికి పోవద్దని స్టేట్ కాంగ్రెసు నాయకులు హెచ్చరిక నిచ్చారు.

ఈ వార్త శుద్ధ అబద్ధమని తరువాత 31 వ తేదీని పోర్చుగీసు మిషన్ ఉన్నతోద్యోగి ఒక ప్రకటన చేశాడు.

(ఈ వార్తను సాకుగా తీసుకొని సేనలను నడిపించుటకే యిట్లు ప్రకటన వచ్చి యుండ వచ్చును.)

నెయ్యాతింకారాలో కాల్పులు

ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ జరిగే ప్రజా ఉద్యమం నూతన స్వరూపం దాల్చింది. ఇదివరలో ఎక్కడి ప్రజలక్కడే సభలు జరిపేవారు. ఇప్పుడు పల్లెటూళ్ళనుండి వేలకు వేలుగా ప్రజలు ప్రదర్శనాలు సాగిస్తూ పట్టణాలకు వచ్చు చున్నారు. దీనిని అణచుటకు మిలిటరీని కూడా ప్రభుత్వం ప్రజలపైకి పంపింది.

సభ, ఆందోళన అంతా అయిపోయిన తరువాత నెయ్యతింకారా అనే గ్రామం మిలిటరీ వెళ్ళింది. ఊరిమధ్య పొజిషన్లలో నిలబడ్డారు. ప్రజలందరూ అన్ని మూలలనుండీ వచ్చారు. ఎక్కడ నుండియో రాయి పడిందిట మిలిటరీ మీద. అంతే తుపాకులు కాల్చారు. 7 గురు చనిపోయారు. 5 గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఒకరు వృద్ధ స్త్రీ కూడావుంది.

ప్రభుత్వపు యీ చర్యవల్ల అసమ్మతిని తెలుపుతూ అనేక ప్రాంతాలలో సభలుజరిగాయి. స్టేట్ కాంగ్రెస్ సభ్యులు అనేకులు ఉపన్యశించారు.

శాసన సభ్యుల రాజీనామా.

చిత్రాస్టేటు కౌన్సిలు సభ్యులగు శ్రీ కె. ఆర్. ఎలాంగేత్‌గారు, శ్రీమూలం యం.ఎల్.ఎ. శ్రీ రామయ్యపిళ్ళేగారు, ప్రభుత్వం నెయ్యాతింకారాలో చేసిన దౌర్జన్యాన్ని ఖండిస్తూ మత సభ్యత్వములకు రాజీనామా నిచ్చారు.

శాసన సభ్యులపై నిషేధాజ్ఞ.

పి. బాలకృష్ణ తాంపీ, బి. ఏ., బి. యల్. యం. యల్. సి. గారిపై 15 రోజుల వరకూ బహిరంగ సభలలో ఉపన్యశించవద్దని నిషేధాజ్ఞ జారీ చేయబడింది.

నెయ్యాతింకారాలో "నేషనల్ గార్డు" అనే దళము ఏర్పాటు చేయబడు చున్నదని వార్తలు వచ్చుచున్నవి.

ప్రభుత్వ నిర్బంధ విధానంపట్ల తీవ్రమైన అసమ్మతి సభలు జరుగుచున్నవి. మహానుభావులు స్టేట్‌మెంట్లిస్తున్నారు.

క్విలన్‌లో కాల్పులు

క్విలన్ కాంటోన్మెంటు మైదానంవద్ద బహిరంగ సభ జరుపుటకు ఏర్పాట్లు చేయబడ్డాయి. టైముకు ముందుగానే వేలకు వేలు జనులు హాజరయ్యారు.

పోలీసు అధికారులూ, జిల్లా మేజిస్ట్రేటు, కొందరు స్టేట్ మిలిటరీతో కూడా మధ్యకు వచ్చి ప్రజలను చెదరగొట్టుట ప్రారంభించారు. లాఠీ ప్రయోగం జరిగింది. ప్రజలు రాళ్ళు రువ్వారట. అందుచే ప్రజలపై తుపాకులను మిలిటరీవారు కాల్చారు. (మిలిటరీని గొని వచ్చిన తరువాతే పోలీసు అధికారులపై రాళ్ళు పడతాయి. అదేమి చిత్రమో) 4 గురు మరణించారు. 4 గురు గాయపడ్డారు. మరణించిన వారిలో లక్ష్మణ ఆశ్రమన్ అనే ఎ. డి. కాటన్ మిల్లు కార్మికుడు కూడా ఉన్నాడు. కార్మికులు యీ పోరాటాలలో పాల్గొంటున్నారని స్పష్టముగా యీవార్త తెలుపుచున్నది.

తిరువాన్కూరుపై మహాత్ముని అభిప్రాయం

"తిరువాన్కూరులో జరుగుచున్న విషాద గాథను నేను శ్రద్ధగా గమనించు చున్నాను. స్టేట్‌మెంటు ఇవ్వనక్కర లేకుండా తప్పుతుందనుకున్నాను. కాని తప్పిందికాదు. తిరువాన్కూరు ప్రభుత్వము అవసరమైన దానికంటె ఎన్నో రెట్లు ఎక్కువగు నిర్బంధ విధానాన్ని సాగిస్తున్నారని నా అభిప్రాయం.

తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెస్ రాజద్రోహకరముగాను, ప్రభుత్వాన్ని కూలద్రోయుటకును ప్రయత్నిస్తోందని ప్రభుత్వవాదన. స్టేట్ కాంగ్రెసు యొక్క కాగితాలన్నీ చూచాను. అందులో అటువంటిదేమీ నాకు కనుపించలేదు.

స్టేట్ కాంగ్రెసు వర్కింగు కమిటీ మెమోరాండంలో సి. పి. రామస్వామి అయ్యర్ గారిపై ఆరోపణలున్నాయి. ఎన్ని ఆధారాలున్నా బాధ్యతాయుత ప్రభుత్వం కొరకై జరిగే యీ ఆందోళనలో అది అనవసరం అని నేననుకుంటాను. అవి ఉపసంహరించు కొంటే మంచిది. ప్రజలు అహింస పాటిస్తే బాధ్యతాయుత ప్రభుత్వం వారికి అవసరమేనని ప్రభుత్వపు ఈ చర్యలన్నీ ప్రబల నిదర్శనాలు.

హింసకు దిగవలదని విద్యార్థులను కోరుచున్నాను.

నేను తిరువాన్కూరు మహారాజాను, సి. పి. రామస్వామయ్యరు గార్లను బాగుగా ఎరుగుదును. వారు తమ ప్రస్తుత నిర్బంధ విధానాన్ని ఉపసంహరించుకొన వలసినదని కోరుచున్నాను. వ్యక్తుల నేరాలను ఆపుటకు ఉన్న శాసనాలు చాలును.

శ్రీమతి కమలాదేవి గారిపై నిషేధం శుద్ధ తెలివితక్కువ. తిరువాన్కూరు సంస్థానానికి పరాయివాడైన సి. పి. రామస్వామయ్యరు గారు, కమలాదేవి వంటి సుప్రసిద్ధ భారత నారీమణి పరాయిదని నిషేధించడంలోని భావం నాకు గోచరించడం లేదు.

భయంకర నిర్బంధ విధానం వల్ల ప్రభుత్వము ప్రజా ఉద్యమాన్ని అణచవచ్చును. నాశన మెన్నటికిని చేయలేదు.

యిప్పుడైనా తెలివి గలిగి స్టేట్ కాంగ్రెసుపై నిషేధాన్ని తొలగించడం ఉత్తమం.

గాంధీగారికి

సి. పి. రామస్వామి అయ్యంగారు

ఇచ్చిన సమాధానం.

త్రివేంద్రం, నెయ్యాట్టింకారా, క్విలన్‌లలో హింసకు స్టేట్ కాంగ్రెస్ ప్రోత్సహించింది.

బహిరంగ సభలలోనూ, శాసన సభలోనూ కూడా అంతర్యుద్ధం వస్తుందని ప్రభుత్వానికి ఎన్నో బెదరింపులు వచ్చాయి. "విప్లవం వర్ధిల్లాలి" "గాంధీజీకి జై స్టేట్ కాంగ్రెసుకిజై" అని నినాదాలు మ్రోగిపోయాయి. ఇవనీ భారత దేశములోని పత్రిక లన్నిటిలోనూ పడుతున్నాయి. గాంధీగారిచ్చిన స్టేటుమెంటు న్యాయ దృష్టితో లేదు.

గాంధీగారి శిష్యశ్రేష్ఠులు రాజగోపాలాచారిగారిచే నిరశింపబడిన కమ్యూనిష్టు భావాలుండుట చేతను, పరాయి వారగుటచే స్థానిక విషయాలు తెలియని వారగుటచేతనూ, ప్రస్తుత క్లిష్ట పరిస్థితులలో అనుచితమని కమలాదేవి గారిని రావద్దన్నాంగాని మరే యితర కారణం చేతనూ గాదు" అన్నారు.

కాని

క్విలన్ సభను చెదరగొట్టే సందర్భంలో ఒకపోలీసే స్వయముగా రాళ్ళురువ్వటం తాను చూచానని, ఫైరింగునాడు లాఠీదెబ్బలు తగిలి ఆస్పత్రిలో నున్న ఒక ఆయన చెప్పుచున్నాడు.

ఈ సందర్భములో ప్రజలపై దివాన్‌గారి ఆరోపణ అసత్యమవుతుంది.

కేరళా విద్యార్థి సంఘ కార్యదర్శిగారగు ఎ. కె. నారాయనన్‌గారూ బి. చంద్రశేఖరపిళ్ళే గారు (వలంటీరు కెప్టెన్) గారూ అరెస్టు చేయబడ్డారు. 1 సం॥ శిక్ష, రూ 1000లు జరిమానా లేకుంటే 3 నెలలు శిక్ష.

అఖిల కేరళ సోషలిస్టు పార్టీ కార్యదర్శి యన్. సి. శేఖరుగారు జైలునుండి విడుదల అయి రి, వెలుపలికి రాగానే కొత్త ఆర్డినెన్సు ప్రకారం మళ్ళీ అరెస్టు చేయబడ్డారు. 10వ తేదీకి విచారణ వాయిదా వేశారు.

మరల కాల్పులు

కొత్తయ్యంలో మళ్ళా కాల్చారు. ఒకడు మరణించాడు.

అన్నపూర్ణయ్యగారి రాజీనామా

కామ్రేడ్ అన్నపూర్ణయ్య గారి త్యాగమును, పార్టీకి వారు చేసిన సేవను అభినందించుతూ, ఆర్థిక కష్టాల మూలంగా కాంగ్రెస్ సోషలిష్టుపార్టీ సభ్యత్వానికి, నవశక్తి పత్రిక సంపాదకత్వానికి వారు ఇచ్చిన రాజీనామాను అంగీకరించడమైనది. త్వరలో వారీ చిక్కుల నుండి బయటపడి యథా విధిగా పార్టీలో పని చేస్తారని ఆశించు చున్నాము.

కామ్రేడ్ అన్నపూర్ణయ్యగారి స్థానే కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖరరావు గారిని ఎడిటరు అండు పబ్లిషరుగా నిర్ణయించడ మైనది.

బెజవాడ. 3—9—38

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్య నిర్వాహక వర్గం.

నవశక్తి

7—9—38 బుధవారం

తిరువాన్కూరు కాల్పులు.

ఒకరు గాదు—ఇద్దరు కాదు—అపుడే 10 గురు మరణించారు. నెయ్యితింకారా, క్విలన్, కొత్తయ్యం కాల్పులకు ఈ యోధులు బలియ్యారు. ఎందరో వైద్యశాలలో మూల్గు తున్నారు. ఇంకెందరో కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, యువకులు జైళ్ళలో క్రుగ్గు చున్నారు.

మైసూరు 'రామ రాజ్యం' తరువాత తిరువాన్కూరు ప్రఖ్యాతిగన్న సంస్థానం. రాజగోపాలాచారి వంటి వారిచే పొగడ్తల పొందిన "పుణ్య" సంస్థానం. హరి జనులకు దేవాలయం తెరచిన సంస్థానమట! రాజమాత శ్రీ ఉద్యమాభి లాషియట !! రాజ వంశం నాగరీకమైనదట !

కా వచ్చును. కాని హరిజనులకు దేవాలయ ప్రవేశం అన్నాతురుల క్షుద్బాధ తీర్చ లేదు. కాంగ్రెస్ సభ్యులన్న నేరం వల్ల స్త్రీలు సంస్థాన ప్రభుత్వపు రౌడీల నీచ కృత్యాలకు గురికాకుండ పోలేదు. ప్రజా సామాన్యానికై పోరాడే సంస్థాన కాంగ్రెసుకు భయపడి, ఈ 'నాగరీక' సంస్థానం రౌడీలను నియోగించింది. అల్లరుల చేయించింది. ప్రజా స్వామ్య హక్కులనే భంగ పరచింది. కమలాదేవి వంటి వారిని రాకుండ నిషేధించింది. ఎన్నాళ్ళని సహిస్తారు? దీనికి యువకులు సహించలేదు. తమ సభను జరిపి తమ స్వాతంత్ర్య కాంక్షను వెలిబుచ్చారు. ప్రభుత్వ నిర్బంధ విధానం, నీచంగా ఒనరించే 'రౌడీజం' సంస్థాన ప్రజలను సత్యాగ్రహం ప్రారంభించునట్లు చేసింది.

సంస్థానం, ప్రజల ఈ మహా ఉద్యమాన్ని అణచడానికి, సర్. సి. పి. రామస్వామి అయ్యంగారి చల్లని దివాన్‌గిరీ సలహాలతో క్రిమినల్ లా అమెండు ఆక్టును ఉపయోగించింది. డజన్లకొలది అరస్టులు, లాఠీచార్జీలు, కాల్పులు—మార్షలా ప్రభుత్వాన్నే జ్ఞప్తికి తెస్తూంది. ఆయ నెవరో—రామస్వామి అయ్యంగారిని చిన్న వెల్లింగ్టన్ అన్నారు. నిజంగా వెల్లింగ్డన్ స్నేహితుడయినందులకు అతని మార్గాల నవలంబించుతున్నాడు, అయ్యంగార్. ఈ క్రూర నిర్బంధ విధానం, ఎందరో రాజ భక్తులను సైతం శాసనోల్లంఘనానికి దారి తీసింది.

రగుల్తోన్న ఈ స్వాతంత్ర్యపు చిచ్చుకు మరణించిన మహా యోధులు ఆజ్యం పోశారు. ఇక ఆ స్వాతంత్ర్య జ్యోతి దివ్యంగా వెలుగుతుంది. జాతీయకాంగ్రెస్ పతాక గౌరవాన్ని నిల్పుతూ, సంస్థానములోని దౌర్జన్యాన్ని ఎదుర్కొంటూన్న ప్రజల ధైర్య సాహసాలు స్తవనీయాలు.

దివాన్ గారి పైన సంస్థాన కాంగ్రెసు ఆరోపణలు చేయుట మహాత్మునికిష్టము లేకపోయినా, సంస్థాన దౌర్జన్య విధానాన్ని ఖండించాడు. దానికి రామస్వామి గారిచ్చిన సమాధానం విచిత్రంగా ఉంది.

కమలాదేవిని రానీయకుండుట, ఇతర రాష్ట్రవాసిని అని కాదట. కమ్యూనిస్టు అట! మహాత్ముని శిష్యుడగు రాజగోపాలాచారి గారు సైతము కమ్యూనిస్టుల వైఖరిని ఖండించాడట! పరిస్థితులు క్లిష్టంగా ఉన్నపుడు కమ్యూనిస్టులచే సమావేశపరుపబడిన సభకు కమలాదేవిని రానీయడం తప్పట!

మహాత్మునికి పరిస్థితులు తెలియదని యన్న దివాను గారి విషయ పరిజ్ఞానం ఇంత చక్కగా ఉంది. కమలాదేవి కమ్యూనిస్టు కాదు. సోషలిస్టే. ఆమెకు, కమ్యూనిస్టులకు అనేక విషయాలలో భేదాభిప్రాయయా లున్నాయి. అయినా, ప్రజాస్వామ్య హక్కుల నీయడానికే భయపడే సంస్థానాధిపతులకు—వారి డబ్బు తినే దివాన్లకు, ఏది చూచినా "కమ్యూనిజం"గా కన్పడటంలో ఆశ్చర్యం లేదు. సోషలిజం అన్నా, కమ్యూనిజం అన్నా వాళ్ళకి గొంతు బట్టుకొంటాయి. అందుకనే ఎన్నడో మార్క్సు "కమ్యూనిస్టు పెనుభూతం యూరప్ నంతా ఆవహిస్తోంది." అని వెక్కిరించాడు. నేడు ప్రపంచ మంతా ఈ శబ్దం వాడబడుతోంది. కమ్యూనిస్టుల నుండి చైనాను రక్షించడానికే జపాను దాడి యెత్తింది. కమ్యూనిస్టుల నుండి రక్షించడానికే హిట్లర్ ఆస్ట్రియాను మ్రింగాడు. జకోస్లొవేకియాను మ్రింగ దలచాడు. నేడు సర్. సి. పి. గారు కమ్యూనిస్టుల నుండి ప్రజలను రక్షించడానికే కమలాదేవిని సంస్థానాల లోనిక్కి రాకుండ నిషేధించారు. అరస్టుల చేస్తున్నారు. లాఠీచార్జీల గావిస్తున్నారు. స్వాతంత్ర్యయోధులను తుపాకి గుండ్లతో హత్య కావిస్తున్నారు!

మహాత్ముడు ఈ ఖండనతోనే సంతృప్తి పడరాదు. సంస్థాన కాంగ్రెసు, దివాన్‌గారిపై చార్జీల చేసి యుండరాదని చెప్పడము గాదు; విద్యార్థులను అహింసాత్మకంగా ఉండమని ప్రార్థించుట గాదు; సంస్థానము ఇంతటి నిర్బంధ విధానం అవలంబించకుండ, హింసా కృత్యములు—ఉపన్యాసములు గావించు వారిని సామాన్య శాసనాలు క్రింద అరెస్టు చేసిన చాలునని చెప్పుట గాదు—మహాత్ముని కర్తవ్యం ఇంకా ఉంది. కాంగ్రెస్ మహా సభ కర్తవ్యం ఇంకా ఉంది.

కాంగ్రెసు ప్రతిష్టను—పతాక గౌరవాన్ని నిల్పుతున్న ఈ సంస్థాన ప్రజా పోరాటానికి సంపూర్ణ సానుభూతి నీయాలి. స్వాతంత్ర్య పోరాటానికి సహకారం చేయాలి. సంస్థానాలు వేరు, మనం వేరు అనే తటస్థ భావాన్ని విస్మరించాలి. "కొన్ని సంస్థానాలలో పరిపాలన ఫేసిస్టు రాజ్యాలకు తీసి పోదు." అని అన్న జవహర్ వాక్యాలు మరచిపోరాదు. నేడు దేశ మంతటా చెలరేగుతూన్న విప్లవ చైతన్యాన్ని గుర్తించకుండ యుండరాదు.

మొన్న మొన్ననే మైసూరు, మన్నా సంస్థానాల స్వాతంత్ర్యోద్యమం విజృంభించింది. మైసూరులో ప్రభుత్వం వారు సంధి షరతుల నుల్లంఘించు తున్నారు. నీలగిరిలో కొంత వరకు ప్రజలే దివాన్‌పై విజయం పొందారు. రాజ కోటలో సోషలిస్టులు, కాంగ్రెస్ వారు 'వార్' కౌన్సిళ్ల నేర్పరిచి పోరాటం సాగింప నిశ్చయించారు. ఇంమార్ సత్యాగ్రహానికి సన్నిద్ధ మౌతున్నది. కాశ్మీర్‌లో పూర్వంకంటె తీవ్రంగా హిందువులు, ముస్లింలు, రైతులు, కూలీలు అందరూ కలిసి తీవ్రంగా సంస్థాన ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని పోరాటం సాగించు తున్నారు.

సంస్థాన ప్రజలలో గల్గిన ఈ విప్లవ చైతన్యాన్ని గుర్తించి, జాతీయ కాంగ్రెస్, జాతీయ నాయకులు తమ మితవాదాన్ని ఉపసంహరించుకోవాలి. తటస్థభావం మానివేయాలి. సంస్థాన ప్రజా పోరాటాన్ని వృద్ధి గావించేందుకు సంపూర్ణ సహకారం ఈయాలి.

ఫెడరేషన్‌ను ప్రతిఘటించాలంటే, మనలను కూడా ఈడ్చి సాగింప నున్న సామ్రాజ్య యుద్ధాలను ప్రతిఘటించాలంటే, సంస్థాన ప్రజల సహకారం అవసరం.

మన జాతీయ పోరాటంతో సంస్థాన ప్రజా స్వాతంత్ర్యోద్యమాన్ని జోడించి, సామ్రాజ్య వ్యతిరేక యుద్ధాన్ని సాగించాలి: సామ్రాజ్యవాద యుద్ధాలను ప్రతిఘటించాలి. అమానుష, అనాగరిక సంస్థాన ప్రభుత్వాలను రద్దుపరచి, బ్రిటిష్ ఇండియాలోను, సంస్థానాలలోను ప్రజా ప్రభుత్వం స్థాపించాలి. కాన్‌స్టిట్యూయంటు అసెంబ్లీ నిర్ణయమే కావాలి! సంస్థానాల దౌర్జన్యం నశించు గాక!

మీరట్ జమీందార్ల యుద్ధ సన్నాహం

పంజాబులో సత్యాగ్రహం — ఒరిస్సా మంత్రుల విజయం —
యు. పి. లో, జమీందార్ల బెదరింపు—ఆంధ్ర జమీందారీ రైతుల అధోగతి.

కొండపర్వ.

కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో మొఖాసాదార్ల దౌర్జన్యం నానాటికీ మితి మీరి పోతోంది. కొండపర్వ మొఖాసాదారు యొక్క నౌకర్లు, జవాన్లు 30-8-38 వ తేదీని పసుపులేటి సుబ్బయ్య అనే రైతు యొక్క పరిపొలంలో ప్రవేశించి, సుమారు 12 సెంట్ల విస్తీర్ణం గల రెండు మళ్ళలో నాటుకొన్న వరినారు దౌర్జన్యంగా ఊడబెరికి నష్టపరిచారు. గ్రామ మునసబు, గ్రామములో గార్డుగా ఉంటూన్న విస్సన్నపేట పోలీసు జవానులిద్దరు అక్కడే ఉండి, ప్రత్యక్షంగా చూస్తూన్నప్పటికీ పైరు నష్టపరచకుండా ఆపుచేయ లేదు. జరిగిన యదార్థము మాత్రం రైతులు రిపోర్టు మూలంగా యినస్పెక్టరు గారికి తెలియపరుచుకొన్నారు. మదరాసు ఎస్టేటు ల్యాండ్ ఆక్టు ప్రకారం, జమీందారుకు గాని మొఖాసాదారుకు గాని, రైతు వద్ద శిస్తు వసూలు చేసే అధికారం మాత్రమే ఉన్నది. ఒకవేళ, పట్టాదాఖలా గాక ½ యకరం గాని, 1 యకరం గాని భూమిని రైతు కలిగి యుంటే, అట్టి జాస్తి భూమికి ప్రక్క భూముల కున్న రేటు ప్రకారం ఎస్టేటు ల్యాండ్ ఆక్టు 163 వ సెక్షను ప్రకారం శిస్తు వసూలు చేసుకొనుటకే గాని, పంటను నాశనం చేయుట కెట్టి అధికారమూ లేదు.

ఇరగవరం.

ఇది పశ్చిమ గోదావరి జిల్లాలో మీర్జాపురం జమీందారు గారికి చెందిన గ్రామం. గ్రామ పోరంబోకులో ఒక వైపు స్త్రీలు వెదురు తడకలు కట్టించుకొని పాయఖానాగా ఉపయోగించుకొంటున్నారు. ఆ స్థలం తనకీయవలసినదిగా ఒక ధనిక రైతు జమీందారు గారికి అర్జీలు పెట్టుకున్నాడు. ఈ అర్జీలను నమోజు చేసినట్లును, వెంటనే తడకలను తీసివేయ వలసినది గానుతణుకు తాణేదారు గారు ఉత్తరువులు జారీ చేశారు. తడకలు తీసివేయడానికి ఎస్టేటు సముద్దారు, నౌకర్లు ఆ స్థలం దగ్గరకు వెళ్లారు. వెంటనే 50 మంది స్త్రీలు అక్కడికి వెళ్ళి తడకలు తీయుటకు వీల్లేదని తెలియజేశారు. దానితో ఉద్యోగస్థులు తిరిగి వెళ్ళిపోయారు. గ్రామ హెడ్ కరణం గారు సదరు స్థలమును ఆక్రమించుకొన్న భూస్వామి పక్షం వహించి అతనికి సహాయం చేస్తున్నాడు. 144 వ సెక్షన్ ప్రయోగించబడ వచ్చునని గ్రామస్థులు ఊహించుచున్నారు.

బొమ్మలూరుకండ్రిక.

ఈ గ్రామం నూజివీడు తాలూకా ఒక అగ్రహారం. అగ్రహారందారు తన భుక్తంలో ఉన్న బీటిని ప్రతి సంవత్సరం పెంచివేస్తూ, గ్రామస్థులు సాముదాయకంగా అనుభవిస్తూన్న పోరంబోకును స్వాధీనం చేసుకుంటున్నాడు. మరొక వైపున, బీడు సరిహద్దుల దాటి, ఊరు వెలుపల ఉన్న యేటి వరకు వ్యాపించింది. అక్కడ నాటబడిన తుమ్మ మొక్కలే బీటికి సరిహద్దు. ఏటికి అవతలఒడ్డున అగ్రహారపు మామిడితోట ఉంది. ఆ తోటకు చుట్టూ వేసిన కంచెను ఏట్లో పాతిపెట్టి హద్దును నిర్ణయించారు. ఏట్లో నడుస్తూంటే ఒడ్డు పొడుగునా తోట, దిగువ కంచె. ఇసుకతో నిండి యున్న ఏటి వొడ్డున రైతుల పశువులు మేయుటకు అవకాశ మేమాత్రమూ లేదు. ఇందు వల్ల అగ్రహారీకుల పశువులకు సమృద్ధియైన మేత లభిస్తూండగా, రైతుల పశువులు ఎముకల గూడుల వలె తిరుగుతున్నాయి. ఏకధారగా వర్షం కురిసే యీ రోజుల్లో రైతుల పశువులకు మేత లేని గతి పట్టింది.

గ్రామంలో ఉన్న 30 కుటుంబాల రైతుల భూములకు పట్టాలు లేవు. పండినదాంట్లో సగం అంబారం చెల్లిస్తే, మిగిలిన సగం అప్పులకు సరిపోతుంది.

ఇక శ్మశానం విషయం. శ్మశానానికి పోయే తోవలో అగ్రహారందారు మళ్ళీ కంప వేసి, దారి లేకుండా చేసి వేశాడు. ఆ భూమిని తన సొంత కమతంలో చేర్చుకుని, దున్ని, వరి ఊడ్చుకొంటున్నాడు.

అగ్రహారందారు తన భూమిని రైతులు ఆక్రమించుకుని, దున్నుకొంటున్నారనే ఆరోపణ నూజవీడు తాలూకా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి వద్ద చేయబడింది. ఆయన విచారణ చేయడానికి ఆ గ్రామం వచ్చారు. ఆయనా, అగ్రహారీకులైన అయ్యవార్లం గారూ మోటారులో రైతులు దున్నుకొనే స్థలం వద్దకు వెళ్ళారు. విచారణ చేయుటకు రైతు లందరూ అయ్య

రైతు లోకం

వార్లం గారి యింటి వద్దకు రావలసినదని కాంగ్రెసు సెక్రటరీ చెప్పగా వారు వెళ్లారు. రైతులు నేడు దున్నుకొంటూన్న భూములు రైతులకు చెందినవో కావో నిరూపించుటకు ఒక లాయరును తెచ్చుకొని, పూర్వపు కోర్టు తీర్పు చదివించుకో వలసిన దనిన్నీ, ఆ విధంగా చేయకపోతే భూములను విడిచిపెట్టి పోవలసినదనిన్నీ, అదీ చేయనప్పుడు పోలీసులకు పట్టి యిస్తాననీ కాంగ్రెసు కార్యదర్శి వారితో చెప్పినాడు. ఇది ఆయన యిచ్చిన "తీర్పు."

ఈ "తీర్పు"కు అనుగుణంగా 27-8-38 వ తేదీని నూజవీడు సర్కిల్ యినస్పెక్టరు, యిద్దరు కానిస్టేబిల్సు ఆ గ్రామం ఒక కారులో అగ్రహారీకులతో కలసి వచ్చి, రైతులకు కాంగ్రెసు సెక్రటరీ గారు సలహా యిచ్చిన సలహాయే ఇచ్చారు. లాయరును తెచ్చుకొని, పూర్వపు కోర్టు తీర్పు చదివించుకోండని పోలీసు అధికార్లు కూడా చెప్పారు! అయితే, పోలీసు అధికార్లు రైతుల వద్ద వ్రేలిముద్రల్తో వాఙ్మూలాలు తీసుకున్నారు; కాంగ్రెసు సెక్రటరీ గారు మాత్రం తీసుకోలేదు. కాంగ్రెస్ కార్యదర్శి వంటి బాధ్యతగల మనిషి, ఇలా ప్రజలకు వ్యతిరేకంగా ప్రవర్తించి, అగ్రహారీకునితో కలవడం క్షంతవ్యం గాదు.

నూజవీడు తాలూకా రైతుసంఘ సమావేశము.

పై సమావేశం 30-8-38 వ తేదీని నూజవీడు రైతు సంఘ కార్యాలయంలో శ్రీ అక్కినేని వెంకటాప్రియ్యగారి అధ్యక్షత క్రింద జరిగింది.

త్వరలో జమీందారీ ఉపసంఘం వారు తమ రిపోర్టును ప్రకటించి, రైతుల కనుకూలమైన మార్పులు ఎస్టేటు ల్యాండ్ ఆక్టులో తీసుకొని రావలసినదనిన్నీ; 1347 వ ఫసలీ శిస్తు రెమిషన్ విషయములో రు 6—4—0 చొప్పున హెచ్చింపబడిన నీటి తీరువాయి రేట్లను రు 5—0—0 లకు లగ్గించుటకు మారు, రు 5—12—0 లకు మాత్రమే తగ్గించుట అన్యాయం కాబట్టి, 1348 వ ఫసలీ కైనా ఇట్టి ఏర్పాటు చేసి, జమీందారీ—రైత్వారీ రైతుల మధ్య విభేదమును చూపవద్దనియు; 30-9-38 వ తేదీతో జమీన్ రైతులు శిస్తులు చెల్లించుటకు ఈయబడిన అవకాశం పూర్తి కానున్నది గనుక, రైతుల బకాయీలు పూర్తిగా చెల్లించి వేయవలెనంటే, ఈ వాయిదాను పొడిగించవలసి యుండును కనుకను, కొన్ని ఎస్టేట్లలో ఉద్యోగస్థులు బుద్ధిపూర్వకంగానే శిస్తులు వసూలు చేసుకొనకుండా ఉండుట వల్లను, సదరు వాయిదాను పొడిగించవలసినదని తీర్మానము చేయబడింది.

తిరువూరు.

తిరువూరు సబ్ రిజిస్ట్రార్ గారిపై మోపబడిన లంచగొండితనపు ఆరోపణలను విచారించుటకు ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ రెజిస్ట్రార్ స్వయంగా వచ్చి, సాక్షులను విచారించాడు. 29-8-38 వ తేదీని రైతుల తరపున సాక్ష్య మిచ్చిన 17 గురు సాక్షులు క్రాస్ పరీక్ష చేయబడ్డారు. 30 వ తేదీని రిజిస్ట్రార్ గారి పక్షమున 5 గురు విచారించబడ్డారు. వీరిచే ఈయబడిన సాక్ష్యమును ఋజువుపరుచుటకు లెక్కల పుస్తకములు తీసుకరావలసినదని రెజిస్ట్రార్ జనరల్ గారు అడిగారు. కాని, ఒక్కరూ చూపలేక పోయారు. 30-8-38 వ తేదీ సాయంత్రంతో విచారణ పూర్తి అయింది. త్వరలోనే తీర్పు ఈయబడుతుంది.

రైతు దినోత్సవం.

1-9-38 వ తేదీని బెజవాడ, ఎలమర్రు, భట్లపెనుమర్రు, నడకుదురు, వాసిరి, పీరులపాడు, నాగాయితిప్ప, చించినాడ, అబ్బూరు, వేంద్ర, శిరిపురం మొదలైన స్థలములలో అఖిల భారత రైతు దినోత్సవం జరుపబడింది. సభలు, ఊరేగింపులు జరిగాయి. ఉత్తర విశాఖ జిల్లా, ఇచ్ఛాపురం తాలూకాలో కపాసుకుర్ది, కునుమపురం, బల్లిపుట్టుగు మాణిక్యపురం మొదలైన గ్రామాలలోను, సోంపేజ తాలూకాలో తలతంపర, జలంత్రా, అంపురం, కేసరిపడ, యెక్కల, దోళగోవిందపురం, అరకసరియాపల్లి, సోంపేట, హరిపురం, మొదలైన గ్రామాల యందును; టెక్కలి తాలూకాలో రాలివలస, పెంటూరు, కాశీబుగ్గ, అక్కవల్లి గ్రామాలలోను రైతు దినోత్సవం జయప్రదంగా జరిగింది.

తూ. గోదావరి జిల్లా తుని తాలూకాలో తొండంగి మొదలైన గ్రామాలలో కూడ జరుపబడింది. ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘాధ్యక్షులచే సూచింపబడిన తీర్మానములు సభలలో అంగీకరింప బడినాయి.

పెదగంజాం.

కృష్ణా కొమ్మమూరు కెనాల్‌కు ఆనుకొని యున్న పెద గంజాం, కనుపర్తి, రాపర్ల, మూచవరం మొద

రైతులోకం

(ప్రక్క పేజీ తరువాయి)

లైన 45 గ్రామాల తాలూకు 20,000 యకరముల భూమికి సదరు కెనాల్ నుండి పంటకాలువ యిప్పించి. సాగుకు తేవలసినదని రైతులు ఒక సంయుక్త రైతు సంఘంగా ఏర్పడి. చాలా రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. మదరాసు మంత్రి వర్గమునకు, జల్లా అధికార్లకు ఎన్నో విజ్ఞప్తులు పంపుకొన్నారు. 24-8-38 వ తేదీని జిల్లా సబ్ కలెక్టరు గారు జిల్లా రైతు సంఘ నాయకులతో యీ గ్రామాలకు వెళ్ళి విచారణ చేశారు.

యాకుబ్ హుసేన్ గారు.

మంత్రియైన శ్రీ యాకుబ్ హుస్సేన్ గారి తూర్పు గోదావరి జిల్లా సంచారంలో పిఠాపురం వచ్చినపుడు ప్రజలు సమర్పించిన స్వాగత పత్రములకు సమాధానమిస్తూ, జమీందారీ ప్రాంతమున అన్నిస్వాగత పత్రములలోను తెలుపకొన బడిన యిబ్బందులు ఒకే మాదిరి యున్న వనియు. వ్యవసాయ సంబంధ మైనవి, పన్నుల గురించి, ముఖ్యముగా తెలుప బడిన వనియు, యీ విషయము లన్నిటని గురించి ఎస్టేటు ల్యాండ్ ఆక్టు కమిటీ ద్వారా ప్రభుత్వము వారు విచారణ చేయుచున్నారనియు, ఆ రిపోర్టు త్వరలోనే ప్రకటితమగుదనియు, చెప్పిరి. అంతవరకు ప్రజలు ఓపిక పట్టవలెననిరి. రైత్వారీ ప్రదేశములలోని వారి కెట్టి సదుపాయాము లున్నవో అట్టి సదుపాయములే జమీందారీ, ప్రాంతముల వారికి కూడ కలుగ జేయవలసిన బాధ్యత తమకు కలదని ప్రభుత్వము వారు గుర్తింపక పోలేదని చెప్పిరి.

పంజాబ్.

లయల్పూరు జిల్లా రైతులు నీటి పారుదల హక్కులకై శాసనోల్లంఘనం 2 నెలలు సాగించారు. వందల కొద్దీ రైతులు అమృతసర్ వచ్చి,జట్లు జట్లుగా 144 వ సెక్షన్ ఉల్లంఘించారు. పోలీసులు వారిని ఎర్రని యెండలో గంటల కొద్ది నిలువ బెట్టారు. లాఠీలతోను, గుర్రములతోను వారిని గాయపరిచారు. పోలీసులు లారీలలో కుప్పలు కుప్పలుగా వేసి. ఆసుపత్రికి తీసుకొని వెళ్ళుటకు మారు అడవులలో పారవేశారు. చూడ వచ్చిన వారిని లాఠీలతో చావ మోదారు. గాయపడిన వారిని రైతు సేవకులు వైద్యాలయమునకు తీసుకొని వెళ్ళితే పోలీసులు వారిని చుట్టు ముట్టి మళ్ళీ లాఠిచార్జీలు చేశారు. సత్యాగ్రహులకు మంచి నీళ్ళు యిచ్చుటకు తెచ్చిన నీటి డబ్బాలు కూడా లాక్కుపోయారు.

ఈ దౌర్జన్యాని కంతా బాధ్యులు రైతు వోట్లచే సింహాసనం యెక్కిన పంజాబు మంత్రి వర్గం వారు.

కొద్ది రోజుల క్రిందటనే పంజాబ్ గవర్నమెంటు వారు నాలుగు బిల్లులు తీసుకు వచ్చి, శాసనం చేశారు. వాటికి "రైతాంగపు బిల్లుల"ని పేరు పెట్టారు. కాని, అవి జమీందార్లకే లాభకరంగా ఉన్నాయి. ఒక వైపు రైతులపై ఘోర దౌర్జన్యాలు, మరొక వైపున జమీందార్లకు చట్టములు, చూస్తే, పంజాబ్ మంత్రివర్గం జమీందార్లకు, భూస్వాములకే నిలిచి యున్నదని స్పష్టపడుతుంది.

పంజాబ్ రైతులలో గలిగిన యీ సంచలనం చూచి, గాభరాపడి 9-8-38 వ తేదీని పంజాబు గవర్నమెంటు 144 వ సెక్షన్ ఉపసంహరించుకుంది. రైతులు జయం పొందారు. రేపు రైతు నాయకులతో పంజాబు ప్రధాని రాజీ షరతులను గురించి సంప్రదించబోతున్నాడు. సరియైన రాజీ కుదరకపోతే, యీ శాసనోల్లంఘనం పంజాబు అంతటా వ్యాపించి తీరుతుంది.

సరిహద్దు

తోరూనవాబ్ యొక్క భూములు దున్నే రైతులు సత్యాగ్రహం సాగిస్తునే ఉన్నారు. ప్రతి రోజూ అనేక మందిని పోలీసులు అరస్టు చేస్తున్నారు. ఒక్క రోజున 240 మందిని అరస్టు చేశారు. వీరిలో కాంగ్రెసు నాయకులు, సోషలిస్టులు, రైతుసేవకులు కూడా ఉన్నారు. రైతు ఉద్యమానికి ప్రోత్సాహం యిస్తూన్న ఒక సోషలిస్టు పత్రిక నుండి గవర్నమెంటు ధరావతు కోరింది. ఈ రాష్ట్రంలో అధి కారంలో ఉన్నది కాంగ్రెసు మంత్రి వర్గం: 6 నెలల క్రితం ఎసంబ్లీలో యీ తోరూనవాబు విధించిన అదనపు శిస్తును ఖండిస్తూ తీర్మానించ బడింది. మంత్రి వర్గం యీ తీర్మానాన్ని బలపరిచింది. కాని, గవర్నరు దీనికి తన అనుమతి నీయలేదు. గవర్నరు యొక్క నిరంకుశ చర్యను ఖండించుచూ ప్రజలలో ఆందోళనను లేవదీయుటకు బదులు మంత్రులు నిర్బంధ విధానం యెడల తటస్థ భావంతో ఉన్నారు.

ఒరిస్సా.

ఈ రాష్ట్రంలో రెండు రైతాంగపు బిల్లులు శాసన సభలో ఆమోదించ బడ్డాయి. కాని, చాలకాలం నుంచి గవర్నరు, వైస్రాయి తమ అనుమతి నీయలేదు. దీనిపై ప్రజలు విపరీతమైన ఆందోళన చేశారు. గవర్నరు అనుమతి నీయకపోతే కాంగ్రెసు సభ్యులంతా రాజీనామా లిచ్చి రావలసినదని అనేక బహిరంగ సభలలో తీర్మానాలు ప్యాసయాయి. ఒరిస్సా రాష్ట్రంలో యీ సమస్యపై పెద్ద ప్రతిష్టంభన యేర్పడే సూచనలు కనపడ్డాయి.

ఈ ఆందోళన ఫలితంగా, మొన్న గవర్నరు ఒక రైతాంగపు బిల్లుకు ఆమోదాన్ని తెలియ చేసాడు. దాని ప్రకారం: జమీందారీ రైతుల భూములలో పెరిగి యున్న ఫల వృక్షాలపై రైతులకు హక్కు వస్తుంది. "మ్యూటేషన్" ఫీజు పూర్తిగా రద్దవు తుంది. జమీందార్ల కీయవలసిన పాతబకాయిలపై వడ్డీ 100 కి 12½ నుండి 6 వరకు తగ్గించ బడుతుంది. అక్రమ నసూళ్ళు శిక్షార్హ మవుతాయి.

రెండవ బిల్లు మదరాసు ఎస్టేటు ల్యాండ్ ఆక్టు సవరణ బిల్లు. ఒరిస్సా రాష్ట్రంలో చేరిన గంజాంజిల్లా మొన్నటి వరకూ మన రాజధానిలోనిదే కాబట్టి యీ బిల్లు కూడా తీసుకొని రావలసి వచ్చింది. ఆరు మాసముల క్రితమే యిది ఒరిస్సా శాసనసభలో ఆమోదించ బడింది. దీని ప్రకారం, జమీన్ రైతులు చెల్లించ వలసివ శిస్తు ప్రక్క నున్న రైత్వారీ రైతులు చెల్లించే పన్నుతో సమానంగా ఉండాలి.

యీ రెండవ బిల్లుకు వైస్రాయి యింకా అనుమతి ఈయలేదు. కాబట్టి, రాష్ట్రంలో దీనిపై కూడా పెద్ద ఆందోళన బయల్దేరింది. రైతు దినోత్సవ సందర్భంలో, సెప్టెంబరు 1 వ తేదీని కట్టక్ జిల్లా రైతులు సుమారు 30,000 మంది జనాపూర్‌లో సమావేశమై, వైస్రాయి యొక్క వైఖరిని ఖండిస్తూ, త్వరలో యీ బిల్లు చట్టం చేయబడకపోతే రాష్ట్రంలో ప్రతిష్టంభన ప్రారంభించబడుతుందని హెచ్చరిస్తూ తీర్మానాలు చేశారు. సోషలిస్టులు, రైతు సంఘ నాయకులు ఉపన్యసించారు.

సంయుక్త పరగణాలు.

ఇక్కడ కూడా కాంగ్రెసు మంత్రి వర్గమే అధికారంలో ఉంది. క్రింది శాసన సభలో రైతాంగపు బిల్లు ఒకటి ఆమోదించబడింది. దాని ప్రకారం జమీందారీ రైతులకు కొంత రక్షణ ఈయబడింది. కాని, పై శాసన సభలో బిల్లు ఓడిపోయింది. కారణం, అక్కడ జమీందార్ల ప్రతినిధులే మెజారిటీలో ఉన్నారు. ఇందువల్ల సంయుక్త పరగణాల రెండు శాసన సభలు కలిసిన సభలో యీబిల్లు తిరిగి చర్చించబడాలి. అక్టోబరు నెలలో యీ సమావేశం జరుగుతుంది.

కాని, యీలోగా జమీందార్లు రాష్ట్ర మంతటా సభలు, కాన్ఫరెన్సులు, తీర్మానముల ద్వారా ఆందోళన చేస్తున్నారు. మీరట్‌లో జరిగిన ఒక కాన్ఫరెన్సులో "కాంగ్రెసు సంస్థ నశించు గాక", "జమీందార్లు వర్ధిల్లుదురుగాక" అనే కేకలు మిన్నుముట్టాయి. గాంధి గారి వద్దకు రాయబారం వెళ్ళడానికి ఆ సభలోనే తీర్మానించ బడింది:

మహారాజ గంజి అనే ప్రాంతంలో రైతులు జమీందార్ల భూములలో వ్యవసాయం చేసుకుంటూ, కోతల కాలం కాబట్టి కోసుకొంటూంటే, జమీందార్లు తుంటరుల సహాయంతో రైతులను నిర్బంధంగా తొలగించి తమ మనుష్యులచేత కోయించు కొంటున్నారు. కాబట్టి అనేక గ్రామాలలో రైతులకు - జమీందార్ల మనుష్యులకూ దెబ్బలాటలు జరుగు తూన్నట్లు వార్తలు తెలియజేస్తున్నాయి. మహారాజ గంజి గ్రామంలో జరిగిన ఒక కొట్లాటలో 7 గురు రైతులు గాయపడి నట్లును, ఒక జమీందారు మనిషి చనిపోయినట్లును పత్రికలు తెలియజేస్తున్నాయి.

అస్సామ్.

దేషర్ బజార్ ప్రాంతము కరీంగనీ డివిజన్ లోనిది. ఈ ప్రాంతంలో 60 గ్రామా లున్నాయి. ఇక్కడ నిర్బంధమైన వెట్టి చాకిరి, భూమి శిస్తులకు కోర్టులో దావాలు అధికమై పోయాయి. రైతు లికతాళలేక పోయారు. 34 గ్రామాలకు చెందిన 10,000 మంది రైతులు చేరి ఒక కేంద్ర రైతు సంఘాన్ని స్థాపించుకొని, పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభించారు. వారి కోర్కెలలో ప్రధాన మైనవి:

1. 1343 వ ఫసలీకి పూర్వం ఉన్న బకాయిలన్నీ రద్దు కావాలి.
2. 1343 వ ఫసలీ శిస్తులను సగం వరకు తగ్గించాలి.
3. 1345 ఫసలీ నుండి ఆదాయంలో నాల్గవ వంతు గాని, ప్రభుత్వ భూములపై గల పన్నుకు 5 రెట్లు యెక్కువ మొత్తం గాని శిస్తు నిర్ణయించబడాలి.
4. వెట్టి చాకిరి రద్దు చేయాలి.

జమీందార్లకు యీ ఉద్యమాన్ని అరికట్టేందుకు సాధ్యం కాలేదు. సిల్‌హట్ డిప్యూటీ కమీషనర్ వచ్చి రాజీ చేశాడు.

గుజరాత్.

నవసారీ జిల్లా, మంగోర్‌లో రైతుల ప్రతిఘటన నిరాఘాటంగా ముందుకు సాగుతోంది. సివిల్ డిక్రీ పేరుతో అన్యాయంగా రైతుల భూములను జమీందార్లు ఆక్రమించుకున్నారు. వెంటనే గుజరాత్ రైతు సంఘ కార్యదర్శి పంగార్‌కర్ గారిని దర్శించి, ప్రత్యక్ష పోరాటానికి నిశ్చయం చేసుకున్నారు. రైతులు తమ కుటుంబాలతో బయలువేరి, ఫారా యిస్తూన్న పోలీసులను లెక్కచేయక, తమ పొలాలలో ప్రవేశించి వ్యవసాయం ప్రారంభించారు. ఎరస్టు లేమీ జరుగకపోవడం ఆశ్చర్యమే! రైతులను నిర్బంధం చేసి ఆఫీసర్లు కొన్ని ఖాళీ కాగితాలపై వేలి గుర్తులు వేయించుకున్నారు.కాని, వెంటనే రైతులు కోర్టుకు తెలియజేశారు.

జర్మన్ నాజీ నరకంలోని కార్మికుల కడగండ్లు

శ్రీ పోలేపెద్ది కృష్ణమూర్తి



జర్మన్ కార్మికోద్యమము.

జర్మనీలో ఫాసిస్టులు అధికారానికి రాక పూర్వము జర్మన్ కార్మికోద్యమం చాలా బలంగా ఉండేది. 1930 సంవత్సరములో జర్మన్ ట్రేడ్ యూనియన్‌లలో 80 లక్షల మంది సభ్యులున్నారు. జర్మనీ యందలి క్రిష్టియన్ జిల్లాలలోని క్రిష్టియన్ ట్రేడ్ యూనియనులలో 1,250,000 సభ్యులున్నారు. ఈ క్రిష్టియన్ ట్రేడ్ యూనియనులు మిక్కిలి మితవాద సంఘాలని వదంతి. ఇంత మితవాదముగా ఉండే యీ క్రిష్టియన్ సంఘాలను కూడా నాజీలు (జర్మనీలోని ఫాసిస్టులు) ఇతర సంఘాలవలెనే భగ్నంచేశారు. ఫాసిస్టులు, పెద్ద పారిశ్రామిక యజమానుల సేవకులు కాబట్టి కార్మిక సంఘాలు ఎంత మితవాదంగా ఉన్నప్పటికీ, ఆసంఘాలు కూలి హెచ్చించుట పనిచేయు గంటలను తగ్గించుట పనిలోని యితర కష్టాలను తొలగించుట మొదలగు వాటి విషయంలో పని చేస్తున్నట్టు తోచేట్టయితే తప్పకుండా భగ్నం చేస్తారు. 1932 నాటికి జర్మనీ రైల్వే పనివారల సంఘంలో 243,611 పనివారలున్నారు. ఇంతే కాకుండా 5000 మంది యింజనీర్లు, ఫైర్‌మన్లు సొంతంగా సంఘాన్ని పెట్టుకున్నారు. కట్టడపు పనివారల సంఘంలో 458,041 పనివారలున్నారు. ఐరన్ అండ్ స్టీలు వర్కర్సు 944,310 మంది సంఘాన్ని యేర్పరుచుకున్నారు. గనులలో పని చేయు పనివారల సంఘంలో 198,358 మంది ఉన్నారు. ట్రాన్‌స్పోర్టు వర్కర్సు యూనియన్‌లో 390,360 మంది ఉన్నారు.

పైన ఉదహరింపబడిన సంఖ్యలు జర్మన్ కార్మికోద్యమం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తయి. 1933 సంవత్సరం మే నెలలో అటువంటి గొప్ప కార్మికోద్యమాన్ని ఫాసిస్టులు నాశనం చెయ్యటానికే, స్వాధీనపర్చుకున్నారు.

నాజీలు అధికారానికొచ్చిన తర్వాత కార్మిక సంఘాల ఆఫీసులలోకి ఫాసిస్టులు ప్రవేశించి డబ్బుతోసహా అచటి వస్తువుల నన్నిటిని స్వాధీన పర్చుకొనిరి. కార్మిక సంఘాల ప్రచురణ యంత్రాలన్నియు భగ్నము కావింపబడెను. అనేక లక్షల వరకు ఉన్న కార్మిక సంఘాల మూలధనమును ఫాసిస్టులు స్వాధీన పర్చుకున్నారు. కొందరు నాయకులను చంపేశారు. మరి కొందరను చిత్రవధ చేశారు. ఇంకా కొందరను జీవన్మృత్యుశాలలనదగు కాన్‌సెన్‌ట్రేషన్ కాంపులలో పడేశారు. నరక కూపాలనదగు యీ కాన్ సెన్‌ట్రేషన్ కాంపులలో త్రోయబడిన వేలకొలది కార్మిక నాయకులకు, కార్మికోద్యమాభిలాషులకు, వర్గ చైతన్యముగల కార్మికులకు యిప్పుడు వారి హృదయాలే వారికి ఆహారమవుచున్నయి. ఇంత హీనాన్ని అనుభవిస్తున్న వీరు చేసిన ద్రోహమేమిటి? కార్మికుల హక్కులను కాపాడుటకు ప్రయత్నించుటే; కార్మిక దృక్పధాన్ని ప్రాతినిధ్యం వహించుటే; అదే పెట్టుబడిదారుల గులాములగు ఫాసిస్టుల దృష్టిలో ద్రోహం.

ఫ్యాక్టరీ కౌన్సిళ్ళను రద్దుపర్చారు.

జర్మన్ కార్మికోద్యమ జీవితంలో ఫ్యాక్టరీ కౌన్సిళ్లు చాలా ముఖ్యమైనవి. నాజీలు అధికారానికి రావటంతోనే యీ ఫ్యాక్టరీ కౌన్సిళ్ళను ముందుగా మింగేశారు. జర్మన్ రిపబ్లిక్ 1920 లో ప్యాస్‌చేసిన చట్టము ద్వారా అన్ని పరిశ్రమలలోని కౌన్సిళ్ళను గుర్తించింది. ఈ కౌన్సిలు సభ్యులు ప్రతి సంవత్సరము పనివారలచే ఎన్నుకోబడేవారు. ఈ ఎన్నికలను సక్రమముగా జరుపు బాధ్యత పూర్తిగా కార్మిక సంఘాలదే. ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు స్వతంత్రంగా సమావేశమవుతూ ఉండేవి. ఈ సమావేశాలకు యజమాను లెవ్వరూ వచ్చేవారు కారు. ఈ కౌన్సిళ్ళు యెల్లపుడు పనివారి హక్కులను కాపాడుటకు పనిచేస్తూ ఉండేవి. కూలి, పని కాలము, పనిలోని పరిస్థితులు యజమాని యిష్టానుసారం మార్చబడగలవని జర్మన్ రిపబ్లిక్ నాటి కార్మికుడెన్నడు అనుకొనలేదు. అతను పని చేయుచోట ఫ్యాక్టరి కౌన్సిలు, జాతీయంగా కార్మిక సంఘము తనకు కొంత వరకు రక్షణ నిచ్చును అని నాటి కార్మికుడు పూర్తిగా నమ్మెను.

కాని యిప్పుడు ఫాసిస్టులు అధికారానికి వచ్చిన దేశాలలో యిదంతా మారిపోయింది. జర్మనీలో అన్ని పరిశ్రమలలోను వ్యాపించి యుండే కార్మిక కౌన్సిళ్ళ పద్ధతిని నాజీలు నాశనం చేశారు. దానిస్థానే కాన్ఫిడెన్సు కౌన్సిళ్ళను యేర్పాటు చేశారు. ట్రేడ్ యూనియన్‌లను ధ్వంసముచేసి వాటి స్థానే లేబరు ఫ్రంటును యేర్పాటు చేశారు. ఫాసిస్టులు కార్మికుల నోటిదగ్గర కూడును లాక్కొని నోట గడ్డ కొట్టారు.

ఫ్యాక్టరీ కౌన్సిళ్ళకు, కాన్ఫిడెన్సు కౌన్సిళ్ళకు బేధము.

ప్రతినిధి ఎన్నికలకు సంబంధించినది మొదటి బేధము. పూర్వపు కౌన్సిళ్ళ (ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ) ఎన్నికలపుడు కార్మిక సంఘాలే, యజమానితో సంప్రదింపుకూడా లేకుండా, ప్రతినిధుల లిష్టులను తయారు చేసేది. కాని, నాజీలు స్థాపించిన కాన్ఫిడెన్సు కౌన్సిళ్ళకు ప్రతినిధులను నిలబెట్టేది ట్రేడ్ యూనియన్ కాదు. ప్రతినిధులను నిర్ణయించే అధికారము యిద్దరికిమాత్రమే ఉంది. యెవరా యిద్దరు? (1) ఫ్యాక్టరి యజమాని (2) నాజిపార్టీ తరపున స్థానికంగా ఉండు సభ్యుడు. ఫ్యాక్టరి యజమానిచేత, యజమానులకు గులాములుగా ఉండే ఫాసిస్టు పార్టీ సభ్యుల చేత నమ్మకంగా తయారుచేయబడిన, లిష్టులో నుండి ఎన్నుకోబడిన పనివారల కౌన్సిలు సాధారణంగా పనివారల హక్కులను కాపాడ లేదని ప్రతివారూ స్పష్టంగా తెలుసుకోవాలి. స్థానికంగా నుండు నాజీపార్టీ సభ్యునితో సంప్రదించి ప్రతినిధి లిస్టులు తయారు చేసేటప్పుడు ఫ్యాక్టరి యజమాని, సర్వసాధారణంగా తన లాభాలను కాపాడ తాడనే నమ్మకం తన కెవరిమీద ఉంటుందో వారి, పేర్లను మాత్రమే, లిష్టులో కెక్కిస్తాడు.

పూర్వపు కౌన్సిళ్ళు యజమానితో యేవిధమైనసంబంధం లేకుండా పని చేసేవి-యజమాని కౌన్సిల్ మీటింగులకు కూడా వెళ్ళేవాడు కాదు. ఫాసిస్టు జిత్తులమారితనంయొక్క ప్రతిబింబమన దగిన యీ కాన్ఫిడెన్సు కౌన్సిళ్ళ విషయం అట్లాకాదు. ఈ దిగువ విషయం గుర్తించుకొన తగినది: ఫ్యాక్టరి యజమానే కాన్ఫిడెన్సు కౌన్సిల్ యొక్క చైరుమన్: పనివారల కౌన్సిలుకు చైర్‌మన్‌గా ఉన్న ఫ్యాక్టరి యజమానే మీటింగులను సమావేశ పరచును. చర్చలను సాగించును. ఫాసిస్టు జర్మనీలో ఫ్యాక్టరీ యజమాని "ఫ్యాక్టరీ లీడరు" అని పిలువ బడును. ఆ ఫ్యాక్టరీ రాజ్యంలో యజమానిని కొద్దిపాటి హిట్లర్ అని చెప్పవచ్చు. పనివారలను దోపిడి బీదతనము అనే ఊబిలోకి నడపటం అనే అర్ధంలో యజమాని నిజంగా లీడరు అనే చెప్పవచ్చు.

ఇంకొక భేదము. స్వతంత్రంగా ఒక నిశ్చయానికి వచ్చే అధికారము పూర్వపు ఫ్యాక్టరీ కౌన్సిళ్ళకు ఉన్నది. ప్రతి ఒక్క పనివానికి సంబంధించిన ప్రతి ఒక్క విషయాన్ని (కూలి, పని కాలము, అన్యాయముగా పనిలోనుంచి తొలగించుట మొదలైన వాటిని) గురించి పూర్వపు ఫ్యాక్టరీ కౌన్సిళ్ళు శ్రద్ధగా పని చేసేవి. అవే బహిరంగ పోరాటాలుగా పరిణమించి నపుడు కార్మిక నిశ్చయాన్నే ఆచరణలోకి తీసుకు రావటంలో కార్మిక సంఘాల శక్తి స్తోమతుగా ఉండేది. ఫాసిస్టులు జర్మన్ కార్మికులకు ప్రసాదించిన "కాన్ఫిడెన్సు కౌన్సిళ్ళకు" అటువంటి స్వతంత్ర శక్తిలేదు. ఈ కౌన్సిళ్ళు కొన్ని విషయాలను గురించి చర్చించ వచ్చు. కాని వీటియొక్క చర్చావకాశము అనేక హద్దులకు లోబడి ఉంది. పని ఎప్పుడు మొదలెట్టాలి, ఎప్పుడు ఆపెయ్యాలి, ఎంత చెయ్యాలి అనే విషయాలే యీ కాన్ఫిడెన్సు కౌన్సిళ్ళు చర్చింప తగిన విషయాలు. ఈ కౌన్సిల్ సభ్యులలో కొందరు ఫాసిస్టు రహస్య పోలీసు గూఢచారులే.

లేబరు ఫ్రంటు.

జర్మనీలో ఫాసిస్టులు కార్మికోద్యమాన్ని రూపుమాపి దాని స్థానే లేబరు ఫ్రంటును నెలకొల్పారు. ఇంతకు పూర్వపు కార్మిక సంస్థలు ఫాసిస్టులు నెల కొల్పిన యీ లేబరు ఫ్రంటుకు యే విధంగానూ సరి రావు. లేబరు ఫ్రంటు అధికార రీత్యా ఫాసిస్టు గవర్నమెంటుకు, ఫాసిస్టు పార్టీకి సంబంధించి ఉంది. పనివారల పరిస్థితిని చక్క చేయుటకు అది యే విధంగాను ప్రయత్నించదు.

హిట్లరు తన పార్టీని జాతీయ సోషలిస్టు పార్టీ అని పిల్చుకుంటాడు. జర్మనీలో జాతీయ సోషలిజమ్ (ఫాసిజమ్, నాజిజమ్) అధికారానికి వచ్చిన మొదటి రోజుల్లో కొంత మంది కార్మిక నాయకులు జాతీయ సోషలిజమ్ (ఫాసిజమ్, నాజిజమ్) కొంత మంచిని చేస్తుందని అను కున్నారు. కాని పెట్టుబడి దార్ల దగ్గర లంచాలు తిన మరగి, మానాభి మానాలు వదలు కున్న కొందరు రాజకీయ ద్రోహుల చేత జాతీయ సోషలిజమ్ అనే పేరుతో ఫాసిజమ్ అనే ఊబిలోకి యీడ్వ బడుతున్నామని అపుడు వారనుకొన లేదు. కాని వారిలో కొందరు యజమానుల జేబులను నింపటానికి పనేమి లేకుండా యెక్కువ జీతాలతోటి పెద్ద ఉద్యోగాలను సృష్టించటానికే "లేబరు ఫ్రంటు" యేర్పడ్డదని త్వరలోనే తెలుసుకున్నారు.

లేబరు ఫ్రంటు పనివారల వెన్నెముకను విరకొట్టుతుంది.

"డెర్ డెటిష" అనే లేబరు ఫ్రంటు పత్రికలో డాక్టర్ లీ అనే ముఖ్యోద్యోగి "కార్మిక సంఘోద్దేశమే సమూలంగా నాశనం చేయబడాలి, అనేది సర్వ కాల సర్వావస్థలయందు స్పష్టంగానే ఉంది" అని వ్రాశాడు. అదే వ్యాసములో "గడచిన ఆరు మాసాలలో కార్మిక సంఘము యొక్క ఊహా విధానాన్ని సమూలంగా పెకిలించి వేయ గలిగాను" అని యింకో చోట వ్రాశాడు. ఆ విధంగా లేబరు ఫ్రంటు యొక్క ముఖ్య నాయకుడు తన సంస్థ కార్మిక సంఘము విధులలో ఒక దానిని కూడా నెరవేర్చదని ఒప్పుకుంటున్నాడు. అయితే యీ లేబరు ఫ్రంటు చేసే పనేమిటో తెలుసుకోవాలని చదువరి ఆతురుడై ఉండవచ్చు. నాజీ ప్రచారాన్ని చేయ్యటమే లేబరు ఫ్రంటు యొక్క ముఖ్యమైన పని. లేబరు ఫ్రంటు పనివారలకున్న ఆట స్థలాలను, ఆట వస్తువులను ప్రతిఫలం లేకుండా స్వాధీనపర్చుకున్నారు. నాజీలు లేబరు ఫ్రంటు సభ్యత్వాన్ని విచిత్రంగా అభివృద్ధి చేస్తారు. మరొకసారి [illegible] లీ యీ విధంగా చెప్పాడు:— "[illegible] సభ్యుడుగా చేరని వానికి జర్మనీలో [illegible] దనియే మేం నమ్ముతాం. ఫ్యాక్టరి యజమానులు, యితర వ్యాపారస్థులు కూడా లేబరు ఫ్రంటు సభ్యులుగా చేర్తారు. సభ్యులంతా యిచ్చే చందాలో నాజీ ప్రచారానికి కొంత పోతుంది. సోమరి పోతులగు ఉద్యోగులనేకులను పోషించుటకు కొంత ఖర్చవుతుంది. ఆయుధాలను తయారు చేయించటానికి ఫాసిస్టు ప్రభుత్వానికే ఎక్కువ డబ్బు పోతుంది. లేబరు ఫ్రంటు చందా అనేది నిజంగా నిర్బంధమగు అదనపు పన్ను.

లేబరు ఫ్రంటును పరిపాలించేది యజమానులే.

లేబరు ఫ్రంటునందు కార్మికులే కాకుండా యజమానులు, కంపెని డైరెక్టర్లు, యేజంట్లు మొదలైనవారు కూడా సభ్యులే. యజమానుల సంఘాలు లేబరు ఫ్రంటునందు ఒక భాగముగా ఉన్నచో మిల్లుయజమానుల సంఘం మన ట్రేడ్ యూనియన్ కాంగ్రెసునకు అనుబంధింపబడినపుడు మన కార్మికోద్యమపు పరిస్థితి ఎట్లా ఉంటుందో చదువరులు ఊహించుకొన వలసి

(మిగతా ప్రక్క పేజీలో)

జర్మనీలో కార్మికుల కడగండ్లు

(7వ పేజీ తరువాయి)

నదే. పెట్టుబడిదారులు లేబరు ఫ్రంటు నందు సభ్యులుగా ఉండటమే కాకుండా వారే నాయకులు కూడాను.

లిప్జిగ్ ఒడంబడిక నందు "లేబరు ఫ్రంటు" యొక్క జిల్లా బ్రాంచీలకు ఒక పరిశ్రమ యజమాని వైస్ చైర్మన్‌గా గాని, లేక వైస్ చైర్మన్‌గాగాని ఉండి తీరాలి అని స్పష్టముగా ఉదహరింపబడి ఉంది. చైర్మన్‌గాగాని లేక వైస్ చైర్మన్‌గాగాని యజమాని కాకపోయినట్టయితే లేబరు ఫ్రంటు కేంద్రముచే నియమింపబడే ఫాసిస్టు పార్టి సభ్యుడు ఉండాలి.

జర్మన్ ఫాసిస్టులు కార్మిక సంస్థలను నాశనం చేశారుగాని యజమానుల సంఘాల జోలికి పోలేదు. ఫాసిస్టులు అధికారానికి రాకపూర్వం పెద్ద దాబులు కొట్టినప్పటికి, పెట్టుబడిదారుల సంఘాలనుగాని, వాటి డబ్బునుగాని కన్నెత్తి చూడటానికైనా సాహసించలేదు. దీనికి కారణం యేమిటి? ఈ ఫాసిస్టులు దౌర్జన్యంచేసి, మోసంచేసి అధికారానికి రావటానికి యీ పెట్టుబడిదారులు రహస్యంగా యిచ్చిన లంచాలే వీలు కలుగజేసినయి. కాని యీ ఫాసిస్టులు యజమానుల సంస్థలను రద్దు పరుస్తామని కొంత గలభా చేశారు. నిజానికి యిది ఫాసిస్టు గూఢపుతాణి లప్ప వేరుకాదు. ఈ ఫాసిస్టులు చేసే "సామ్యవాద" ప్రతిజ్ఞలలో నమ్మకం ఉంచినటువంటి వారిని అనమ్మికతోనే ఉండేట్టు మోసం చెయ్యాల్సిన అవసరం యింకా అప్పటికి ఉండటంవల్ల ఆ విధమైన బహిరంగ మోసాన్ని చేశారు. చందాలను ముట్టుకోకుండా యజమానుల సంఘాలను ఒక రోజున రద్దు పర్చారు. రెండోరోజున మారు పేరుతో అవి తిరిగి ప్రత్యక్షమయి రోజు రోజుకు బలవత్తరమవుతున్నయి.

ఫాసిస్టులు యజమానులను నిర్మాణ పూర్వకంగా బలవంతులుగా చేసి కార్మికులను రక్షణ లేని వారినిగా చెయ్యటం మూలంగా కార్మికులను యజమానుల దయా ధర్మ బిచ్చం మీద ఆధారపడి ఉండేట్టుగా తయారుచేశారు. ఫాసిస్టులు యజమానులకు ఒక ఉద్యోగాన్ని నెరవేర్చారు. జాతీయంగా ఫాసిస్టులు సమ్మె విఘాతకులుగా ప్రవర్తించారు. ప్రజా సామాన్యాన్ని దోపిడిగాండ్రకు అందించటం మూలముగా ఫాసిస్టులు ప్రజా ద్రోహులైనారు. నాజీ (ఫాసిస్టు) జర్మనీలోను, ఫాసిస్టు ఇటలీ లోను పనివారలు సమ్మెచేసే హక్కు లేకుండా చేయబడ్డారు. ఇటలీలోగాని, జర్మనీలోగాని పనివారలు వారనుభవిస్తున్న నీచావస్థలకు తమ యొక్క నిర్మాణ పూర్వకమైన వ్యతిరేకతను చూపించే ప్రయత్నం చేసినా వారు శాశ్వతంగా కాన్సెన్ట్రేషన్ కాంపులలో నివశించాలిసిందే.

యజమానిని అంటిపెట్టుకొని ఉండాల్సిందే.

1934 జనవరి 20 వ తేదిన అమల్లోకి తీసుకురాబడిన "జాతీయ శ్రమను నడిపేటటువంటి చట్టము" నందలి రెండవ పేరాలో యీ క్రింది విధంగా ఉన్నది. "యే పరిశ్రమలో నైనప్పటికి తీర్మానాలను చేసే అధికారము ఒక్క యజమానికే ఉన్నది" యజమాని "ఫ్యాక్టరి యొక్క నాయకుడు అని పిలువబడతాడు" పనివారలు అతని "అనుచరులు".

జర్మన్ కార్మికుడొకడు తన ఫ్యాక్టరి నాయకుని తరహా నచ్చక యింకోచోట పని కుదుర్చుకుందాం అని అనుకున్నాడంటే అతను చచ్చిందాక ఉపవాసం చెయ్యటానికి ఒప్పుకున్నాడని మనం అనుకోవాలి. ఫాసిస్టు పద్ధతి నిజంగా మధ్య యుగంనాటి జమీందారి దౌర్జన్యాన్ని పోలిఉంది. ఫాసిస్టు జర్మనీలో లేబరుకు సంబంధించిన చట్టాలన్నింటిలోను అవసరమైన కట్టుబాట్లు అనేకం కనపడతై. వ్యవసాయదారి కూలీలు పట్నాలలోకి వచ్చి కూలి పని చేసుకునేందుకు వీల్లేదు. అదే విధంగా పట్టణాలలోని పనివారు పల్లెలో పని చేసుకుని జీవించడానికి కూడా వీలులేదు. పొలాలలో నిర్బంధగా పని చేయాలసిన పద్ధతి ఒకటుంది. అంతే కాకుండా పనివారలెక్కడకైనా పోవాలంటే పాస్‌పోర్టు ఉండి తీరాలి. సంవత్సరానికి 8 వేల మార్కులు (సుమారు 650 పౌనులు) కంటె తక్కువ సంపాయించే ప్రతి వాడి దగ్గర ఈ పాస్‌పోర్టు ఉండి తీరాలి. సాధారణంగా పరిశ్రమలలో పెద్ద యింజనీర్లకు, డైరెక్టర్లకు తప్ప యితరులెవ్వరికి యింత గాని, యింతకంటె ఎక్కువ గాని జీతముండదు: యీ పాస్‌పోర్టు ఎప్పుడుపడితే అప్పుడు తనిఖీ చేసే అధికారము పోలీసులకు ఉంది. ఫాసిస్టు పార్టి ఉద్యోగులకు యీ నిర్బంధముండదు.

జర్మనీలో ఫాసిస్టులు కార్మికులను పూర్తిగా బానిసలను చేశారు. కార్మికసంఘాన్ని, ప్రెస్‌ను భగ్నం చేశారు. ఫాసిస్టు పార్టీ ఒకటి తప్ప మిగతా అన్ని రాజకీయ పార్టీలు నిషేదింపబడ్డాయి. వేలకు వేల కార్మికులు, కార్మిక నాయకులు జైళ్ళలోను, కాన్సెన్ట్రేషను కాంపులలోను మగ్గుతున్నారు. కార్మికవర్గ హక్కులను కాపాడుటలో చురుకుగా పనిచేశారని అనేక మందిని ఖూనీ చేశారు యీ నేషనల్ సోషలిస్టులు (ఫాసిస్టులు). కార్మికులు తమ అసంతృప్తిని మాటలతోనైనా వెలిబుచ్చుటకు వీలు లేదు. ఇప్పటికీ వారి హృదయాంతరాళాలలో ప్రజ్వలించుచున్న "స్వతంత్ర సంపాదన" అనే దృఢమైన కోరిక తప్ప జర్మన్ కార్మికులకు యితర రక్షణ లేదు. వారి శక్తి యందలి నమ్మకయే వారి ఆధారము.

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యనిర్వాహక వర్గము, 2, 3 వ తేదీలలో బెజవాడయందు జొన్నలగడ్డ రామలింగయ్యగారి అధ్యక్షతను సమావేశమై ఈ క్రింది తీర్మానాలు గావించింది.

1. కార్మికులు చేయు పికిటింగు దౌర్జన్యముతో కూడుకొని ఉంటుందని, అట్టి పికెటింగును పోలీసు సహాయంతో కూడ అణచవచ్చునని గాంధిగారు యిచ్చిన స్టేటుమెంటు, కూలీలకు సమ్మె చేయు హక్కు, పికెటింగు చేయు హక్కు ఉండవలసినదని చెప్పిన కాంగ్రెసు యెన్నిక ప్రణాళికకు కేవలం విరుద్ధముగా ఉన్నదనియు, ప్రజా ఉద్యమం పై సామ్రాజ్యవాదపు నిర్బంధ విధానం, దౌర్జన్యం తీవ్ర మగుటకు సాయపడు తున్నదని, స్వాతంత్ర్య పోరాటానికి తీరని హాని కలుగ చేయునని అభిప్రాయ పడుతూ, ఆ స్టేటుమెంటులో వ్యక్తమైన గాంధిగారి సంకుచిత ధోరణిని ఈ సభవారు ఖండించుచున్నారు.

2. భారత దేశపు ప్రజా సామాన్యాన్ని నిర్బంధంగా, సామ్రాజ్యవాద యుద్ధంలో తమకు సాయంగా నుండేట్టుగా, సైన్యంలో చేర్చుకొనుటకు గాను బ్రిటిషు ప్రభుత్వం అమల్లోకి తీసుకొనివచ్చిన క్రిమినల్ లా సవరణ చట్టము, ఈ దేశములోని ప్రజాతంత్ర శక్తుల యొక్క యుద్ధ ప్రతికూల ప్రచారాన్ని ప్రజాతంత్ర హక్కులను, వీటి కొరకు మనం చేయు ప్రజా పోరాటమును నాశన మొనర్చును గాన దానిని ప్రవేశ పెట్టిన బ్రిటిషు ప్రభుత్వపు నిరంకుశ చర్యను తీవ్రంగా ఖండించుచు, ఈ బిల్లును ప్రతిఘటించుటకు గాను, వివిధ జిల్లాలలోని పార్టీ శాఖలన్నీ కాంగ్రెసు మొదలగు యితర ప్రజా సంఘాలన్నిటితోను కలిసి తీవ్ర ప్రచారము గావిస్తూ ప్రతి నెల మొదటి తారీఖున నిరసన సభలు జరపాలని, పై సంఘాలన్నిటి సహకారంతో బ్రహ్మాండమైన యుద్ధ ప్రతికూల సభలను విరివిగా జరపాలని యీ సభవారు కోరుతున్నారు.

ఈ సందర్భంలో, కరపత్రముల ద్వారా కూడా ప్రచారం సాగించుటకు గాను, రాష్ట్రపార్టీ నెల కొకసారి యుద్ధ ప్రతికూల పత్రములను ప్రచురించుతూ నుండవలెను.

3. హిందూస్తానీ ప్రతికూల ప్రచారాన్ని దృష్టిలో పెట్టుకొనే కృష్ణమాచారిగారు క్రిమినల్ లా అమెండు మెంటు ఆక్టును రద్దుచేయమని కోరుతూ తీర్మానమును తీసుకొనివచ్చినప్పటికీ క్రిమినల్ లా ఆక్టు ప్రజా ఉద్యమమును అణచు సామ్రాజ్యవాద నిర్బంధ చట్టాలలో నొకటి కాబట్టి, దానిని రద్దుచేయమని కోరుతున్న ఆ తీర్మానమును మన కాంగ్రెసు మంత్రిత్వం ప్రతికూలించ కుండా ఆచట్టమును రద్దుచేసి యుండవలసినది. ఆ విధంగా చేయక కృష్ణమాచారిగారి తీర్మానాన్ని వ్యతిరేకించి నందులకు కాంగ్రెసు మంత్రివర్గం వారు కాంగ్రెసు యెన్నిక ప్రణాళిక యేమాత్రము పాటించలేదని అభిప్రాయపడుతూ వారి చర్యను యీ సభవారు ఖండించు చున్నారు.

మద్రాసు మంత్రివర్గం యీ ఆక్టును త్వరలో రద్దు చేసేందుకుగాను రాష్ట్రంలోని కాం. సో. పార్టీలు, కాంగ్రెసు మొదలగు ప్రజా సంఘాలు కలిసి తీవ్ర ఆందోళన సాగించ వలసినదని కోరుతున్నారు.

4. ప్రజాతంత్ర హక్కుల కొరకు ప్రజాతంత్ర పద్ధతికొరకు ట్రివాంద్రంలోని ప్రజలు అచ్చటి స్వదేశ సంస్థాన ప్రభుత్వంతో పోరాడుతూ, ప్రభుత్వం వారు ఉపయోగించుచున్న క్రూర నిర్బంధ విధానానికి గురియగుతూ కూడ యేమాత్రం జంకకుండా యింకా పోరాటాన్ని సాగిస్తున్నందులకు వారిని యీ సభవారు అభినందించుతూ వారి హక్కులు సంపూర్ణముగా వచ్చేంతవరకు పోరాటాన్ని తీవ్రంగా సాగించ వలసినదని కోరుచున్నారు.

ఒకచెంప బాధ్యతాయుత ప్రభుత్వ మిస్తామని బూటకపు కబుర్లు చెబుతూ, మరియొక చెంప, అట్టి బాధ్యతాయుత ప్రభుత్వం కొరకు సక్రమాందోళన చేస్తున్న ప్రజా సామాన్యంపై నిరంకుశ నిర్బంధ విధానమును ప్రయోగిస్తున్న సంస్థాన ప్రభుత్వపు నిరంకుశత్వమును తీవ్రంగా ఖండించు చున్నారు.

సంస్థాన ప్రజల పోరాటాలపట్ల మూకీభావం వహించి ఊరుకోవటం కాంగ్రెసు నడుపుతున్న స్వరాజ్య పోరాటానికి నష్టదాయకం కాబట్టి, ట్రివాంద్రం ప్రజల పోరాటానికి సాయంగా నిలబడి వారు కోరుతున్న ప్రజా తంత్ర హక్కులు లభించు నంతవరకు వారి పోరాటమును ప్రోత్సాహ పర్చవలెనని అఖిలభారత కాంగ్రెసు వర్కింగు కమిటీని యీ సభవారు కోరుతున్నారు.

5. కాంగ్రెసు మంత్రివర్గం చేత ప్రవేశ పెట్టబడిన బొంబాయి కార్మిక బిల్లు కార్మికుల యజమానుల తగాదాల సందర్భాల్లో కన్సిలియేషన్ బోర్డు యొక్క గాని, ఆర్బిట్రేషన్ బోర్డు యొక్క గాని తీర్పును కార్మికులపై నిర్బంధ పరచి వారు సమ్మె చేసుకొనే అవకాశాలను తొలగించటం కంపెనీ సంఘాలను ప్రోత్సహించటం, రిజిస్ట్రేషను కోసం కంపెనీ సంఘాలకు తక్కువ సభ్యత్వపు సంఖ్యను, స్వతంత్ర సంఘాలకు యెక్కువ సభ్యత్వపు సంఖ్యను నియమించటం, మొదలగు అడ్డంకులను కార్మికోద్యమానికి కలుగ చేయడము కార్మికులను కాంగ్రెసు నుంచి, స్వాతంత్ర పోరాటమునుంచి వేరు చేయడమే. కాబట్టి యీ బిల్లు కాంగ్రెసు ఉద్యమానికి దోహదము కాజాలదు, అట్టి బిల్లును ప్రవేశ పెట్టిన బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గంవారి చర్య కాంగ్రెసు యెన్నిక ప్రణాళిక అంగీకరించిన ప్రజా కార్యక్రమమునకు పూర్తి విరుద్ధమగుటయే గాక సామ్రాజ్యవాదుల పెట్టుబడిదారుల నిరంకుశత్వమును దోపిడిని ప్రోత్సహించు చున్నది, కాన యీ సభవారు తీవ్ర నిరసనను ప్రకటిస్తున్నారు.

7. మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలో వుండగానే, యిదివరకు నిషేధింపబడిన గ్రంధాలు కొన్నిటిపై నిషేధం తొలగించక పోవుటయేగాక క్రొత్తగా 1905 రష్యా విప్లవము, మన్యంలో రైతుల తిరుగుబాటు, పుస్తకాలను నిషేధించుట కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికకు విరుద్ధమనియు పౌరసత్వ హక్కులకు భంగకరమనియు, యీ సంఘమువారు అభిప్రాయపడి, తీవ్ర అసమ్మతి తెలియజేస్తూ వెంటనే రాజకీయ పుస్తకాలన్నిటిపై నిషేధముల తొలగించ వలెనని మంత్రివర్గము వారిని కోరుచున్నారు.

8. మద్రాసు ప్రభుత్వమువారు ప్రకటించిన పోలీసు రిపోర్టులో రైతు కార్మిక పోరాటాలను క్రిమినల్ (నేరముల) శాఖలో జేర్చుట, ప్రభుత్వపు అధికార దురహంకారాన్ని తెలియ జేస్తున్నది. కాంగ్రెసు మంత్రుల హయాములో కూడ ఉద్యోగుల మనస్తత్వంలో మార్పు రాలేదని పై సంగతి ఋజువుజేస్తూంది, ప్రజాందోళన ప్రజా చైతన్యమే బలముగా కల్గిన కాంగ్రెసు మంత్రులు, రైతు, కార్మికుల ఉద్యమాలను క్రిమినల్ చర్యలలో చేర్చుటకు అవకాశ మిచ్చినందులకు విచారపడుతూ వెంటనే అట్టి పొరపాటులను రానివ్వకుండా జాగ్రత్త పడవలసినదిగా హెచ్చరించు చున్నారు.

[కమ్యూనిస్టుల గురించి మద్రాసు ప్రభుత్వము గావించిన కమ్యూనిక్‌పై తీర్మానము (6 వ తీర్మానం) మరొకచోట ప్రచురించినాము. గమనించ ప్రార్థన—సం.]

[redacted]ప్యాట్ బిల్లు సవరణలు మారాలి

[redacted]ను ప్రభుత్వాలు కార్మికుల హక్కుల భగ్నపఱచే [redacted]క్లాజులను మార్చుటకు సలహాల నీయాలి.

[redacted] ఎవరును అంగీకరించకూడదని తీర్మానించబడినది. అప్పుడే ఈ తీర్మానమును రెండు ప్రెస్సులలో కార్మికులు యజమానులకు తెలియజేసిరి. కొందరు ప్రెస్సు యజమానులు కార్మికులను ఏదో విధముగా మభ్యపెట్టి, వారిని చీలదీయుటకు ప్రయత్నములు చేయుచుండిరి. యజమానుల యీ మోసమును కార్మికులు తెలుసుకొన్నారు.

ఏలూరు ప్రెస్సులలో జనరల్ స్ట్రయికు వచ్చునను వార్తలు రూఢిగా తెలియుచున్నది. యజమానులు ఇచ్చిన యీ గడువు కాలము 15 రోజులూ కార్మికులు వృధాగా గడపరాదు. తమ బలమును పెంచుకొనుటకును, తమకు జరుగుచున్న అన్యాయాన్ని గూర్చి పట్టణములోని మూలమూలనున్న ప్రజలకుకూడా తెలియజేసి వారి సంపూర్ణ సానుభూతిని సంపాదించుకొనుటకును, యీ గడువును వినియోగించుకోవాలి.

లోగడ ఏలూరులో మంజువాణీ ప్రెస్సు కార్మికులు సమ్మె చేయుచుండగా మద్రాసు నుండి 4 గురు వర్కర్సువచ్చి ప్రెస్సులో పని చేయుటచే అసమ్మె భగ్నమైపోయింది. యీ పర్యాయము యజమానుల దాడిని ఎదుర్కొనుటకు కార్మికులు సాగించే పోరాటములో యిట్టి అక్రమాలు జరుగకుండ వేర్వేరు ప్రాంతాలలోనున్న ప్రెస్సు కార్మికులు తగు కట్టుదిట్టములను యిప్పటి నుండియు చేయడం ప్రారంభించాలి. ఏలూరు ప్రెస్సు కార్మికుల పక్షాన అన్ని ప్రాంతాలలోనూ ఆందోళన జరపాలి, ఏలూరు ప్రెస్సు కార్మికులు విజయము నొందుటకు వలయు సహాయాన్ని యావత్తునూచేసి, యజమానుల దాడిని ఎదుర్కొనుటకును దానిని ఓడించుటకును మేము సిద్ధముగా నున్నామని ఆంధ్రదేశపు ప్రెస్సు కార్మికలోకం చాటాలి.

బెజవాడ.

ది 4-9-38 ఆదివారము సాయంత్రం ఊరేగింపుతో బయలుదేరి, కార్మిక హక్కులను కాపాడాలి, ఏలూరు ప్రెస్ యజమానుల నిరంకుశత్వము నశించాలి, అనే నినాదాలతో పురవీధులందు తిరిగి 6-29 గంటలకు కార్మికపురములో యామల గంగరాజుగారి అధ్యక్షతను మీటింగుజరిపిరి. ఏలూరు ప్రెస్ యజమానులు పనివారల మీద దాడి సల్పుటను నిరసించుచూ, యీ క్రింది తీర్మానమును ఏకగ్రీవముగా ఆమోదించడమైనది.

తీర్మానం:—

ఏలూరులో క్రొత్తగా స్థాపించబడిన ప్రెస్ యజమానుల సంఘం[illegible] ప్రెస్ కార్మికుల సక్రమ హక్కులను భగ్నం చేయవలెననే దురుద్దేశంతోనే ఏర్పరచ బడినది గాన యీ సభవారు సదరు సంఘమును పూర్తిగా ఖండించుచూ, ప్రెస్ కార్మికులు తమ యజమానుల దాడిని ధైర్యంతోను, పట్టుదలతోనూ ఎదుర్కొన వలసి నదని హెచ్చరించు చున్నారు.

సామర్లకోట

సామర్లకోట పంచదార ఫ్యాక్టరీ కార్మికులకును యజమానులకును మధ్య, జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగారగు శ్రీ మండపాక రంగయ్య నాయుడుగారు రాజీచేసిరి. కార్మికులకు రెండు రోజుల జీతము అడ్వాన్సు ఇచ్చునట్లు ఈ రాజీలో ఏర్పాటు చేయబడినది. ఆ ప్రకారంగా యజమానులు జీతం అడ్వాన్సు కూడ ఇచ్చివేసిరి.

కార్మిక తగాదా బిల్లుకు సవరణ.

రాష్ట్రాల అభిప్రాయాలకై కేంద్ర ప్రభుత్వము పంపినది.

కార్మిక తగాదా బిల్లుకు, కేంద్ర ప్రభుత్వం ఒక సవరణ చేయదలచింది. "మధ్యవర్తి పరిష్కార సంఘమును గాని విచారణ కోర్టును గాని ఏర్పాటు చేసిన తరువాత, రెండు నెలల వరకు లేదా, ఆ కమిటీ యొక్క గాని, కోర్టు యొక్క గాని నిర్ణయం ప్రకటింపబడే వరకు ఏది ముందు పూర్తి అయితే ఆ గడువులోగా సమ్మె చేయుటగాని, చేయవలసినదని ప్రోత్సహించుట గాని, లేక లాకౌట్ చేయుటగాని చేయవలసినదని ప్రోత్సహించుట గాని, ఏ వ్యక్తియైన చేసినచో అతనికి 3 నెలలు విడిశైదు గాని, రూ 200 డు జరిమానా గాని, లేక రెండూ గాని విధింపబడును" అని యీ సవరణ.

నిరాధారులగు కార్మికులు సుఖ జీవనము చేయాలంటే చాలిన జీతమే అతనికి శరణ్యం. దీనిని సంపాదించు కొనుటకు కూడ ఒక్కటే సాధనం. అది పని. దీనికి యజమానులు తగు ఫలితాన్ని ఇచ్చిననాడు ఏ తగాదాయున్ను రాదు. గాని దీనిని ఎప్పటి కప్పుడు తగ్గిస్తూ, ఉన్న సౌకర్యాలను కూడా రద్దు చేస్తూంటే కార్మికులు వీటిని నిలుపుకొనుటకు వారి చేతులో నున్నది ఒక్కటే సాధనం, అది సమ్మె. యీ సమ్మె కూడ హఠాత్తుగా జరిగితేనే కార్మికులకు లాభం. తగు సన్నాహాలన్నీ చేసుకొనుటకు యజమానులకు తగు గడువు యిచ్చి సమ్మె చేస్తే కూలీలకేం లాభం కలుగుతుంది? అందుచే యీ ఆకస్మిక సమ్మె కార్మికులకు అత్యంతోపయోగకరమగు ఆయుధం.

యీ తగాదాను పరిష్కారం చేయుటకు మధ్యవర్తి సంఘం గాని, మరి ఏ యితర ఏర్పాటు గాని ప్రభుత్వం చేస్తే, తక్షణం సమ్మెను ఆపుచేసి కార్మికులు పనిలోకి వెళ్లాలి అనే నిబంధన యీ సవరణలో కనుపిస్తోంది, ఇది యజమానులకే గాని కార్మికులకేమాత్రం లాభకరం గాదు.

ఇక రెండవది. మధ్యవర్తి పరిష్కార సంఘం తీర్పు ఇచ్చే లోపుగా కార్మికులు సమ్మె చేయుటగాని, దానికి ప్రోత్సహించుట గాని శిక్షాపాత్రం అని వుంది. యజమానుల లాకౌట్లు (మిల్లు మూసివేయుట) మాత్రమే శిక్షార్హమన్నారు. యీ పరిష్కారపు నిర్ణయం ప్రకటితమయే లోపుగా యజమానులు ఒక్కొక్కరినే, పనిలోనుండి తీసివేయవచ్చు. సమ్మె చేసిన కొందరిని మొదటనే తీసుకొనక పోవచ్చు. ఇదీగాక పనిచేయు చున్నపుడు అనేక నిర్బంధాలకు కార్మికులను గురి చేయవచ్చు. కార్మికులను చీలగొట్టుటకు అనేక ప్రయత్నాలు చేయవచ్చు. యీ సందర్భంలో కార్మికులకు సమ్మె తప్ప గత్యంతరం ఏముంది? దానికై శ్రమసోదర కార్మికుల నందరినీ ప్రోత్సాహపరచి తమ బలాన్ని ఐకమత్యను నిలుపుకోక పోతే సమ్మె చేసి ప్రయోజనం ఏమిటి? ఈ సవరణలో కార్మికులకు పూర్తిగా నష్టము కలిగే అవకాశములెన్నో ఉన్నాయి.

మధ్యవర్తి పరిష్కారం ప్రకటన అయిన తరువాత వచ్చే లావాదేవీలను సర్దుకొనుటకు (అనగా దానిని నిరాకరించుటకు కూడా) తగు ప్రయత్నాలను చేసుకొనుటకు యజమానులకు మాత్రము రెండు నెలల గడువు, ఈ సవరణలో ఏర్పాటు చేయబడింది. యీ రెండు నెలలూ ఉన్న కూలీల పని బాపతు లాభం కూడా వారికి మిగులుతుంది.

ఈ విధంగా కార్మికుల హక్కులు పూర్తిగా రద్దు చేయబడుచున్నవి. యీ సవరణను వ్యతిరేకించ వలసినదని వేర్వేరు రాష్ట్రాలలో నున్న కార్మికులు ఆయా ప్రభుత్వాలను తీవ్రంగా ఒత్తిడి చేయాలి. ఏడు రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రులుండుటచే దీనిని వ్యతిరేకించి రద్దు చేయించ వలసినదని కాంగ్రెసు పైనను కాంగ్రెసు మంత్రివర్గాలపైనను కార్మికులు ఒత్తిడి చేయాలి. ఇందులో యజమానులు లాకౌట్లు మాత్రము చేయరాదనే నిర్బంధము మాత్రము ఉంచునట్లును, మిగిలిన క్లాజులు రద్దు అగునట్లును చేయవలసినదిగా కోరాలి. అది వీలు కానిచో సవరణ పూర్తిగానే రద్దు అగునట్లు చూడవలసినదని ఒత్తిడి తీసుకు రావాలి.

కార్మిక సమస్యలు

మద్రాసు

మద్రాసు బస్ వర్కర్ల సమ్మెను ఆపుచేసిన తరువాత, తాత్కాలికపు ఒడంబడికను యజమానులు అమలు జరుపుటలేదని అనేక కంప్లెయింట్లు వచ్చుచున్నవి. యజమానులతో తిరిగి తగాదా వచ్చే సందర్భంలో తటస్థంగా వుండవలసినదని పోలీసులను బస్సు వర్కర్లు ఒక తీర్మానం ద్వారా కోరిరి.

కార్మికులకు ఏ నష్టమూ రాకుండా మేలు చేకూర్చుటకు సహాయపడునట్లు మంత్రి రాజగోపాలాచారిగారు చూడవలసి యున్నది.

శంకరన్ కోయిల్

యిక్కడ బట్టల మిల్లులలో పనిచేసే 5,000 మంది తమకు జీతాలు ఎక్కువ చేయవలసినదని 29 వ తేదీ నుండియు సమ్మె జేస్తున్నారు.

(మిగతా 16 వ పేజీలో)

మన రాజకీయాలు

చైనా సహాయానికి పోవు వైద్యదళానికి సరోజినీదేవి సందేశం

మద్రాసులో మరొక గ్రంథ నిషేధం—పంచాయతీ చట్టం—
మలబారు దేవాలయ ప్రవేశ బిల్లు—రాజకీయ ఖైదీల సమస్య

కామ్రేడ్ పొన్నలూరి రాధాకృష్ణమూర్తి గారిచే రచియింపబడి, అతివాద గ్రంథమండలి వారిచే ప్రచురింపబడిన "మన్యంలో రైతుల తిరుగుబాటు" అనే గ్రంథం మదరాసు ప్రభుత్వం యొక్క నిషేధానికి బలికావలసి వచ్చింది. గుంటూరులో సి. వి. సారథిగారి యిల్లు స్టూడెంట్సు ఎంపోరియంలను, పోలీసులు సోదాచేసి, పుస్తకాలు తీసుకు వెళ్ళారు. మదరాసు రాజధానిలో కాంగ్రెసు మంత్రివర్గం ఆధికారానికి వచ్చాక నిషేధించబడిన రాజకీయ గ్రంథాలలో యిది రెండవది. మొదటిది విశ్వ సాహిత్యమాల వారిచే ప్రచురించబడిన "1905 రష్యా విప్లవం"అనే పుస్తకం.

కాంగ్రెసు మంత్రుల హయాంలోనే రాజకీయ గ్రంథాలపై నిషేధాలు కూడా అమలు జరుపబడు తున్నా యంటే, నూతన రాజ్యాంగ చట్టం ఎంత హానికరమైనదో తెలుస్తుంది. "రాష్ట్రీ స్వపరిపాలన" యొక్క బూటకత్వం తేటతెల్లమవుతుంది.

1922 లో మన్యంలో బయల్దేరిన తిరుగుబాటు సాయుధ పోరాటమే అయినప్పటికీ, దానికి నాయకత్వం వహించిన అల్లూరి సీతారామరాజు యొక్క ధైర్య సాహసములను, త్యాగశక్తిని గాంధీ మహాత్ముడే ప్రశంసించి యున్నాడు. నేడు చైనాలోను, స్పెయినులోను స్వాతంత్ర్యం కొరకు పోరాడుతూన్న ప్రజలకు తుపాకులు, ఫిరంగులు ఆయుధాలుగా ఉపయోగ పడుతున్నాయి. అయినప్పటికీ, కాంగ్రెస్ సంస్థ ఆ స్వాతంత్ర్య వీరుల ధైర్య సాహసములను కొనియాడింది. అదే విధంగా, 1922లో ఏజన్సీ ప్రజలు బ్రిటిషు పరిపాలకుల బాధలు సహించలేక, తిరుగుబాటు చేశారు. అట్టి తిరుగుబాటు యొక్క చరిత్రను రాధాకృష్ణమూర్తి గారొక గ్రంథంగా వ్రాశారు. దాన్ని చదవడం వల్ల యీ రోజున మన్యంలో మరొక తిరుగుబాటు రాదు. నిషేధించడం వల్ల దానికి మరింత ప్రచారం మాత్రం జరుగుతుంది.

కాని, విచారించ వలసిన విషయం ఏమంటే, ప్రజల రాజకీయ చైతన్యంతో యెక్కువ సంబంధం కలిగియున్న కాంగ్రెసు మంత్రి వర్గంవారు యీ నిషేధాన్ని ధైర్యంగా యెదుర్కొన లేకపోయారు గదా అనేది.

ఇట్టి గ్రంథాలపై నిషేధాలు తొలగించ బడాలంటే, ప్రజలే ఎక్కువగా ఆందోళన చేయాలి.

★ ☆

బొంబాయి రాష్ట్ర శాసన సభలో కాంగ్రెసు సభ్యులు పంచాయితీ బిల్లు ఒకటి ప్రవేశ పెట్టారు. దానిపై చర్చ జరిగి, సెలక్టు కమిటీకి పంపబడింది. ఈబిల్లు ప్రకారం, బొంబాయి రాజధాని యందలి 2,000 జనాభా గలిగిన ప్రతి గ్రామంలోను గ్రామ పంచాయితీ ఉండితీరాలి. హరిజనులకు, మహమ్మదీయులకు ప్రత్యేక స్థానములు రిజర్వు చేయబడతాయి. ఇంటి పన్ను, లోకల్ సెస్సులో ¼ వ భాగం సొమ్ము యీ పంచాయితీలకు ఆదాయం. చిన్న కేసులు విచారించుట కధికారం కలిగి యుంటాయి. రాజధాని యందలి 21,484 గ్రామాలకు 447 గ్రామాలలో మాత్రం నేడు పంచాయితీలు స్థాపింపబడి ఉన్నాయి. ఈబిల్లు ప్యాసయితే, అన్ని గ్రామాలకూ పంచాయితీలు ఏర్పడుతాయి.

పోయింది. పంచాయితీల రిజిస్ట్రార్ యొక్క సాంవత్సరిక నివేదికలను బట్టి, గ్రామ పంచాయితీలు ప్రజల కెంతో ఉపయోగకరముగా ఉన్నదనిన్నీ, దీనికి కారణం ప్రత్యేక శాసనం చేయబడుటే అనిన్నీ స్పష్టపడగలదు. కాని ఎప్పుడైతే పల్లెటూళ్ళు తాలూకా బోర్డుల యొక్క, జిల్లా బోర్డులయొక్క అధికారం క్రిందికి వచ్చాయో, అప్పుడు గ్రామ పంచాయితీలు ప్రజలకు చేయగలిగిన సేవ బహుస్వల్పం అయింది.

[redacted]

సెప్టెంబరు 16 ఫెడరేషన్ ప్రతికూల దినం.

ఈ నెల మూడవ వారంలో అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశం కాబోతోంది. హరిపూర్ కాంగ్రెస్ జరిగిన తరువాత యిదే మొదటి కాంగ్రెసు కమిటీ సమావేశం.

హరిపూర్ కాంగ్రెస్‌లో జాతీయ శక్తుల ఐక్యతవల్ల బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులకు అపజయం కలిగింది. కాని, జాతీయ శక్తులను అణచివైచి, కాంగ్రెస్ సంస్థను బలహీన పరచుటకు సామ్రాజ్యవాదులు నేడు విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నారు: ఫెడరల్ విధానంలో యెట్టి మార్పులు చేయబడవని ఇంగ్లండులోను, ఇండియాలోను ప్రభుత్వ ప్రతినిధులు ఘంటా పథంగా ప్రకటిస్తున్నారు. సరిహద్దు రాష్ట్రంలో శాసనసభ్యుల తీర్మానాను సారం నిర్బంధ శాసనాలను రద్దు పరచుటకు గవర్నరు అంగీకరించుట లేదు. ఒరిస్సాలో ఎస్టేట్ ల్యాండు ఆక్టు సవరణ బిల్లును వైస్రాయి యింకా ఆమోదించలేదు. పంజాబ్‌లో రైతు ఉద్యమాన్ని అణచుటకు క్రూర పద్ధతులన్నీ అవలంబిస్తున్నారు. బెంగాల్‌లో విద్యార్థుల మీద సైతం పోలీసులు లాఠీఛార్జి చేస్తున్నారు. కేంద్ర శాసన సభలో సైనికబిల్లు కూడా ప్యాసయింది. వేరొకవంక సామ్రాజ్యవాదుల కండగాయున్న సంస్థానాధీశులు ప్రజా శక్తులపై దండెత్తుతున్నారు.

అంతర్జాతీయంగా కూడ గ్రేట్ బ్రిటన్ క్లిష్టస్థితిలో పడింది. ఇండియాలో ఫెడరేషను ప్రవేశ పెట్టితేనేగాని ఆ చిక్కునుండి తప్పించుకోలేదు. ప్రజల దృష్టిలో కాంగ్రెసు సంస్థను అపకీర్తి పాల్జేయుటకు సామ్రాజ్యవాదులు పూనుకొన్నారు. కనుకనే ప్రజా ఉద్యమాలపై యీ దండయాత్రలు.

కాని, మన నాయకులు "పోరాటం వస్తుంది, జాగ్రత్త" అని బెదరిస్తే సామ్రాజ్యవాదులు లొంగిపోతారని వారి ఆశ. కనుకనే సామ్రాజ్య యుద్ధాలకూ, ఫెడరేషనుకూ ప్రతికూలంగా బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమం ఇంకా లేవదీయలేదు.

కాబట్టి, యీనెల 16 వ తేదీని దేశమంతటా యీ సామ్రాజ్యవాదుల యెత్తులను ఖండిస్తూ ఊరేగింపులు, బహిరంగ సభలు జరగాలి. ఫెడరేషనుకు, సామ్రాజ్య యుద్ధాలకు ప్రతికూలంగా తీర్మానాలు ప్యాస్‌చేయాలి. నిరంకుశ శాసనములను, నిర్బంధ విధానమును ఖండించాలి. సంస్థాన ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని అభినందించాలి.

పార్టీ సభ్యులందరు కాంగ్రెసు కమిటీల యొక్క, రైతు సంఘముల యొక్క, కార్మిక సంఘములయొక్క, ప్రతి సామ్రాజ్య వ్యతిరేకియొక్క సహకారం తీసుకొని యీ "ఫెడరేషన్ ప్రతికూల దినోత్సవం" జయప్రదంగా జరపాలి.

పుచ్చలపల్లి సుందరయ్య,
కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

మదరాసు రాజధానిలో 1920 వ సంవత్సరంలో "గ్రామ పంచాయితీల చట్టము" చేయబడింది. పంచాయితీల కీయబడిన అధికారాలు బాధ్యతలు యీ చట్టంలో నిర్వచించ బడ్డాయి. కాని, 1929 లో దీన్ని రద్దుచేసి "మదరాసు స్థానిక సంస్థల చట్టం"లో పంచాయితీలను కూడా చేర్చారు. అనేక మంది శాసన సభ్యులు దీన్ని వ్యతిరేకించారు. కాని, లాభం లేక

ఇప్పుడు, తిరిగి పంచాయితీ చట్టం ఒకటి ప్రవేశ పెట్టబడుతుందని మదరాసు రివెన్యూ మంత్రియైన శ్రీ ప్రకాశం పంతులుగారు చాలా ప్రదేశాలలో చెప్పారు. వీరి ప్రయత్నం సఫలమైతే, గ్రామస్థులలో ఐకమత్యం, స్వపరిపాలనా దక్షత వృద్ధి కాగలవు.

అయితే, బ్రిటిషువారి పరిపాలనకు పూర్వం కూడా మన దేశంలో గ్రామ పంచాయితీలు ఉండేవి. వాటి అధికారాలు యిప్పుడు తిరిగి రావు. ఆ రోజుల్లో తలకు మించిన సైన్యపు ఖర్చు, కోట్ల కొలదిగా పెరిగిన ప్రభుత్వ ఋణం, సివిల్ ఉద్యోగస్థులకు విపరీతమైన జీతాలు లేకపోవడం చేత, ఒక్కొక్క గ్రామానికి కావలసిన ఖర్చు, పూర్తిగా కాకపోయినప్పటికీ, అధిక భాగం లభించేది. ఇప్పుడది సాధ్యంకాదు. ఇంతేకాక, ప్రతి గ్రామం ప్రభుత్వానికి చెల్లించ వలసిన పన్ను మొత్తంలో ఏ రైతు ఎంతెంత చెల్లించాలో పంచాయితీదార్లే చాలావరకు నిర్ణయించేవారు. కాబట్టి పన్నుల భారం యిప్పటికంటే చులకనగా ఉండేది.

యీ సదుపాయాలన్నీ బ్రిటిష్ ప్రభుత్వం ఉండగా సాధ్యంకావు. చిన్న చిన్న సంస్కరణలు మాత్రం చేయవచ్చు.

బొంబాయి బిల్లు విషయంలో శాసన సభ్యులు ఒక్క లోపం మాత్రం చేశారు. మహమ్మదీయులకు, హరిజనులకు పంచాయితీలలో స్థానములను ప్రత్యేకించడం వల్ల పల్లెలలో కూడా అనేక మత కక్షలు బయలుదేరుట కవకాశం ఉన్నది. మదరాసు ప్రభుత్వం మాత్రం ఇట్టి లోపం రానీయకుండా చేయాలి.

★ ☆

తమ జాతీయ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనుటకై జపాను సామ్రాజ్యవాదులతో హోరాహోరీగా యుద్ధం చేస్తూన్న చైనా యుద్ధవీరుల సహాయార్థం ఇండియా నుంచి నలుగురు డాక్టర్లతో కూడిన అంబ్యులెన్సు దళం బొంబాయి రేవు విడిచిపెట్టి చైనాకు ప్రయాణమైనది. వీరికి వీడ్కోలు యిచ్చుటకు బొంబాయిలో పెద్ద బహిరంగసభ జరిగింది. సభలో శ్రీ సరోజినీదేవిగారు యీ క్రింది విధంగా ఉపన్యసించారు.

"ఇప్పుడు జపాన్‌వారు చీనామీదికి యుద్ధానికి రావడం చాల అన్యాయం గనుక, ఇండియాలో ప్రజల కందరికీ చైనా యెడల అభిమానం ఏర్పడింది. చైనావారు మహోత్యాగములెన్నో చేసి, ధైర్య సాహసాలతో శత్రువులను ఎదిరిస్తున్నారు. ప్రపంచ స్వాతంత్ర్యం కొరకు పోరాడే వారిలో భారతీయులు కూడా ఒకభాగం. ఇండియాకు మాత్రమే స్వరాజ్యం రావాలి అనే స్వార్థపరత్వం మాకులేదు. ప్రపంచ మందలి మానవు లందరికీ జీవించే హక్కు ఉండాలి. ప్రపంచంలో ఏదేశంలోనైనా ప్రజలకు ఆర్థికముగాగాని, సాంఘికంగాగాని, రాజకీయంగా

గాని, యితర దేశస్థులవల్ల చిక్కులు కలిగే యెడల, మా కాంగ్రెసు అట్టి వారికి సహాయం చేస్తారు.

"ఇప్పుడు ఇండియా నుండి చైనాకు వెళ్ళుతూన్న కాంగ్రెసు చైనా అంబ్యులెన్సు దళం వారు అవసరమైతే చైనా యుద్ధరంగంలో ప్రాణాలు సమర్పించుటకు సిద్ధపడే వెళుతున్నారు. చైనా దేశం ఇండియాకు చాలా సమీపంలో ఉన్నది. ఆపత్కాలంలో చైనా దేశస్థుల వారి యెడల సానుభూతిని వెల్లడించుటకును, సహాయం చేయుటకును భారతీయుల పక్షాన కాంగ్రెసు వారు యీ దళాన్ని పంపుతున్నారు."

దళాధిపతి అయిన డాక్టర్ అతల్‌గారు సమాధానమిస్తూ, "మీరు మమ్మల్ని యీలాగు గౌరవిస్తూన్నందుకు దళం పక్షాన కృతజ్ఞతను తెలియజేస్తున్నాను. చైనాలో భారతీయుల గౌరవానికి భంగం కలుగకుండా మేము నడచుకొంటాం." అని క్లుప్తంగా చెప్పారు.

చైనా దేశపు వైస్ కాన్సల్ దళాధిపతికి ఒక చైనా పతాకాన్ని బహుమతిగా యిచ్చాడు.

ఇదే సందర్భంలో కాంగ్రెసు మహా సభాధ్యక్షుడి క్రింది సందేశాన్ని పంపాడు.

"నేడు చైనావారు తమ ప్రాణాలను, స్వాతంత్ర్యాన్ని రక్షించుకొనే నిమిత్తం జపాన్‌తో యుద్ధం చేస్తున్నారు. భారతీయులకు చైనావారి పట్ల గల గౌరవము, సానుభూతి, సద్భావము— వీటిని వెల్లడించుటకే కాంగ్రెస్ యీ దళాన్ని చైనాకు పంపుతోంది. మీరు మీ ప్రాణాలను తెగించి, ఎంతో త్యాగం చేస్తూ, చైనాకు వెళుతున్నారు. విశ్వ మానవ ప్రేమయే మీ ఆదర్శం. మానవ సేవ కొరకు మీ రెలాంటి త్యాగమునైనా చేయగలరు...."

★ ☆

మదరాసు శాసనసభలో మలబార్ దేవాలయ ప్రవేశ బిల్లు ఆమోదించ బడింది. ఇది మలబార్ జిల్లాకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం, సవర్ణులలో అధిక సంఖ్యాకులు అనుమతిస్తే, అవర్ణులు దేవాలయములు ప్రవేశించుటకు శాసనం అంగీకరిస్తుంది. జిల్లాబోర్డు ఎన్నికలలోను, మ్యునిసిపల్ ఎన్నికలలోను వోటు హక్కు గలిగిన సవర్ణులే యిందుకు అర్హతను గలిగియుంటారు.

అవర్ణుల దేవాలయ ప్రవేశార్హతను మదరాసు ప్రభుత్వం ఈ బిల్లు ద్వారా గుర్తించింది. అంతవరకు కాంగ్రెసు మంత్రివర్గంవారు ప్రశంసనీయులు. కాని, బిల్లులో ముఖ్యమైన లోపాలు కొన్ని ఉన్నాయి.

మొదటి విషయం: మదరాసు రాజధాని అంతటిపైనను అధికారం కలిగియున్న మంత్రి వర్గంవారు ఒక్క జిల్లాకు మాత్రమే దీన్ని వర్తింప జేయుట.

రెండవ విషయం: న్యాయమైనవని తోచిన కార్యాలన్నీ ప్రభుత్వం నిర్బంధించి చేయించాలి. మద్యపాన నిషేధచట్టంగాని, ఋణ పరిష్కార చట్టంగాని, రాష్ట్రమందలి ప్రజల వోటు తీసుకున్న తరువాత చేయబడలేదు. కాని దేవాలయ ప్రవేశం మాత్రం అధిక సంఖ్యాకులైన సవర్ణులు అంగీకరిస్తేనే జరుగుతుంది.

మూడవ విషయం: ఈ సవర్ణులైనా అందరు సవర్ణులూ వోటు చేయడానికి అర్హులు కారు. అసెంబ్లీ ఎన్నికలలో సుమారు నూటికి 10 మంది మాత్రమే యీ అర్హతను పొందారు జిల్లా బోర్డులు, మ్యునిసిపాలిటీలు వీటి ఎన్నికలలో వోటు హక్కు గలిగిన వారి సంఖ్య యింకా తక్కువ. యుక్త వయస్సు వచ్చిన సవర్ణు లందరికీ వోటు హక్కు యిస్తే బాగుండేది.

★

దేశంలో రాజకీయ ఖైదీల సమస్యలు యింకా పరిష్కారం కాలేదు. బెంగాల్‌లో సుమారు 2000 మంది డిటెన్యూలను ప్రభుత్వం విడిచిపెట్టి నప్పటికీ, యింకా సుమారు 300 మంది శిక్ష విధించబడిన టెర్రరిస్టు ఖైదీలు జైళ్ళలో క్రుగ్గుతున్నారు. వారిలో 27 గురు జబ్బులవల్ల బాధపడుతూన్నట్టు శాసనసభలో ప్రభుత్వమే అంగీకరించింది. 14 గురు ప్రమాదకరమైన రోగములతో బాధపడుతున్నారనిన్నీ, కాని వారి పేర్లు బహిరంగ పరచుటకు వీల్లేదనిన్నీ ప్రభుత్వ సభ్యుడు జవాబిచ్చాడు. కాని, హిందూస్థాన్ స్టాండర్డు (కలకత్తా) పత్రిక 16 గురు రాజకియ ఖైదీల పేర్లు, వారి వ్యాధులు ప్రకటించింది. క్షయ, మూలవ్యాధి గుండెజబ్బు, అజీర్ణం మొదలైన వ్యాధులతో వారు బాధపడుతున్నారు. ఇద్దరికి పిచ్చి కూడా ఎత్తినదట.

కాంగ్రెసువారు రాష్ట్రాలలో అధికారానికి వచ్చాక రాజకీయ ఖైదీ లనేకమంది విడుదల అయారు. బెంగాల్ ప్రభుత్వమే అనేక మంది డిటెన్యూలను, ఖైదీలను విడుదల చేసింది. కాని, టెర్రరిస్టు ఉద్యమం వీరి విడుదలవల్ల యేమీ వ్యాపించలేదు. దీన్నిబట్టియైనా బెంగాల్ ప్రభుత్వం ఈ 300 మందిని విడుదల చేసియుండవలసింది. అనేక దీర్ఘవ్యాధులతో బాధపడుతూన్న వారినికూడా జైళ్ళలో ఉంచడం హక్కు మంత్రివర్గం యొక్క మొండితనాన్ని తెలియజేస్తుంది. పంజాబ్ ప్రభుత్వంచే శిక్షింపబడిన బి. కె. దత్తుగారు లీహోర్ జైల్లో క్షయ, ఎపెండిసైటిస్ వ్యాధులతో బాధపడుతున్నాడు, అతని విడుదలకై బీహార్ కాంగ్రెసు మంత్రివర్గం ఎంతో గట్టిగా శిఫార్సుచేస్తే ప్రభుత్వం విడుదలకు ఆర్డ రిచ్చింది. ఆలీపూర్, డండం జైళ్ళ (బెంగాల్) లోఉన్న సుమారు 300 మంది ఖైదీలు సెప్టెంబరు 3 వ వారంలో నిరశన వ్రతం ప్రారంభించ బోతున్నాం అని తెలియజేసారు. పృధ్వీసింగు, గురుముఖ సింగు గారలు పంజాబ్ జైళ్ళలో క్రుగ్గుతూనే ఉన్నారు.

బొంబాయి రాష్ట్రంలో యీ మధ్య క్లిష్ట స్థితి ఏర్పడింది. సి. టి. ఆక్టును రద్దు చేయవలసిందని ఆందోళన చేసిన ఛన్నూ సింగు మొదలైన నలుగురు కమ్యూనిస్టు ప్రచారకులు షోలాపూర్ జైలులో ఉన్నారు. వారు రాజకీయ ఖైదీలు కారు. కాబట్టి ప్రత్యేక పు ఏర్పాట్లు చేయ నవసరంలేదని బొంబాయి రివెన్యూ మంత్రి పలికాడు. దానితో వారు నిరశన వ్రతం ప్రారంభించారు. వీరితో బాటు యరవాడ చెరశాలలో నిర్బంధింప బడియున్న మహారాష్ట్ర కుట్ర కేసు ఖైదీలు, యితరులు మొత్తం 17 గురు రాజకీయ ఖైదీలు నిరశన వ్రతం ప్రారంభించారు.

వీరిపై ప్రయోగింప బడిన నేరం దొమ్మీ కేసు, అయినప్పటికీ వీరు రాజకీయ ప్రచారకులే అని బొంబాయి ప్రభుత్వం అంగీకరించింది. అంతేగాక, సామ్రాజ్య వాదుల కోర్టులలో రక రకములైన అభియోగములు తేబడుట అందరికీ తెలిసిన విషయమే. న్యూసెన్సు నేరములకు వర్తింప జేసే పోలీసు ఆక్టు క్రింద గాంధీగారిని ఒక సారి కలకత్తాలో ఎరస్టు చేసి, ఒక రూపాయి జుల్మానా విధించారు, 1930 వ సంవత్సరపు శాసనోల్లంఘనోద్యమంలో చాల మంది కాంగ్రెసు వాలంటీర్లపై దొమ్మీ కేసు తేబడి, శిక్షింప బడ్డారు. కాని, యితర కాంగ్రెసు వారితో బాటు వారిని కూడా విడుదల చేశారు.

కాబట్టి, నిరశన వ్రతం చేస్తూన్న ఈఖైదీల అందరిని రాజకీయ ఖైదీలుగా పరిగణించుట బొంబాయి కాంగ్రెసు మంత్రుల కనీస ధర్మం.

★ ☆

కేంద్ర శాసనసభలో సైనిక బిల్లు ప్యాసయిన తరువాత యించుమించు ప్రతి రాష్ట్రంలోనూ విపరీతమైన ప్రతికూలాందోళన బయలుదేరింది. మలబార్‌లో కాంగ్రెసు, సోషలిస్టు నాయకులు ప్రతిచోటా బహిరంగ సభలనేర్పాటు చేసి, యుద్ధ ప్రతకూల ప్రచారం చేస్తున్నారు. మదరాసులో యీ బిల్లుకు వ్యతిరేకంగా సభలు, తీర్మానాలు చేయబడ్డాయి, కలకత్తా, బొంబాయి నగరములలో కాంగ్రెసు కమిటీల యాజమాన్యమున బహిరంగ సభలు జరిగాయి, కాని, సైన్యంలో చేరేది యెక్కువ భాగం పంజాబ్, సరిహద్దు రాష్ట్రాలలోని ప్రజలు. అక్కడ ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేయుటకు ఒకరోజు ప్రత్యేకించ బడింది. ఈ నెల 1వ తేదీని పంజాబ్ రాష్ట్రమంతటా ఊరేగింపులు, సభలు జరిగాయి. లాహోరులో జరిగిన పెద్ద బహిరంగ సభలో ముస్లింలీగ్ సభ్యులు కొందరు దౌర్జన్యానికి దిగారు. సభాధ్యక్షుడైన బి. పి. యల్. బేడీ (సోషలిస్టు నాయకుడు) మొదలైన 12 గురిని గాయపరచారు. "కాంగ్రెసు నశించుగాక" అనే కేకలతో తుంటరులు అల్లరి చేశారు. అయినప్పటికీ సభ దిగ్విజయంగా సాగిపోయింది. బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానాలు ఆమోదించ బడ్డాయి. పంజాబ్ జమీందార్ల కాన్ఫరెన్సులో పంజాబ్ ప్రధాని ఈ బిల్లును సమర్థిస్తూ ఉపన్యసించాడు. కాని, అదే రోజున జరిగిన పంజాబ్ రైతు కాన్ఫరెన్సులో సుమారు 15,000 మందితో కూడిన సమావేశం యీ బిల్లును ఏకగ్రీవంగా ఖండించింది.

ఇదే విధంగా, పెషావర్‌లో కూడా 1 వ తేదీని బ్రహ్మాండమైన ఊరేగింపు, బహిరంగ సభ జరిగింది. కొన్ని వేలమంది ఎర్ర చొక్కా వాలంటీర్లు పాల్గొన్నారు. "ఫ్రాంటియర్ గాంధి" అని పిలువబడే అబ్దుల్ గఫూర్ ఖాన్‌గారు ఊరేగింపుకు నాయకత్వం వహించారు. జిల్లా కాంగ్రెసు కమిటీ యాజమాన్యమున జరిగిన సభకు ప్రజలు తండోప తండములుగా హాజరయారు. యుద్ధ ప్రతికూల తీర్మానాన్ని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆంధ్ర దేశంలో కూడా అక్కడక్కడ ఆర్మీ బిల్లుకు వ్యతిరేకంగా సభలు జరుగుతున్నాయి. కాని, యింకా తీవ్రమైన యుద్ధ ప్రతికూల ప్రచారానికి సామ్రాజ్య వ్యతిరేకు లందరూ పూనుకోవాలి.

కాంగ్రెసు సంస్థల శిథిలను గురించి గాంధీ మహాత్ముడు హరిజన్ పత్రికలో దీర్ఘమైన ఒక వ్యాసం వ్రాశాడు. ఈ క్రిందిది ఆవ్యాసంలో ఒక భాగం:

"కాంగ్రెసు సంస్థల నైర్మల్యతను, పవిత్రతను కాపాడి నిలువబెట్టుట యెట్లు? అనునదే నేటి సమస్య. కాంగ్రెసు మూల సిద్ధాంతముల నంగీకరించు చుంటినని ప్రకటించు కొంటూ నాలుగణాలు చెల్లించిన ప్రతివారు కాంగ్రెసు సంస్థలలో సభ్యులగుట కర్హులు. స్వరాజ్య సాధనకు సత్య – అహింసలను పాటించుట అవసరమనే విషయం ఏమాత్రమును నమ్మకయే అనేకులు సంతకం చేయుచున్నారు. "సత్య"—"అహింస" లకును, "న్యాయసమ్మతమైన" "శాంతి యుతమైన" అనే పదములకును భేదం లేదని నా అభిప్రాయం (నేటి కాంగ్రెసు నిబంధనలలో "న్యాయసమ్మతమైన" "శాంతి యుతమైన" పద్ధతులు అవలంబించవలెనని యున్నది. —సం.) అందుచే, నేనా పదములను పయోగించితినని ఎవరును పరిహసింపరని నమ్మెదను. కాంగ్రెసు నిర్మాణ నిబంధనలలో ఉన్న పదములను నేనట్టి అర్థంలోనే వాడుచున్నాను. ఇంతవర కెవరును కాదనలేరు. "అహింస" అను పదం మొట్టమొదట నేను కలకత్తా కాంగ్రెసులో ఆమోదింపబడిన సహాయ నిరాకరణోద్యమ తీర్మానంలో ఉపయోగించితిని, ప్రపంచంలో ఏదైనా అసత్యయుతమై యుండి న్యాయమైనది కాగలదా? హింసాయుతమైనదిగ నుండి శాంతియుత మైనదిగా ఉండగలదా? ఏ పదములచే సూచింప బడినప్పటికీ పై రెండు నియమములకు భంగముగ ప్రవర్తించు వారెవ్వరును గూడ, ప్రస్తుత కాంగ్రెసు మూల సిద్ధాంతము మార్చబడనంతవరకు, కాంగ్రెసు సభ్యులుగ నుండజాలరని నా అభిప్రాయం.

"అదే విధంగా, ఎల్లప్పుడు పూర్తిగా ఖద్దరు ధరింపని వారెవరును కాంగ్రెసు కమిటీలలో సభ్యులుగ నుండ జాలరు.

"అ. భా. కాం. కమిటీ యొక్కగాని, కార్య సంఘము యొక్కగాని ప్రధాన తీర్మానములకు విరుద్ధముగ ప్రవర్తించు వారందరికిని యీ నియమమే వర్తించును.

"పై నియామములలో దేనినైనను కాంగ్రెస్ సభ్యులు ఉల్లంఘించిన యెడల, అట్టి వారి కాంగ్రెసు సభ్యత్వము వెంటనే రద్దు కావలెనని నా సూచన."

ఈ అభిప్రాయాలు 16 రోజుల మౌన వ్రతమొనర్చిన తరువాత అంతరాత్మచే ప్రబోధింపబడినవని మహాత్ముడు వ్రాయుచున్నాడు. కాని, ఈ అభిప్రాయాలు గాంధీగారికి కొత్తకావు. కార్మికులు శాంతియుతంగా పికెటింగు చేసుకొన్నప్పటికీ అది ఆయన అభిప్రాయాలలో "హింస."

ఒక వైపు రాజ్యాంగ యంత్రం యొక్క క్రూర హింసా విధానం చెలరేగి పోతూంటే, మహాత్ముడు తన "సిద్ధాంతం"అనే ఆయుధాన్ని నిరాయుధులైన కాంగ్రెసు సేవకులపై ప్రయోగించుట చిచ్చుకప్పై బ్రహ్మాస్త్రం ప్రయోగించుట [illegible]టిది.

పూర్వ కథ

నారాయణ ముఖర్జీ గారి అబ్బాయి దేవదాసూ, నీలకంఠ చక్రవర్తి గారి అమ్మాయి పార్వతీ, చిన్నప్పటినుండీ స్నేహంగా పెరిగారు. అల్లరీ ఆగాలతో చిన్న తన మంతా గడిపారు.

పార్వతి పెద్ద దయింది. పార్వతి పెండ్లిని గురించి వారి తలి దండ్రులు ఆలోచింప సాగారు. పార్వతి నాయనమ్మ, దేవదాసు తల్లితో ఈ విషయం కదలించి చూసింది. కాని దేవదాసు తల్లి, అతడు కలకత్తాలో చదువుకోవాలని, పెండ్లి సంగతి తాను భర్తగారితో ఎత్తనే కూడదని తెలియ జేసింది. కాని నిజానికి, పార్వతి కుటుంబము, పిల్లల నమ్ముకొనే వంశ మని "ఛీ, ఛీ" అనుకొంటారు నారాయణ గారు, ఆయన భార్యా.

పార్వతి తండ్రి ఈ విషయం విని రోష పడతాడు. ఒక్క వారంలో పెండ్లి కుదుర్చుతానని ప్రతిజ్ఞ పడతాడు.

ఈ వార్త పార్వతికి దుఃఖం కల్గించింది.

దేవదాసు ఇదివరకు లాగా స్వతంత్రంగా పార్వతితో మాట్లాడ సంకోచించేవాడు. పార్వతి తల్లిని షికారుకు పోతూ పలకరించేవాడు. అలాంటప్పుడు ఒకోసారి పార్వతి, దేవదాసు ఎదుట పడేది. ఒకోసారి తప్పుకు వెళ్ళేది.

ఆ తరువాత

రాత్రి దేవదాసు గదిలో దీపం వెలుగుతూ ఉండేది. ఎండా కాలం కాబట్టి కిటికీతలుపులు తెరచి ఉండేవి. పార్వతి చాలా ఓపికతో అటు వైపే చూస్తూ ఉండేది—ఏమీ కనపడేది కాదు. పార్వతి మొదట నుంచి అభిమానిని. ఎంత దుఃఖం అయినా సహించేది కాని ఇతరులకు తెలియనిచ్చేది కాదు. ఇతరులకు చెప్పితే మాత్రం లాభ మేమిటీ? సానుభూతి ఆమె సహించ లేదు. ఒక తిరస్కారం-వేళాకోళం—అంత కంటే మరణమే మంచిది.

క్రిందట సంవత్సరమే మనోరమకు వివాహ మయింది. ఇంకా అత్త వారింటికి పోలేదు. అందుచేత మధ్య మధ్య వస్తూ ఉండేది. పూర్వం సఖులిద్దరూ కలిసి నప్పుడు మాటల సందర్భంలో ఈ సంగతి కూడా వస్తూ ఉండేది—ఇప్పుడు కూడా వస్తూ ఉన్నది. కాని పార్వతి ఇప్పుడందులో పాల్గొనటం లేదు. మెదలకుండా నైనా ఊరుకునేది—లేక ప్రసంగమన్నా మార్చేది.

పార్వతి తండ్రి రాత్రే ఇంటికి తిరిగి వచ్చాడు. ఇన్నాళ్ళ నుంచీ ఆయన వరుణ్ణి వెతకటానికి పోయాడు—ఒక్క మాటే లగ్నం కూడా పెట్టుకొని వచ్చాడు. ఇరవై ఇరవై అయిదు క్రోసుల దూరంలో వర్ధమాన జిల్లాలో ఉన్న హాధీపోతా గ్రామ జమీందారుడే వరుడు. స్థితి బాగా ఉంది. వయస్సు నలభైకి లోపే. గత వత్సరమే భార్యా పోయింది. మళ్ళీ వివాహం చేసుకుంటున్నాడు. ఈ శుభ వార్త ఇంట్లో అందరికీ సంతోషం కలిగించింది. అనటానికి వీల్లేదు. పైగా దుఃఖ కారణమైంది. కాని భువన చౌదరి (వరుని) దగ్గర నుంచి పెళ్లి ఖర్చులకు గాను రెండు వేల రూపాయలు వస్తాయని విన్న తర్వాత ఆడంగులు ఇక మాట్లాడ లేదు.

ఒక రోజున, దేవదాసు మధ్యాహ్నం భోజనం చేస్తూ ఉండగా, తల్లి, దగ్గరకు వచ్చి కూర్చుని "పారూ పెళ్లట!" అన్నది.

"ఎప్పుడు?" అని అడిగాడు దేవదాసు తల పైకెత్తి.

"ఈ మాసంలోనే. నిన్న పెళ్లి కొడుకు స్వయంగా వచ్చి పిల్లను చూసి పోయాడు."

దేవదాసుకు కొంచెం ఆశ్చర్యం కలిగింది:—"ఏదీ, నాకు తెలియనే లేదే. అమ్మా!" అన్నాడు.

"నీ కెలా తెలుస్తుంది? — పెళ్ళికొడుకు కొంచెం బొద బొదలాడుతూ ఉంటాడు. వయస్సు కూడా మిగిలింది. అయితే డబ్బూ దస్కం మాత్రం చాలా ఉన్నదట. పార్వతి సుఖంగా బ్రతుకుతుంది."

దేవదాసు తల వంచుకు అన్నం తింటున్నాడు. మాట్లాడ లేదు.

"ఆ పిల్లను నీ కివ్వాలని చూశారు." అన్నది మళ్ళీ.

"తర్వాత?" అని అడిగాడు దేవదాసు తల ఎత్తి.

తల్లి నవ్వింది— "ఛీ, అదెలా కుదురుతుంది. అసలే పిల్లల్ని అమ్ముకునే వంశం! పైగా పొరుగు పిల్ల! ఛీ, ఛీ—" అని తల్లి పెదవి విరచింది.

దేవదాసు అది గమనించాడు. తల్లి కొంచెంసేపుండి మరల అన్నది:

"మీ నాన్నకు చెప్పాను."

"ఏమన్నాడు?"

"ఇంకా ఏమంటాడు? ఇంత గొప్ప వంశాన్ని నవ్వుల పాలు చేయ నన్నాడు."

దేవదాసు ఇక నేమీ అడగ లేదు.

ఈ సమయంలోనే పార్వతికీ, మనోరమకూ సంభాషణ జరుగుతూ ఉన్నది. పార్వతి కళ్ళల్లో నీరు—మనోరమ బహుశా, ఇంతకు ముందే తుడుచుకుని ఉంటుంది.

"అయితే ఇక కర్తవ్య మేమిటి చెల్లీ?"అని అడిగింది మనోరమ.

పార్వతి కళ్ళు తుడుచుకుని— "ఇంకా కర్తవ్య మేముంది? నీ భర్తను నువ్వు ఇష్టపడే పెళ్ళి చేసుకున్నావా?" అన్నది.

"నా సంగతి వేరు. నాకు ఇష్టమూ లేదు: అయిష్టమూ లేదు. అందుకని నా కిలాంటి కష్టా లేవీ ఉండవు. కాని, నీ చేత్తో నువ్వు గొంతుకు ఉరి పోసుకుంటున్నావు?"

పార్వతి జవా బివ్వ లేదు. ఆలోచనలో పడింది. మనోరమ ఏమి ఆలోచించుకొన్నదో కాని మందహాసం చేస్తూ—"పారూ, నీ భర్త వయస్సెంత?" అని ప్రశ్నించింది.

"ఎవరి భర్త?"

"నీ—"

పార్వతి లెఖ్ఖ వేసి— "పందొమ్మిది ఉంటాయి." అన్నది.

మనోరమకు మహా ఆశ్చర్యం వేసింది—"అదేమిటే. నేను నలభై అని విన్నానే?" అన్నది.

ఈమాటు పార్వతి కూడా మందహాసం చేసి—"మనోదీదీ! ఈ ప్రపంచంలో ఎంతమందికి నలభై ఏళ్ళు లేవు? వాళ్ళందరి లెఖ్ఖలు నా దగ్గర ఉన్నాయా? నా భర్త వయస్సు మాత్రం 19—20 ఉంట వని నేను ఎరుగుదును."

"ఏమి పేరే?"

పార్వతి మరల నవ్వింది: "ఇన్నాళ్ళ నుంచి అది కూడా తెలియదూ?" అన్నది.

"నా కెలా తెలుస్తుంది?"

"తెలియదూ? సరే, నేను చెప్తాను!" అని మందహాసం చేసి, తర్వాత గంభీరంగా మనోరమ చెవి దగ్గర నోరు పెట్టి పార్వతి అన్నది:

"తెయదూ, శ్రీ దేవదాస—"

మనోరమ మొదట చకితురా లయింది. తర్వాత పార్వతిని వెనక్కు పడనెట్టి—"ఇక వేళాకోళంతో లాభం లేదు—పేరు చెప్పదలచుకుంటే ఇప్పుడే చెప్పు. పిమ్మట చెప్పటానికి వీలుండదు."

"ఇప్పుడు చెప్పానుగా!"

"దేవదాసే అయితే ఇంతగా ఏడ్చి చస్తా వెందుకు?" అన్నది మనోరమ కోపంతో.

పార్వతి ముఖం ఒక్కసారిగా మలిన మయింది. కొంచెం ఆలోచించుకొని అన్నది:

"అదీ నిజమే. ఇక నేను ఏడవను—"

"పారూ?"

"ఏమిటి?"

"సంగ తంతా విప్పి చెప్పు చెల్లీ! నా కేమీ అర్థం కావటం లేదు."

"చెప్పాలసిం దంతా చెప్పితినిగా."

"కాని, నా కేమీ అర్థం కానిదే?"

"ఎలా చెప్పినా కాదు!" అని పార్వతి ముఖం తిప్పుకున్నది.

పార్వతి కొన్ని సంగతులు దాస్తున్న దనీ. మనస్సులోని సంగతు లన్నీ విప్పి చెప్పటం లేదనీ మనోరమ భావించింది. ఆమెకు అభిమానమూ దుఃఖమూ రెండూ కలిగాయి.

"పారూ, నీ దుఃఖం నాది కాదా చెల్లీ! నువ్వు సుఖంగా ఉండటం కంటే నాకు కావలసింది ఏముంది?—నీ కేమన్నా చెప్పకూడని సంగతులుంటే మానేయి, కాని నన్నిలా వేళాకోళం మాత్రం చేయకు!"

ఈ మాటలు పార్వతికి చాలా కష్టం కలిగించాయి:—"వేళాకోళం చేయటం లే దక్కాయ్! నాకు తెలిసినంతవరకు నీకు చెప్పనే చెప్పాను.

దేవదాసు

శరత్ బాబు

విరచితం

—నాకు తెలిసిం దల్లా నా భర్త పేరు దేవదాసు: వయస్సు పందొమ్మిదీ ఇరవై ఏళ్ళు. —అదే నీకు చెప్పాను."

"కాని, నేను ఇప్పుడేగా విన్నది—నీకు ఎక్కడో సంబంధం స్థిరపడిందని?"

"స్థిరపడక ఇంకేమున్నది? నాయనమ్మ నిచ్చి, ఎలానూ, చేయరు. జరిగితే నాతోనే జరుగుతుంది. కాని నాకు మాత్రం ఈ సంగతు లన్నీ తెలియవు."

మనోరమ విన్నదంతా ఏకరువు పెట్ట బోయింది. పార్వతి అడ్డు వచ్చి—"అదంతా నేనూ విన్నదే—చెప్ప నక్కర్లేదు." అన్నది.

"అయితే దేవదాసు నిన్ను—"

"ఏమిటి నన్ను?"

"ఐతే స్వయంవరం అన్న మాట? చాటు చాటున అంతా గట్టి బందోబస్తు చేసుకున్నావా?" అన్నది మనోరమ నవ్వును ఆపుకుని.

"గట్టి, ఓడు ఇంకా ఏమీ తేల లేదు."

"మనోరమ వ్యథిత స్వరంతో—"నువ్వు చెప్పే దేమిటో నాకు అర్థం కావటం లేదు పారూ?" అన్నది.

"అలాగైతే దేవదాసు నడిగి నీ కంతా తెలిసేటట్టు చెప్తాను."

"ఏమడుగుతావు? పెళ్ళి చేసుకుంటావా, లేదా, అనేగా?"

"ఆఁ, అదే." అన్నది పార్వతి తల తిప్పుతూ.

మనోరమకు ఆశ్చర్యం కలిగింది: "ఏమిటి నువ్వన్నది పారూ! నీ యంతట నువ్వే పోయి అడుగుతావా?"

'తప్పేముంది, అక్కయ్యా!'

"చక్రపాణి"

అనువాదం

మనోరమకు ఇంకా ఆశ్చర్యం వేసింది: 'ఏమిటీ నువ్వన్నది? నువ్వే వెళ్ళతావా?'

'నేనే. లేకపోతే నాకోసం ఎవరు అడగ బోతా రక్కయ్యా?'

'సిగ్గు వేయదూ?'

"సిగ్గు ఎందుకు? నీకు చెప్పటానికి నే నేమి సిగ్గు పడ్డాను?"

"నేను ఆడుదాన్ని, పైగా నీ సఖినీ—కాని, అతడు మగవాడుగా పారూ?"

పార్వతి ఈ మాటు నవ్వింది:—"నువ్వు నా సఖివీ, నా దానివీ— ఇక అతనేనా పరాయి వాడు? నీతో అన గలిగిన మాటను, ఇక అతనితో అనలేనా?"

మనోరమ విస్తుపోయి పార్వతి ముఖం వంక చూస్తూ ఉండిపోయింది.

పార్వతి నవ్వు ముఖంతో మరల అన్నది:— "మనో! మీరు కాళ్లకు పసుపూ, నొసట కుంకుమా వృథాగా పెట్టుకుంటున్నారు. ఎవరిని భర్త అనాలో కూడా మీకు తెలియదు. అతను నా భర్త కాకపోతేనూ, నా లజ్జా సంకోచాలకు అతడు కాక పోతేనూ, నే నిలా అతని కోసం చావటానికి కూర్చోను. ఇంతే కాక, చావ తలచు కొన్న వ్యక్తి విషం తియ్యగా ఉంటుందా చేదుగా ఉంటుందా అని ఎప్పుడూ ఆలోచించరు; అతని దగ్గర నాకు రవ్వంత కూడా సిగ్గు లేదు."

మనోరమ పార్వతి ముఖం వంక కాసేపు విస్మయంతో చూచి— "ఏ మడుగుతావు? నీ పాదాల దగ్గర కొంచెం చోటు ఇవ్వ మనేగా?" అన్నది.

పార్వతి అవునన్నట్టు తల తిప్పి—"సరిగ్గా అదే అడుగుతాను అక్కయ్యా!" అన్నది.

"అతను చోటివ్వక పోతే?"

ఈ మాటు పార్వతి చాలా సేపు జవాబివ్వలేదు:

"అప్పటి సంగతి నా కిక తెలియదు అక్కయ్యా!" అన్నది తర్వాత కాసేపటికి.

ఇంటికి తిరిగి వెళ్లే టప్పుడు మనోరమ—"అబ్బ, దీని గుండె ధైర్యం చెప్పుకో వలసిందే. నేను చస్తున్నా గాని ఈ లాంటి మాటను నోటి నుంచి రానిచ్చే దాన్ని కాను." అని మనస్సులో అనుకున్నది.

ఈ మాట నిజమే: అందుకనే పార్వతి వీరిని—"మీరు అనవసరంగా పసుపూ కుంకుమా పాడు చేస్తున్నార"ని అన్నది.

౬

రాత్రి ఒంటి ఘంట కావచ్చును. వెన్నెల గుడ్డిగా ఉన్నది. పార్వతి పక్క దుప్పటిని ఆ పాద మస్తకము చుట్టుకొని నెమ్మదిగా మెట్లు దిగి ఒక మాటు నాలుగు దిక్కులా పరికించింది—ఎవ్వరూ మేలుకొని లేరు కదా అని. తర్వాత నిశ్శబ్దంగా తలుపు తెరచుకుని బయటకు వచ్చింది. పల్లెటూరు—చడీ చప్పుడు ఏమీ లేదు. ఎవరైనా ఎదురు పడతారేమో నని భయం కూడా లేదు. ఈమె నిరాటంకంగా జమీందారుగారి ఇంటి ముందు వచ్చి నిల బడింది. సింహ ద్వారం దగ్గర వృద్ధ దర్వాన్ కృష్ణ సింగు కుక్కి మంచం మీద కూర్చుని ఇంకా తులసీ రామాయణం పారాయణం చేస్తున్నాడు. పార్వతి రావటం చూసి తల ఎత్త కుండానే "ఎవరువా"రని ప్రశ్నించాడు.

పార్వతి "నే నే." అన్నది.

దర్వాన్ కంఠ స్వరాన్ని పట్టి స్త్రీ అని గ్రహించాడు: దాసీ కావచ్చునని ఊహించి ఇక నేమీ అడగకుండా రాగం తీస్తూ మళ్లీ రామాయణ పారాయణలో పడ్డాడు. పార్వతి దాటి పోయింది. ఎండా కాలం. బయట చాలా మంది నౌకర్లు పండుకొని ఉన్నారు. వారిలో కొంత మంది గాఢ నిద్రలో ఉన్నారు. కొంత మంది అర్ధ సుప్తావస్థలో ఉన్నారు. నిద్ర మత్తులో కొందరు పార్వతిని చూసినా చూసి ఉండ వచ్చు—కాని, దాసీ అనుకొని ఎవ్వరూ పలకరించ లేదు. పార్వతి నిరాటంకంగా లోపల ప్రవేశించి మెట్ల గుండా పైకి ఎక్కింది. ఈ ఇంట్లో ప్రతి గదీ ప్రతి గవాక్షమూ ఈమెకు పరిచితమే. దేవదాసు గది గుర్తించటానికి ఎక్కువ సేపు పట్ట లేదు. గది తలుపు తెరచే ఉన్నది. లోపల దీపం కూడా వెలుగుతూ ఉన్నది. పార్వతి లోపల ప్రవేశించింది. దేవదాసు మంచం మీద పండుకొని నిద్ర పోతూ ఉన్నాడు. తెరచిన పుస్తకం ఒకటి తలవైపున పడి ఉన్నది—లక్షణాలను బట్టి చూస్తే అతనికి ఇంతకు ముందే కన్ను అంటినట్టుగా ఉన్నది. దీపం వత్తిని పెద్దది చేసి, పార్వతి దేవదాసు కాళ్ల దగ్గర నిశ్శబ్దంగా కూర్చున్నది. గోడ నున్న పెద్ద గడియారం మాత్రం 'టిక్, టిక్' అని చప్పుడు చేస్తూ ఉన్నది. ఇది మినహా అంతా నిస్తబ్దం—అంతా సుప్తం.

కాళ్ళ మీద చేయి పెట్టి పార్వతి 'దేవదా' అని మెల్లగా పిలిచింది. దేవదాసు నిద్ర మత్తులో ఎవరో పిలుస్తున్నట్టుగా విన్నాడు. కాని కళ్లు తెరవకుండానే 'ఊఁ' అన్నాడు.

'ఓ, దేవదా—'

ఈమాటు దేవదాసు కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చున్నాడు. పార్వతి ముఖాన ఆచ్ఛాదన మేమీ లేదు. ఇంట్లో దీపం గంటం వలె వెలుగుతూ ఉన్నది. దేవదాసు పార్వతిని చాలా సులభంగానే గుర్తించాడు—కాని, మొదట అతనికి నమ్మకం కలగలేదు.

'ఎవరు? పార్వతా?'

'ఆఁ, నేనే.'

దేవదాసు గడియారం వంక చూశాడు. అతనికి ఆశ్చర్యంలో ఆశ్చర్యం కలిగింది.

'ఇంత పొద్దుపోయా!' అన్నాడు.

పార్వతి జవా బివ్వ లేదు. తల వంచుకు కూర్చున్నది.

'ఇంత రాత్రి పూట ఒంటరిగానే వచ్చావా!' అని మళ్ళీ అడిగాడు.

'ఆఁ,' అన్నది పార్వతి.

దేవదాసు ఉద్వేగంతోనూ, సందేహంతోనూ కంటకితు డయ్యాడు.

'ఏమిటీ! దోవలో భయం వెయ్యలేదా!' అని అడిగాడు.

'భూతాలకు నేనంత భయపడను!' అన్నది పార్వతి మందహాసం చేస్తూ

'భూతాలకు కాకపోయినా మనుష్యులకన్నా భయపడాలిగా! ఎందు కొచ్చావు?'

పార్వతి జవా బివ్వ లేదు. 'అదే నా కింకా తెలియలే' దని మనస్సులో అనుకున్నది.

'ఇంట్లో ఎలా ప్రవేశించావు? ఎవరూ చూడలేదా?'

'దర్వాన్ చూశాడు.'

దేవదాసు కళ్ళు పెద్దవి చేశాడు: 'దర్వాన్ చూశాడా? ఇం కెవరూ?—'

'వరండాలో నౌకర్లు పండుకుని ఉన్నారు. వాళ్ళల్లో కూడా బహుశా ఎవరన్నా చూడ వచ్చు.'

దేవదాసు మంచం మీద నుంచి ఎగిరి దూకి తలుపు బిగించాడు.

"ఎవరన్నా గుర్తించారా?"

పార్వతి ఏ మాత్రం ఆతురత చూపించ కుండా, చాలా సహజంగా "వాళ్లందరూ నన్నెరుగుదురు. ఒక వేళ ఎవరైనా గుర్తించినా గుర్తించ వచ్చును." అన్నది.

"ఏమిటి పారూ! ఇలాంటి పని ఎందుకు చేశావు?"

'అది నీకు తెలుస్తుం'దని పార్వతి మనస్సులో అనుకున్నది. కాని, పైకి ఏమీ మాట్లాడ లేదు.

"ఇంత రాత్రి! ఛీఛీ! రేపు నీ ముఖ మెలా చూపిస్తావు?"

"నాకా ధైర్య మున్నది." అన్నది పార్వతి తల ఎత్తకుండానే.

ఈ మాటకు దేవదాసు కోపించ లేదు. కాని చాలా ఉత్కంఠితుడై—"ఛీ, ఛీ! ఇంకా నువ్వు చిన్న పిల్ల వేనా పారూ! ఇలాంటి సమయంలో ఇక్కడికి రావటానికి నీకు కాస్తన్నా సిగ్గు వేయ లేదా?"

"వీసం కూడా లేదు." అన్నది పార్వతి తల తిప్పుతూ.

"రేపు సిగ్గుతో నీ తల వాలిపోదా?"

ప్రశ్న విని పార్వతి తీవ్ర కరుణా దృక్కులతో దేవదాసు ముఖం చూచి—"తల వాలి పోయేదే—నువ్వు నా సిగ్గును కప్పెడతావన్న నమ్మకం నాకు లేక పోతే." అన్నది నిస్సంకోచంగా.

దేవదాసు విస్మయంతో హతబుద్ధుడై—"నేనా! కాని, నేను మాత్రం ముఖం ఎలా చూపిస్తాను?" అని అడిగాడు.

పార్వతి అలాగే తొట్రు పడని స్వరంతో "నువ్వా! నీ కేం దేవదా!" అని ఒక్క క్షణం ఆగి—"నువ్వు మగవాడివి. ఇవ్వాళ కాకపోతే రేపైనా నీ కళంక చరిత్ర అందరూ మరచి పోతారు. ఫలానా రోజున మందభాగిని పార్వతి ప్రపంచాన్నంతా తుచ్ఛంగా చూసి నీ పాదాల మీద పడటానికి వచ్చిందని ఎవ్వరూ గుర్తు పెట్టుకోరు."

"అదేంటి పారూ?"

"—ఇక నేను—"

"ఇక నీవు?" అన్నాడు దేవదాసు మంత్ర ముగ్ధుని వలె.

"నా కళంకం సంగతి అడుగుతావా? ఉహూ—నా కేమీ కళంకం లేదు. నీ దగ్గరకు చాటుగా వచ్చానని నన్నెవరైనా నిందించినా ఆ నింద నాకు తగలదు." అన్నది.

"అదేంటి పారూ! ఏడుస్తున్నావా?"

"దేవదా! నదిలో ఎంత నీరున్నది! అంత నీరు కూడా నా కళంకాన్ని కప్పి పెట్ట లేదా?"

దేవదాసు చప్పున పార్వతి రెండు చేతులూ పట్టుకొని—"పార్వతీ!" అన్నాడు.

పార్వతి దేవదాసు కాళ్ళ మీద తల పెట్టి— "ఇక్కడే కొంచెం చోటివ్వు దేవదా!" అని గద్గద స్వరంతో అన్నది.

రన్సిమన్ రాయబారం

సూడెటన్ల గొంతెమ్మ కోర్కెలు—యుద్ధం వస్తుందా? రాదా?—



హాంకౌవైపుకు సాగుచున్న జపాను సైన్యాలు.

జపాను ఎన్నాళ్ళనుండో హాంకౌను పడగొట్టాలని ప్రయత్నించుతూంది. కాని దాని కోర్కె ఫలించలేదు. హాంకౌ చుట్టుపట్లనే యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. జపాను ఇదివరకు పీపింగు, నాంకింగ్, షాంఘే మొదలగు పారిశ్రామిక పట్టణాలను జయించింది. పీపింగ్, నాంకింగ్‌లలో ఇదివరకు జపాను తాత్కాలికంగా కొన్ని ప్రభుత్వాలను నెలకొల్పింది. ఇపుడు వీటి నన్నిటిని ఒక కేంద్ర ప్రభుత్వం క్రిందకు తీసుక వస్తుందట. జపాను తాత్కాలిక ప్రభుత్వాలను నెలకొల్పినా అవి జయప్రదంగా సాగలేదు. ప్రజా సామాన్యం అంతా చైనా వైపునే ఉంది. ఇక జపాను కరెన్సీలకు విలువలేదు. ఇంతేగాక జయించిన ప్రదేశాలపై మాటి మాటికి చైనా గొరిల్లా (కమ్యూనిస్టు) సైన్యాలు ఊపిరి తిరగకుండా బాధపెడుతున్నాయి. ఈమధ్య షాంఘే వద్ద గొరిల్లా పోరాటాలు తీవ్రమైనాయి. షాంఘే చుట్టుపట్ల గ్రామాలలో 4, 5 వేల సైనికులు గుమికూడారు. పీపింగ్ వద్ద, జపాను మిలిటరీ ట్రైనును పడగొట్టారు కాని ప్రాణ నష్టం జరిగలేదు. జపాను ఈ తాత్కాలిక ప్రభుత్వం రాను వర్తకానికై దోపిడి సాగించడమే గాకుండా ఇతర దేశాలపై నిర్బంధాలు ఎక్కువ చేస్తున్నది. అది ఫ్రాంసు, బ్రిటను, అమెరికాలను కంటగింపుగా ఉంది. ఆ దేశాల వైమనస్యం ఎక్కువ అవుతున్నది.

జపాను, జూయిపింగ్, లియూయన్, లను ఎంతో నష్టంతో పట్టుకో గలిగింది. జపాను ఆధీనంలో ఉన్న పీపింగ్‌లో మిలటరీ ప్రభుత్వ నిరంకుశానికి చిహ్నం అపుడే బయట పడుతున్నది. 12 పత్రికలు ప్రచురణ మానినాయి. 5 న్యూస్ ఏజన్సీలు కూడా మూసివేశారు. ఇక జపాను వారివి మాత్రం ఏడు నడుస్తాయట!

జపాను ఈ మధ్య విచిత్రమైన ప్రకటన ఒకటి గావించింది. చంగ్-కై-షేక్ యొక్క జపాను ప్రతికూల భావమే ఈ పరిస్థితులకు కారణమట! జపాను మంచూరియా, చైనాల ఆర్థిక నీతికి అతని తత్వమే అడ్డు వచ్చిందట! పాపం! జపాను ఇంకా చంగ్-కై-షేక్‌ను తమతో రాజీలు పడి ద్రోహం చేయమనే కోరుతున్నది. పూర్వమే చంగ్-కై-షేక్ ఇప్పటి రాజనీతిని అవలంబించితే జపాను ఎక్కడ ఉండేదో?

చైనా వారి ప్రతి రోధం ఎక్కువయిన కొలదీ జపాను దారుణ కృత్యాలు ఎక్కువగుచున్నాయి. విష వాయువులను ఉపయోగించుచున్నారని లండన్‌లోని రాయబారి చెప్పడమే గాకుండా, చాలమంది విదేశీయులే ఒప్పుకొంటున్నారు.

హాంకౌకు 100 మైళ్ళ దూరంలో ఉన్న కింగ్‌షాపైన 200 బాంబుల వేసి 1000 మందిని చంపింది జపాను.


అయితే కాంటన్‌కు 90 మైళ్ళ దూరంలో ఉన్న నాంహంగ్ వద్ద చైనా విమానాలు జపాను విమానాల నెదుర్కొని 8 ని పడగొట్టినాయి.

చైనా—అమెరికా ఎయిర్‌లైనర్ (విమానం) మీద జపాను కాల్చినందుకు ఇపుడు పశ్చాత్తాప పడుటలేదు. అమెరికా తెల్పిన అసమ్మతికి జవాబు చెప్పతూ, తమకు దురుద్దేశ్యం లేదని, మబ్బులలో దాక్కుంటూ పోవడంవల్ల శత్రు విమానమని తలచామని, ఇంకా ఆ విమానం చైనా దాటిపోలేదు గనుక, ఇతర ప్రభుత్వం మీద తమ గురిపెట్టక చైనా పైననే పెట్టామనీ ఏమేమో జవాబిచ్చారు జపాను వారు. ఈనాడు ధ్వంసమైన విమానాన్ని లాగిచూస్తే 80 బులెట్ తూటులు కన్పించాయి. ఇంత కంటె ఘోరమైన నీచకార్యం మరేమి కావాలి? మొదట్లో యుద్ధ ప్రదేశాలలో తిరిగే విమానాలకు తాము రక్షణ ఇవ్వమంటూ జపాను నిషేధించింది. కాని ఇప్పుడు కొంచెం ఆ ధోరణి మార్చుకొంది. ప్రయాణాలు కొరకై తిరిగే విమానాలు, తగిన గుర్తు లుంచుకొంటే తాము జాగ్రత్తగానే మెలగుతామని జవాబు చెప్పింది. ఇప్పటికైనా ఆమాత్రం చెప్పినందుకు సంతోషించాలి.

మైప్పువాంగ్ వద్ద జరిగిన యుద్ధంలో అఖండ విజయం గల్గింది చైనాకు. జపానును నాల్గు మైళ్ళు వెనక్కి తరమడమే గాకుండా 700 రైఫిల్సును, మెషీను గన్‌లను స్వాధీన పరచుకొన్నారు. ఉత్తర హోనాన్‌లో ఇదివరకు జపాను వశపరచుకొన్న కొన్ని స్థలాలను గూడా చైనా వశపరచుకొంది.

హాంకౌ నగర రక్షణానికై 40 వేల సైనికులను సిద్ధం చేసింది. యుద్ధ రంగం ఇపుడు కెయియాన్‌కు మారింది. ఇది కియాంగ్సీ రాష్ట్ర ప్రధాన నగరం ఇది ఒక్కటే హాంకౌ నగరానికి బయట రక్షణకై నిలచిన పట్టణం.

కెయియాన్‌కు ఉత్తరాన మాహ్వీరింగ్ వద్ద చైనా తీవ్రంగా నష్టపడిందని 3 వేల మందైనా చనిపోయి ఉంటారని జపాను తెల్పుచున్నది. 20 వేల సైన్యాలు చెల్లా చెదరైనవని కూడా తెల్పుతున్నాయి. ఈనాటి (6-9-38) వార్తలన్నీ జపానుకు విజయమే తెల్పుచున్నా, ఇంతటితో హాంకౌ పట్టుబడిందని తలపరాదు. హాంకౌ పట్టుబడ్డా, చైనాను పూర్తిగ జయించినట్లునూ ఎంచరాదు. ఒక్కొక్క రోజు జపాను విజయం ఆగిపోయిన కొలదీ జపానులో కల్లోలం గల్గించుచున్నది. సమ్మెలు జరుగుతున్నట్లు, సైనికులలో యుద్ధ ప్రతికూల ప్రచారం సాగుతున్నట్లు కూడా తెలుస్తోంది. వీటి అన్నిటికి తోడు మొన్నటి తుపాను కూడా కొంత అశాంతిని వృద్ధి పరచుతుందనుటలో సందేహంం లేదు.




జక్ ప్రెసిడెంటు 'బీనెస్'

స్పెయిన్‌పై నిషేధం తొలగదు.

స్పానిష్ యుద్ధం యధా విధిగా సాగుతూనే ఉంది. ఈస్ట్రిమదురా వద్ద ప్రభుత్వం అపజయం గాంచింది.

స్పెయిన్‌పై నిషేధం తొలగించి ఆయుధాలను సప్లయి చేయవలసిందని, లండన్‌లో "ఆర్మ్ పీస్ క్యాంపైన్" వారు ఛాంబర్లేనును కోరారు. కాని ఛాంబర్లేను, ప్రస్తుత పరిస్థితుల ననుసరించి స్పెయిన్‌లో తటస్థ భావమే మంచిదని చెప్పారు. ఛాంబర్లేను ఫాసిస్టు పక్షపాత బుద్ధి ఆఫీసులలోనూ, విజ్ఞప్తులలోనూ అంతరించుతుందా? దానికి తగిన ఒత్తిడి ఉండాలి.



రన్సిమన్ ప్రభువు

ప్రజా సామాన్యం పైన విద్రోహులు గావించే బాంబింగ్ పద్ధతిని విచారించవలసి బ్రిటన్‌ను రిపబ్లిక్ ప్రభుత్వం కోరింది. దానికి ఒక కమీషన్‌ను బ్రిటిషు ప్రభుత్వం నియమించింది. ఆ కమీషన్ విచారించే టప్పుడే ఎన్నో అవస్థలు పడ్డారు. ఆ కమిషన్ సభ్యులు స్వయంగా ఎన్నో విమాన దాడులను కళ్లార చూచారు. కమీషన్ తెల్పిన రిపోర్టు ప్రకారం,

నేటి ప్రపంచం

మిలటరీ ప్రదేశాలు కాక పోయినా, ఆయుధ సామగ్రి తయారు గావించే ప్రదేశాలు గాక పోయినా, కావాలనే, ప్రజలను భయపెట్టడానికి వశపరచు కొనటానికి విద్రోహులు బాంబులు వేస్తున్నారు.

ఈ కమీషన్ 50 విమాన దాడిని చూచింది. అందులో 46 ఆలికాంటిపై వచ్చినవే. ఈ 46 లో 41 దాడులు, పోష్టును, రైల్వే స్టేషన్‌ను, కొట్టాలనే విద్రోహులు బాంబులు కురిపించారట! బార్సిలోనాలో 3 వేలమంది బాల బాలికలున్న ప్రదేశాలలో విద్రోహులు బాంబులు వేశారని కూడా ఈ కమిషన్ తెల్పుతున్నది.

బ్రిటిష్ వారిచే నియమింపబడిన బ్రిటిష్ కమిషనే ఈ విషయాలు తెల్పుతున్నది ఆయుధాలు గాక, ఆహార పదార్థాలను సప్లయిచేసే బ్రిటిషు నౌకలను ఫ్రాంకో ముంచివేస్తున్నాడు. అయినా ఛాంబర్లేను "ఓం శాంతిః శాంతిః" అంటూ జపం గావించుతున్నాడు.

విఫల మయినట్లే!

స్పెయిన్ పై ఆంక్ష పోదు—జపాను విజృంభణ.

స్పెయిన్ రిపబ్లిక్ బ్రిటను మరొక విజ్ఞప్తి గావించింది. విద్రోహులకు పట్టుబడ్డ ఖైదీలను ఉరి తీయవద్దనీ, ఖైదీలను మార్చుకుంటానికి తాము అంగీకరిస్తామని తెల్పింది. ఇదివరకు ఇలా ఇరుపక్షాలూ ఖైదీలను మార్చుకోవడం, అనవసర హత్యలు తగ్గిపోవడమూ జరిగింది. దీనికి బ్రిటను ఒప్పుకొని ముగ్గురు గల ఒక కమీషను నియమించింది. దానికి ఫిలిప్ చెట్‌వుడ్ అధ్యక్షుడు. ఈ కమిషను ఖైదీలను పరస్పరము మార్చుకొనుటను పరీక్షించుతారు.

ఎబ్రో రంగంలో యుద్ధం మొదలుబెట్టినది మొదలు నేటివరకు, ప్రభుత్వ సైనికులు 5 వేల మంది చనిపోయారనీ, 12 వేల మంది పట్టుబడ్డారనీ, విద్రోహులు ప్రకటించు తున్నారు.

కాని, స్పానిష్ ప్రభుత్వ సైనికుల శౌర్యం మొరేల్ (1) పడిపోలేదు. అఖండ విశ్వాసంతో పోరాడుతూనే ఉన్నారు.

సంప్రదింపులు భగ్నం అయినాయి.

జకోస్లొవేకియా సమస్యతో యూరప్ అంతా అట్టుడికి పోతున్నది. గత మే మాసంలో ఎంత తీవ్రత, ఆతురత కనిపించారో, అంత ఆతురత కనుపించుకున్నారు నేడు.

రన్సిమన్ ఇరుపక్షాలకు సంధి చేయాలని అంటే జకోస్లొవేకియాను సూడెటన్ జర్మనులకు లొంగమని—తీవ్ర ప్రయత్నం గావించాడు. తుదకు హెన్లిన్ (జర్మనుల నాయకుడు) జక్ అధ్యక్షుడగు బీనెస్‌తో సమావేశం కుదిర్చాడు. కాని సమావేశం కాలేదు. తదితర నాయకులతోనే బీనెస్ సంభాషించారు. వారు హెర్ కంట్, హెర్ నెచిడిస్కీ. వీరు మితవాదులని ప్రతీతి. అయినా, సూడెటన్ జర్మనుల పొలిటికల సమావేశం తమ ప్రతినిధుల చర్యలనే సమర్ధించింది.

పరిస్థితులు తీవ్రతరమైన కొలదీ సమాలోచనలు వృద్ధి కాజొచ్చినయి. జర్మనీలోని బ్రిటిషు రాయబారి ఇంగ్లండు వెళ్ళాడు. బ్రిటిషు మంత్రుల సమావేశం జరిగింది. బాధ్యతంతా హాలిఫాక్సు (ఇర్విన్) ప్రభువు పైననే పెట్టింది. అటు పారిస్‌లో కూడ మంత్రుల సమావేశం జరిగింది. హాలిఫాక్సు, అమెరికా, జకోస్లొవేకియా, ఫ్రాన్సు, పోలండు విదేశ రాయబారులతో ఎప్పటికప్పుడు మాటాడుచూ పరిస్థితులను తెలిసికొనుచునే ఉన్నాడు. హిట్లర్‌తో, సూడెటన్ జర్మనుల నాయకుడైన హెన్లిన్ మాటాడి ఇంటికి తిరిగి వచ్చాడు. రన్సిమన్ ప్రభువు ప్రత్యేకంగా హిట్లర్‌కు ఒక విజ్ఞప్తి గావించాడని ఒక వార్త. జర్మనీలోని బ్రిటిషు రాయబారి ఇంగ్లండు నుండి హిట్లర్‌కొక ఉత్తరం తీసుకొచ్చాడని ప్రతీతి. కాని అది అబద్ధమంటున్నది బ్రిటిషు ప్రభుత్వం.

హిట్లర్ న్యూరెంబర్గు సమావేశానికి అట్టహాసాలు గావించు చున్నాడు. మెనోవర్ ప్రదర్శనాలకు చాలా కట్టుదిట్టాలు కూడా జరుగుతున్నాయి. న్యూరెంబర్గు సమావేశానికి బ్రిటిష్ రాయబారిని కూడా హిట్లర్ ఆహ్వానిస్తాడట!

రన్సిమన్ ద్వారా బ్రిటన్ చేసిన ఒత్తిడికి కొంతవరకు జకోస్లొవేకియా లొంగింది. బహుశా ఈ క్రింది షరతులను బీనెస్ అంగీకరింపవచ్చునని తెలిసింది. రెండు కార్యక్రమాలున్నాయి. అందులో బీనిస్ తక్షణం చేయదలచిన కార్యక్రమం ఇది అని కొందరూహించారు.

1. జాతీయంగా ఉన్న ఆయా మతాలకు నూటికి ఇంత అని ఉద్యోగాలలో భాగం నిర్ణయించుట.

2. జర్మనులకు నూటికి 30 చొప్పున ఉద్యోగాలు.

3. డిఫెన్సు ఆర్గనిజేషనులో తప్ప, తక్కిన వాటిలో ఆయా జాతుల వారికి వారి రాష్ట్రాలలోనే ఉద్యోగాలు.

4. జక్కులు లేని రాష్ట్రాలలో జక్కు పోలీసులను తగ్గించుట.

5. భాషా విషయమైన 'లా'ను సవరించుట.

6. సూడెటన్ జర్మనీతో పరిశ్రమాభి వృద్ధికై అప్పులిచ్చుట.

7. ప్రతి జిల్లాకు కల్చరల్ అటానమీ.

రించ వచ్చు కూడాను. ఈ షరతు అంగీకరించితే జర్మనీలో సూడెటన్ రాష్ట్రాలు కలిసినట్లే. చివరకు ఈ కోర్కె కూడా కోరలేదు.

"సమాన ప్రతిపత్తి" అంటూ మొదట షరతు పెట్టారు. దీనితో సంధి షరతులు భగ్నమయినట్లే. జర్మనులున్న ప్రదేశాలలో, జక్ వ్యతిరేక సాహిత్యాన్ని పట్టుకొన్నారు. ఆ ప్రదేశాలలోకి జర్మనీ నుండి ఆయుధాల సరఫరా సాగుతూనే ఉంది. న్యూరెంబర్గు సమావేశములో 6 వ తేదినుండి ఉపన్యాసాలు ప్రారంభమౌతాయి. హిట్లర్ ఉపన్యాసం 12 వ తేదీన అని మొదట నిర్ణయించ బడింది. కాని పరిస్థితు లీదశకు రావడం వల్ల 6 వ తేదీనే మాట్లాడుతాడట!


ఇతని ఉపన్యాసం పైననే జర్మనీ వైఖరి ఏమిటో తేలి ఉంటుందని అందరూ వేచి ఉన్నారు. ఇది వ్రాసే సమయానికి ఆ ఉపన్యాసం ప్రకటించ బడలేదు.

సూడెటన్ ప్రదేశాలలో మాకు "హిట్లర్" కావాలి అన్నట్లు నినాదాలు చేశారు. నిషేధించిన గీతాలు పాడారు. రన్సిమన్ సహచరుడు హెన్లిన్‌నీ కలిసికొన్నాడు. సరిహద్దులలో మామూలుగనే సైనిక సన్నాహాలు జరుగుచున్నాయి.

ఇలాంటి క్లిష్ట దశలో హిట్లర్ దండెత్తుతాడా? ప్రపంచ యుద్ధం వస్తుందా అని ప్రశ్న మనలను ఎదుర్కొంటుంది: దీనిపై అనేక అభిప్రాయాలున్నాయి.

ఒకటి న్యూరెంబర్గు సమావేశం పూర్తి గావడంతోటే హిట్లర్ ఉపన్యాసాలే గాక, జకోస్లొవేకియాలోని సూడెటన్ ప్రాంతాన్ని మాత్రం ఆక్రమించుకొంటు, తక్కిన రాష్ట్రాల

స్వతంత్రంగనే ఉంటానన్నట్లు, హిట్లర్‌ను బెదిరించుతూ, రూజువెల్టు, హల్లు, గారలు మాట్లాడడం; జక్‌లో రష్యా సహాయం అర్థించడమని కోరడమూ, హిట్లర్‌ను వెనుకంజ వేయించుతుందని మరో వాదన. యుద్ధం చేయకుండా ఉండటానికి మరో కారణం కూడ ఉంది. జర్మనీలో ప్రజలు భీతావహులై ఉన్నారు. కార్మికులు నిస్పృహ చెంది అక్కడక్కడ పనిని భగ్నం చేస్తున్న ఆస్ట్రియాను జయించడన్న ఆనందం ఎవరికీ లేదు. అదీ గాక పారిశ్రామిక దేశమైన జక్‌ను యుద్ధంతో నాశనం చేసి జయించుట కంటె, యుద్ధం చేస్తా



స్టాలిన్

జక్ జోలికి వస్తే ఖబడ్దార్.

ననే బెదిరించి జక్‌ను వశపరచుకొని, నెమ్మదిగా డాన్యూబియన్ ప్రాంతాలను కూడ వశం చేసికొని ఆ తరువాత రష్యాపై బడటం హిట్లరు ఉద్దేశ్యమని ఇంకొక వాదన.

ఏమైనా మొత్తముమీద యుద్ధానికన్నా



అవసరమైతే యుద్ధానికి సిద్ధంగా ఉన్న జక్ సైనికులు.

ఇదంతా ఊహయే గాని బీనెస్ నోటివెంట రాలేదు. అయినా కూడ జర్మనులకు సంతృప్తి గలుగలేదు. వారికి 'స్విస్‌పద్ధతిని' రాష్ట్రీ స్వాతంత్ర్యం కావాలంటున్నారు. అంటే కేంద్ర ప్రభుత్వంతో సంబంధం నామకార్థమే. కేంద్ర ప్రభుత్వం ఆజ్ఞలను ఏనాడుబడితే ఆనాడు ధిక్క

జోలికి పోడని ఒక అభిప్రాయం. ఇది మేడం టాబూ అనే ఫ్రెంచి రచయిత్రి అభిప్రాయం.

ఏ పరిస్థితులలోనూ హిట్లర్ ఇపుడు యుద్ధం చేయడని మరొక అభిప్రాయం. దీనికి కారణం ఫ్రాంసు సైమను పఉన్యాసమే గాకుండా, దృఢ నిశ్చయమూ; అమెరికాలో కూడ డెమా

యుద్ధపు బెదరింపుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. సామాన్యంగా హిట్లర్ పనిచేసిన తర్వాత ఉపన్యాసాలు గావించే బాపతు. చాలా కాలం యుద్ధం అంటే నాజీ పతనమే గాబటి హిట్లర్ యుద్ధానికి మూడుపాళ్ళు ఈ పరిస్థితులలో పూనుకొనడనే చెప్పవచ్చు. అయినా తినబోతూ రుచి అడగటం దేనికి?

కార్మిక సమస్యలు

(9 వ పేజీ తరువాయి)

బొంబాయి

మిల్లులవద్ద "క్రెచీ"ల ఏర్పాట్లు.

బొంబాయి మిల్లులలో పనిచేసే స్త్రీ కార్మికులు పనిసమయంలో తమ పిల్లలను ఉంచుటకు తగు వసతులను ఏర్పాటు చేయాలి అని ప్రభుత్వపు రూల్సు ఉన్నాయి. వీటి ప్రకారం ఇప్పుడు అట్టి యేర్పాట్లు బొంబాయిలో జరుగుచున్నవి. 100 కి పైగా స్త్రీలు పనిచేసే మిల్లులలో 6 సం॥ల లోపు వయస్సుగల పిల్లలకు యీ యేర్పాట్లు జరుగుచున్నవి.

యిట్టి క్రెచీలు బొంబాయిలో 31 అహ్మదాబాదులో 64 వున్నవి. ఇప్పుడు బొంబాయిలో 153 మిల్లులలో ఏర్పాట్లు జరుగుచున్నవి. యీవిధానాన్ని అన్ని కాంగ్రెసు రాష్ట్రాలలోనూ ప్రారంభించ వలసినదని కాంగ్రెసు మంత్రులను కోరుచున్నాము.

కార్మికులకు నీరు, వెలుతురు, వసతి

కార్మికుల గృహాలలో తగు వెల్తురు, నీటి సదుపాయాలు ఏర్పాటు చేయుటకు బొంబాయి ప్రభుత్వము 10½ లక్షలు రూపాయిలు ఖర్చు చేయుటకు తీర్మానించింది. యిందుకు వారిని అభినందించాలి. కార్మికుల నివాసాలను గూర్చి వేరే చెప్పనక్కర లేదు. చిన్న చిన్న గది ఒకటికి రెండు మూడు కుటుంబాలు కూడా ఉన్న ప్రదేశాలు అనేకం వున్నాయని పూర్వమే ప్రభుత్వపు "విట్లే విచారణ కమిటీ" తెలియజేసింది. ఈ సందర్భంలో నూతన వసతి గృహ నిర్మాణానికి కూడ తొందరగా ప్రభుత్వం పూనుకొనవలసి యున్నది.

కార్మికులకు జరుగుతూ ఉన్న యిట్టి మేళ్లన్నీ వారి పోరాటముల యొక్కయు కాంగ్రెసు ప్రభుత్వం యొక్కయు ఫలితాలే.

కాంగ్రెసు మంత్రులు ఇన్ని మేళ్లు కార్మికులకు చేస్తూన్నప్పటికీ బొంబాయి లేబరుబిల్లులో కార్మికులకు జరుగనున్న అన్యాయాలను మాత్రం కార్మికులు మరువలేరు. వానిని బొంబాయి మంత్రి వర్గముచే మార్పింపజేయుటకు మన మందరం పనిచేయాలి.

కరాచీ

ట్రామ్‌వే వర్కర్లు తమ ఇబ్బందులను ఒక వారములో తొలగించకున్నచో సమ్మె చేస్తామని యజమానులకు నోటీసిచ్చారు.

కార్మికులపై బెంగాలు ప్రభుత్వపు దాడి.

"స్టేయిన్ స్ట్రయికు (మిల్లులలోపలే ఉండి, పనిచేయకుండుట) అక్రమము కాకపోయినా, 141, 144, సెక్షన్ల ప్రకారం అక్రమ సంఘాలుగా ప్రకటింపబడేటంత సంఖ్య (అనగా 5 గురు గాని అంతకు మించిగాని) కార్మికులు మిల్లులో నుండి తొలగుటకు నిరాకరించినచో అది నేరమగును. కార్మికులు కాని వారుకూడా 5 గురు కాని, అంతకు మించిగాని మిల్లు ఆవరణలో నున్నప్పుడు వారిని కూడ తొలగిపోవలసినదని యజమాని ఆజ్ఞాపించవచ్చును. యిందుకు నిరాకరించినను కూడా పై సెక్షన్ల ప్రకారం అక్రమ సంఘంగా ప్రకటింప బడును. 127 వ సెక్షన్ ప్రకారం వారిని చెదరగొట్టుటకు కూడా అధికారము కలదు". ఈ విషయాలు గల సర్క్యులరు ఒకటి బెంగాలు ప్రభుత్వముచే, జిల్లా మేజిస్ట్రేటుల కందరకు జారీ చేయబడినది.

మిల్లు యజమానులు అక్రమముగా తమను పనినుండి తొలగించు నపుడును, కార్మికులను ఇబ్బంది పెట్టునపుడు, లాకౌట్లు చేయునపుడును కార్మికులు తమ హక్కులను నిలుపుకొనుటకై స్టేయిన్ స్ట్రయిక్ చేయవలసి వస్తుంది. కార్మికులు చేసే యే పోరాటమూ కూడా ఒకరిద్దరితో గాని 5 గురితో గాని నెరవేరునది కాదు. మొత్తంగా అందరూ కలిసి చేస్తేనే దాని ఫలితం కార్మికులు పొందగలుగుతారు. యీ సావకాశాన్ని కూడా యీ సర్క్యులరు హరిస్తోంది. గత విశ్వాస రాహిత్య తీర్మానం సందర్భంలో యూరపియన్ గ్రూప్ సహాయంచే రక్షింపబడిన జాతీయ విద్రోహ కరమైన బెంగాలు హక్కు ప్రభుత్వం యిట్టి నీచానికి ఒడిగట్టుక మానుతుందా. కాంగ్రెసేతర మంత్రివర్గాలున్న రాష్ట్రాలలో యిట్టి అక్రమాలను రూపుమాపి, ఆ మంత్రివర్గాల స్థానే కాంగ్రెసు మంత్రి వర్గాలు ఏర్పడునట్లు అందరూ కృషి చెయ్యాలి. అందుకై కాంగ్రెసు మంత్రులున్న రాష్ట్రాలలో ప్రజా హక్కులు-ముఖ్యంగా కార్మికులవి, విస్తరింపబడుతూ ఉన్న కొద్దీ యీ విజయ దుంధుభులకు చెలరేగి కాంగ్రెస్సేతర రాష్ట్రాలలో ప్రజలే ఆయా మంత్రివర్గాలను అధికారంలో నుండి ఊడబెరికి కాంగ్రెసు మంత్రి వర్గాలను ఏర్పాటు చేయుటకు తలపడతారు. యిందుకై కాంగ్రెసు వాదులందరూ తీవ్ర కృషి చేయవలసి యుంటుంది.

కలకత్తా

పాల్టా మహాలక్ష్మి బట్టల మిల్లు సమ్మె సందర్భంలో పనిలోనికి కొత్తగా వచ్చిన కూలీలను అపుచేయు చున్నారనే ఆరోపణతో సమ్మెదారులను పోలీసులు అరెస్టు చేయుచున్నారు. 31 వ తేదీకి 59 అరెస్టులు జరిగినవి.

ఇంజనీరింగు కార్మికుల సమ్మె.

నజీరాగంజ్ ఇంజనీరింగు వర్కుషాపులో 400 మంది కార్మికులు 30 వ తేదీ నుండి సమ్మె ప్రారంభించారు. వారి కనీసపు కోర్కెలను యజమానులకు అందజేశారు.

ఇతర కార్మికుల కష్టాలు.

కలకత్తాలో దుకాణముల మీదను పెద్ద పెద్ద షాపులలోనూ పనిచేసే కూలీలకు వారానికి ఒక్కరోజైనను సెలవు లేదు. ఈ సెలవును ఏర్పాటు చేయించుకొనుటకు కలకత్తాలో యీ కార్మికులు చాల కాలము నుండి ఆందోళన చేయుచున్నారు. సుభాస్ చంద్రబోసుగారి అధ్యక్షతను 30 వ తేదీని ఒక బహిరంగ సభ యీ కార్మికులచే యిందుకై ఏర్పాటు చేయబడినది.

30 వ తేదీ ఉదయం సుభాష్ చంద్రబోసు గారు యజమానులతో ఈ సెలవు (ఆదివారం)ను గూర్చి మాట్లాడిరి. యజమానులు ఇందుల కంగీకరించలేదు. సాయంత్రం జరిగిన సభలో యీ హక్కు న్యాయమైనదనియు, దానిని కాపాడుకొనుటకు కార్మికులు పని చేయవలసినదనియు తాను సర్వవిధముల తోడ్పడెదననియు కార్మికులను శ్రీ బోసుగారు హెచ్చరించిరి.

సుభాష్ చంద్రబోసుగారి ఉపన్యాసం.

"1930 తరువాత దేశంలో కార్మిక కర్షకోద్యమాలు విజృంభించి అభివృద్ధి నందినవి. కార్మిక కర్షకులు ఏకమయ్యే వరకు దేశాభ్యుదయానికి మార్గములేదు. యీ కార్మికుల, కర్షకుల ఐక్యతయే దేశ స్వాతంత్ర్య సంపాదనకు మార్గము తీయును. కార్మికులకు భుక్తి, దేశానికి స్వాతంత్ర్యం అవినాభావ సంబంధం కలిగి ఉన్నవి. కార్మికులందరూ ఏకమైతే స్వరాజ్యం వస్తుంది. ప్రజలే ప్రభుత్వంలో ఉంటే ప్రతి సమస్యా పరిష్కారం అవుతుందని కాన్పూరు సమ్మె స్పష్టం గావించింది. కార్మికులకు మేలు జరుగనంత కాలం దేశము ముందుకు పోలేదు. ప్రభుత్వము యొక్క, యజమానుల యొక్క సంబంధాలు ఒకదానితో యింకొకటి మెలిపడి యుండుటచే యజమానులతో ఎప్పుడు పోరాటం వచ్చినాసరే, ప్రభుత్వముతో కూడ కార్మికులు పోరాటం సాగించాలి, కార్మికుల హక్కులను ప్రభుత్వము నెరవేర్చకపోతే కార్మికులకు సహాయము చేయుట కాంగ్రెసు విధి. స్వరాజ్యానికై పాటుపడే కాంగ్రెసులో అందరూ చేరండి" అని కార్మికులను హెచ్చరించారు.

బెంగాల్

ఐక్య సంఘటన.

బెంగాలు రాష్ట్రి కాంగ్రెసు కమిటీకి రాష్ట్రి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు (కార్మిక సంఘం) నకును యీ దిగువ సూచించిన షరతులపై ఐక్య సంఘటన ఏర్పడవలయునని బెంగాల్ రాష్ట్రి కాంగ్రెసు సంఘపు లేబరు సబ్‌కమిటీ తీర్మానించింది.

1. రాష్ట్రంలోని కార్మికుల తరపున ప్రాతినిధ్యము వహించుటకు అధికారం కలిగిన ఏకైక సంస్థగా బెంగాలు రాష్ట్రి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు గుర్తింపబడ వలయును.

2. సంఘాలు ఏర్పాటు చేసుకొనుటకును సమ్మె చేయుటకును కార్మికుల హక్కు గుర్తించ బడవలయును.

3. కాంగ్రెసు స్వయంగా ఏ కార్మిక సంఘము నైనను ఏర్పాటు చేయుటగాని, దానిని తన అనుబంధముగా ఏర్పాటు చేసుకొనుటగాని చేయరాదు.

4. కార్మికుల రోజు రోజు పోరాటములలో వారికి కాంగ్రెసు పూర్తిగా సహాయపడ వలయును.

5. ముందుగా బెంగాల్‌రాష్ట్రి ట్రేడ్ యూనియను కాంగ్రెసుతో సంప్రదించకుండా యజమానుల నుండిగాని కార్మికుల నుండిగాని వచ్చిన తగాదాలను చేపట్టకుండా ఉండాలి.

6. పరిష్కారార్థమై కాంగ్రెసు ఎదుట పెట్టబడిన తగాదాలను పరిష్కరించునపుడు ముందుగా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుతో కాంగ్రెసు సంప్రదించ వలయును.

7. వ్యక్తిగతంగా కాంగ్రెసు వారిచే ఏర్పాటు చేయబడిన కార్మిక సంఘాలు బెంగాలు రాష్ట్రి ట్రేడ్ యూనియన్‌కు అనుబంధములుగా చేయబడవలయును.

8. తన నిర్మాణమును వ్యాపింప జేయుటకును దానిని బలపరచుటకును ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు కాంగ్రెసు తోడ్పడవలెను.

తక్షణం చేయవలసిన పని.

కార్మికుల జీవిత స్థితిని గూర్చి లెక్కలు (Statistics) తయారు చేయుట, కాంగ్రెసు మెంబర్లు కొత్త కార్మిక సంఘాలను ఏర్పాటుచేసి వాటిని ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు అనుబంధములుగా చేయుట; వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రులు గావించే కార్యక్రమాలను గూర్చి సంక్షిప్తమైన కరపత్రాలు మొదలగు వాఙ్మయం, ప్రకటించుట; బెంగాల్ రాష్ట్రి కార్మిక సంఘంచే ఆమోదింపబడిన ప్రతి సమ్మెకు, అర్థబలం, అంగబలం, సానుభూతి మొదలగు వాటిని ఏర్పాటు చేయుట; బహిరంగ సభల ద్వారా ఆందోళన చేసి కార్మికులకు న్యాయం జరుపుట; శాశ్వత సమ్మె నిధిని వసూలుచేసి ఉంచుట; ప్రస్తుతమున్న కార్మిక శాసనాలలో అభ్యంతర కరమగు భాగాలకు సవరణలు ప్రతిపాదించుట: అధికారంలోనికి వచ్చిన తరువాత కనీసపు కూలిని ఏర్పరుస్తూ శాసనాలు చేయుట, కార్యక్రమాన్ని గూర్చి ప్రచారం చేయుట, కార్మికులున్న ప్రదేశాలలో యీ ప్రచారాన్ని చేయుటకు చిన్న జట్లను ఏర్పాటు చేయుట; మునిసిపాలిటీల ద్వారా, కార్మికులకు, నివాస సౌకర్యాలు, క్లబ్బులు, కనీసపు కూలి; 40 గంటలు వారం, బోనసు పద్ధతి. ప్రోవిడెంటు ఫండు, పనిఖాయం చేయించడం, గ్రాట్యుయిటీలు, ఏర్పాటు చేయుట. పార్కులూ, తాలీంఖానాలు ఉచితంగా కార్మికులుండే ప్రదేశాలలో ఏర్పాటు చేయుట. గ్రామాలలో నున్న కార్మికుల స్థితిగతులను గూర్చి లెక్కలను తయారు చేయుట. వారికి తగు సదుపాయాలను ఏర్పాటు చేయుటకై వారి సంఘాలను ఏర్పరచుట. వారు చేస్తూవుండే నిర్బంధ సేవను రద్దు చేయించుట, మొదలగునవి కాంగ్రెసు చేయ..చాలి.

ఫెడరేషన్—యుద్ధ ప్రతికూల సమావేశం

ఫెడరేషను, యుద్ధములకు వ్యతిరేకంగా సంఘటితం కావటానికి సాగిరండు.

ఆంగ్ల సామ్రాజ్యవాదము తన రథ చక్రాలతో పాటు భారత దేశాన్ని సామ్రాజ్యవాద యుద్ధాలలోకి లాక్కెళ్లే క్రూరమైన, అవినీతికరమైన తన విధానాన్ని తీవ్రతరం చేస్తోంది. ఈ విధానం వల్ల భారత దేశములో ప్రజాపీడన యెక్కువై, ప్రజల బానిస శృంఖలాలు గట్టి పడ్డాయి. తన సామ్రాజ్యవాద తృష్ణ తీర్చుకోడానికి, కష్ట జీవులను త్రొక్కి పెట్టడానికి భారతదేశంలో పీడనా యంత్రాన్ని బలవత్తరం చేస్తుంది. పర ప్రభుత్వ పీడనకు వ్యతిరేకంగా ప్రజలు తమ అసంతృప్తిని వెలిబుచ్చటానికి చేస్తున్న మహాసభలను ప్రదర్శనాలను బహిష్కరిస్తుంది. 144 వ సెక్షన్—అంతులేని అరెస్టులు, కాంగ్రెస్ వర్కర్లపైన, రైతు కార్మిక సోషలిస్టు నాయకులపైన నిషేధపు టాజ్ఞలు వీటి ద్వారా కార్మికుల సమ్మెలను, శాంతియుతమైన పికెటింగును, రైతుపోరాటాలను, అణచివేస్తుంది. తన నిరంకుశ ఏకాధిపత్యాన్ని బలపరచు కోటానికై సామాన్యమైన పత్రిక, వ్యక్తి, వాక్కు, సభా స్వాతంత్ర్యము మొదలగు పౌరసత్వ హక్కులను గూడ నాశనం చేస్తున్నది. కాంగ్రెస్‌వారు జయమంది మంత్రులైన రాష్ట్రాలలో గూడ స్థానికాధికారుల ద్వారా తన పీడనా విధానాన్ని సాగించటంలో సామ్రాజ్యవాదం జయం పొందగలిగింది. స్వాతంత్ర్యం ప్రజాస్వామికం శాంతి కొరకు జరుగుచున్న మన ప్రజా పోరాటాన్ని అరికట్టాలనే ఆశయంతో సామ్రాజ్యవాదం తనకున్న బలాన్నంతా కేంద్రీకరించుకొని మనల నణచివేయటానికి మన కోట్లమంది ప్రజలను దాస్య శృంఖలాలతో బంధించి దోపిడీ చేయడానికి పూనుకోంది. భారత దేశములో నిరంకుశ ఏకాధిపత్యాన్ని స్థాపించి దోపిడీని హెచ్చు చేయాలనే సామ్రాజ్యవాదుల తృష్ణ పెరిగిపోతుంది. పూర్వం నుండి దాగియున్న అసంతృప్తిని వెలిబుచ్చుతూ, ఆర్థికంగాను, రాజకీయంగాను పరదేశంవారి క్రింద దాసులుగా నుండమని బీదతనాన్ని పోగొట్టుకొని స్వేచ్ఛగా నుంటామని దేశమంతా చేసిన ప్రదర్శనాలను ప్రార్థనలను, గగ్గోలును, పెడచెవిని బెట్టి సామ్రాజ్యవాదం తన తృష్ణకు తీర్చుకోటానికై ఫెడరేషను, సైన్యాన్ని వృద్ధిచేసుకోడానికి అవకాశమిచ్చు క్రిమినల్ లాఅమెండుమెంటు బిల్లును ఈరెండు కత్తుల నుపయోగిస్తుంది. ఒక దానిని భారత దేశ స్థితిని డొమినియన్ స్టేటస్ వరకు తీసికెళ్ల నట్టి సంస్కరణ యను నెపముతో, సామ్రాజ్యవాద పెద్దలు భారతదేశ రక్షణకై చేసే కృషియనే మిషతో, నీరెండు ఘోరాలు జరుగుతున్నాయి. ఈ రెంటి వెనుకనున్న నీచోద్దేశం ఒక్కటే. అవి రెండు పరదేశ దోపిడీ నభివృద్ధి చేయటానికి నిరంకుశ యేకాధిపత్యాన్ని గట్టిపరచటానికి, మనల నంతులేకుండ త్రొక్కివేయటానికి నుద్దేశింప బడ్డాయి. రెండు విధాల మన భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నాశనం చేయ పూనుకున్నాయి. జాతీయతకు వైరులైన భూస్వాములు, జమీందారులు, ధన స్వాములను సంఘటన మొనర్చి ఫెడరేషన్ ద్వారా సామ్రాజ్య వ్యతిరేకులగు స్వాతంత్ర్య జాతీయ సంయుక్త సంఘటనకు ప్రతిద్వంద్విగా నిలిపి ప్రజా ఉద్యమాన్ని నాశనం చేయాలని సామ్రాజ్యవాదపు మొదటి ఆశయం.

ఫెడరేషన్ కీర్తనను పాడుతూన్న క్రిమినల్ లా అమెండుమెంటు బిల్లు, సైన్యంలో చేరుటకు వ్యతిరేకంగాను, యుద్ధాలకు ప్రాతికూల్యంగా జరుగుచున్న ప్రచారాన్ని మొక్కలోనే త్రుంచివేయటానికి, వచ్చే సామ్రాజ్యవాద యుద్ధాలలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు మన మనుష్యులను, సామగ్రిని ఉపయోగించుకొను వీలు కలిగించటానికి ఉద్దేశింప బడ్డది. త్వరగా యుద్ధ సన్నాహాలు చేసకొనుటకు ప్రజాశక్తుల అసంతృప్తి, ఆంగ్ల సామ్రాజ్యవాదుల యుద్ధ యత్నాల కడ్డు తగలకుండా చేయటానికీ బిల్లు ఏర్పడ్డది. దేశ ద్రోహకరమైన యీ బిల్లు నాధారం చేసికొని, దీని ద్వారా మన అమాయక ప్రజలను చిత్రవధలకు, రక్తపాతానికి స్థానాలైన సామ్రాజ్యవాద యుద్ధాలలోకి సామ్రాజ్యవాదం లాక్కెళ్ళ కొలది మన వుద్యమం నాశనమగుతుంది. ఈ కత్తికి రెండు వైపులా, ఉన్న స్వల్ప పౌరసత్వ హక్కులను నాశనం చేయటానికి కూడా ఉపయోగింప బడుతుంది.

సామ్రాజ్య వాదుల దురుద్దేశాల ఫలితములగు యీ ఫెడరేషన్, క్రి. లా. ఎ. బిల్లులను చివర వరకు పోరాడి నాశనం చేయాలి. మన స్వాతంత్ర్య పోరాటాన్ని మన వైఖరి వల్ల ఎవ్విధంగాను బలహీనం చేయబడ నియ్యరాదు. బిల్లులో ప్రతిబింబిస్తున్న సామ్రాజ్యవాద యుద్ధ పిపాసను ధైర్యంతో ఎదుర్కొనాలి. ఈ రెంటికి వ్యతిరేకంగా పోరాడటం నిజంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు, ప్రజా పరిషత్తు, ప్రజాస్వామిక హక్కులు, కష్ట జీవుల కోర్కెల కొరకు పోరాటమే. ఈ పోరాటాన్నభివృద్ధి చేయటానికి, పెద్ద ప్రతిఘటనా సభలను, ప్రదర్శనాలను, విశాలమైన యుద్ధ ప్రతికూల ప్రచారాన్ని సాగించాలి. ప్రజా సమూహముల మధ్య, కాంగ్రెస్ సంఘము, మిగత సామ్రాజ్య వ్యతిరేక సంస్థల ఆధిపత్యమున పెద్ద యుద్ధ ప్రతికూల, ఫెడరేషన్ వ్యతిరేక మహా సభలను జరపాలి.

లేఖలు

ప్రతి ప్రజాస్వామిక సంస్థ, సామ్రాజ్య వ్యతిరేక సంస్థ, ఇప్పటి విషమ స్థితి యొక్క గంభీరతను తెలిసికోవాలి. మనం సంకుచిత దృష్టితో వుంటే యిప్పుడు వస్తున్న రాచకీయ ప్రతిష్ఠంభనమును, మన ఉద్యమాన్ని విడదీస్తుంది. దీని వల్ల కలిగే హానిని మనం గ్రహించాలి. ఈ రాచకీయ స్తబ్దతను ధ్వంసం చేసి, మన పోరాటాన్ని మనం సాగించుకోటానికి మన శక్తులను మనం కేంద్రీకరించుకోవాలి.

ఈ సందిగ్ధ సమయంలో మన గుంటూరుజిల్లా కాంగ్రెసు కార్యవర్గం, అనివార్యమైన ఉద్యమాన్ని బయలుదేర దీసి అంతము వరకు ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా పోరాడటానికి, ఫెడరేషన్ యుద్ధాలకు వ్యతిరేకంగా పెద్ద మహా సభ నేర్పరుపవలెనను నుద్దేశంతో ఈ నెల 24 వ తేదీన జరిగిన సమావేశంలో జనాబ్ గౌస్‌బేగ్ గారిని (గుం. జి. కాం. అధ్యక్షులు) శ్రీయుత కల్లూరి చంద్రమౌళి యం. యల్. ఏ. గారిని నన్ను ఈ క్రింది సామ్రాజ్య వ్యతిరేక సంఘముల నుండి ఒక్కొక్క ప్రతినిధిని తీసికొని, కాంగ్రెస్ ప్రతినిధులతో కలిపి పై కార్యమును సాధించుటకు నిర్మాణ సంఘముగా నేర్పరుచుటకు ఉపసంఘముగా నియమించిరి. 1. జిల్లా రైతు సంఘం 2. జిల్లా వ్యవసాయ కూలీ సంఘం 3. జిల్లా విద్యార్థి ఫెడరేషన్ 4. తెనాలి అచ్చు పనివారల సంఘం 5. గుంటూరు అచ్చు పనివారల సంఘం 6. చీరాల ఐ.యల్.టి.డి. వర్కర్ల యూనియన్ 7. జిల్లా మోటారు డ్రైవర్ల యూనియన్ 8. జిల్లా ట్రైబ్సు సంఘం 9. జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ. ఈ సంఘముల వారు మహా సభకు కావలసిన డబ్బు వసూలును, సదుపాయములను జేయుదురు. సెప్టెంబరు 10 వ తేదీన మా ఉపసంఘము ప్రతినిధులను సమావేశ పరచును. ఈ లోపల పై సంఘములవారు ప్రతినిధుల నెన్నుకొని, వారి చిరునామాను, కామ్రేడ్ పి. వి. శివయ్య (అరండల్ పేట, గుంటూరు)కు పంపవలెను. కాంగ్రెస్, ఇతర సామ్రాజ్య వ్యతిరేక సంస్థలు, ప్రజలు, యీ కాన్ఫరెన్సులను జయప్రదంగా జరపడానికి సర్వ విధాల తోడ్పడవలెనని ప్రార్థన. ఈ విధమైన పిలుపుకు ప్రతి వారు పరుగెత్తుదురని ఆశిస్తున్నాను.

పెద నందిపాడు — లావు అంకమ్మ,

31—8—38 — ఫెడరేషన్ యుద్ధ ప్రతికూలాందోళనా కమిటీ సమావేశకర్త,

జాయింటు శక్రటరీ, గుంటూరు జిల్లా కాంగ్రెసు సంఘము

* * *

చల్లపల్లి రాజా గారి హైస్కూలు
హెడ్ మాస్టరు గారికి

బహిరంగలేఖ.

గురూజీ,

నమస్కారములు. నే నొక విషయాన్ని మనవి చేయ దలిచాను. మీరు శనివారము పరీక్షలు పెట్టుచున్నారట. స్కూలుఫైనలు వాళ్ళకు రెండు రౌండ్లు, తక్కిన వారికి ఒక రౌండు నట. శనివారము నాడు పెట్టి దూరపు గ్రామ విద్యార్థుల్ని, ఉపాధ్యాయుల్ని యాతన పెట్టకపోతే క్వార్టర్లీ తీసివేయకుండా ఉంచరాదూ? విద్యార్థులకు వారానికి రెండు రోజులన్నా విశ్రాంతి లేకపోతే కష్టము కాదా? అందులో చుట్టుపట్ల గ్రామాల పిల్లలకు మరీ కష్టము కాదా?

క్రిందటి సంవత్సరము ప్రతి వెకేషన్ లోను ప్రయివేటు క్లాసులు స్కూలుఫైనలు వాళ్ళకు పెట్టారట. చివరకు పబ్లిక్ పరీక్షకు ముందు గూడ ఈ సంవత్సరము గూడ అట్లే చేసెదరా? ఔను వారికి విశ్రాంతిగా చదువుకోకుండా టైము లేకుండా చేయవచ్చునుగా. ప్రక్కనున్న అవనిగడ్డ హైస్కూలులో స్కూలు ఉదయము 10½ గంటలకు పెట్టినా, దినమునకు 6 పిరీడ్సు పెట్టినా, శనివారములలో స్కూలు పెట్టకపోయినా, వెకేషన్స్‌లో ప్రయివేటు క్లాసులు లేకపోయినా కోర్సులన్నీ సకాలమునకు పూర్తి అవుతున్నాయి. ఫలితాలు బాగుంటున్నాయి. కారణము? బహుశా పాఠములను బోధించుటలో ఏమైన గలదా? సరే గాని స్కూలు తెరచి రెండు నెలలైనా కొన్ని క్లాసులలో పాఠములు చెప్పుట మొదలుపెట్టలేదటగా రాజా గారు మాస్టర్లను సప్లయి చెయ్య నన్నారా? లేక మీరే, "మేము సద్దుకుంటాము లెండి. మరల ఖర్చెందుకు?" అని అన్నారా? చెప్పవలసిన పాఠాలు యికనైనా మొదలుపెట్టెదరా? లేక మరల వెకేషన్లలో ప్రయివేటు క్లాసులు పెట్టెదరా? అయితే, 27-8-38 శనివారము ఉదయము 7—30 గంటలు మొదలు 11—45 గంటల వరకు స్కూలు పెట్టినారటగా. ప్రతి ఉదయం 4 పిరీడ్సు పెట్టినప్పుడే విద్యార్థుల లేత మనస్సులకు కష్టము గదా? మీ రేమైన ఆలోచించి చూచారా? 5 మైళ్ళనుంచి చుట్టుపట్ల పిల్లలు బురదలో నడిచి 7—30 గంటలకు ఎంత శ్రమపడి వచ్చెదరో మీరు గ్రహించారా?

ఇట్లు
బొందలపాటి రాధా కృష్ణ.

రైతులకు
లెనిన్ సందేశం



రష్యాలోని పల్లెటి గ్రామాలలోని జీవితములో సర్వత్రా ఉండే సమస్యలను చూస్తే ప్రజా ప్రతినిధి పరిషత్సభా సమావేశమునకై ఆందోళన చేయుటకెన్నో సూత్రాలు (Themes) దొరుకుతాయి. రైతుల యొక్క స్థానిక అత్యవసర సమస్యలను అందులోనూ స్పష్టమైన సమస్యలను ఆధారంగా తీసుకొని యీ ఆందోళనను సాగించాలి. కేవలం వీటితోనే సరిపెట్టక, రైతులు రాజకీయ చైతన్యం క్రమక్రమంగా అభివృద్ధి పొందించుకొనేటట్లు వారిని నడపాలి. రాజ్యాంగ యంత్రములో భూస్వాములకు, రైతులకు ఏ ఏ ప్రత్యేక స్థానాలు వున్నాయో, రైతులకు అవగాహన మయ్యే లాగున చేయాలి. పల్లెటూళ్ళల్లో వ్యాపించియున్న నిరంకుశత్వము, పీడనలో నుండి రైతులు వెలువడుటకు, ప్రజా ప్రతినిధి పరిషత్ సభను ఏర్పాటుచేసి, అధికారుల నిరంకుశత్వమును కూలద్రోయుటయే సాధనమని వారు గమనించునట్లు చేయవలయును. రాజకీయ స్వాతంత్ర్యమును గూర్చిన కోర్కెలను కార్మికులు అర్థం చేసుకోలేరనడం బుద్ధి తక్కువ. యెన్నో సంవత్సరాలనుండి ఫ్యాక్టరీ యజమానుల తోడను పోలీసుల తోడను ప్రత్యక్ష పోరాటాన్ని సాగిస్తూ తమ నాయక శిఖామణుల పరిస్థితులు నిర్బంధము కళ్లారా చూస్తూ గొప్ప అనుభవాన్ని సంపాదించి, సోషలిస్టు భావాలతో నిండిన కార్మికులే గాదు, తన చుట్టు ప్రక్కల ఏమి జరుగుతోందో చూచి ఆలోచించే ప్రతి రైతూకూడా, యీ కార్మికులు దేనికై పోరాడుతున్నారో, తెలుసుకో గలుగుతాడు. తమను అధికారుల యొక్క నిరంకుశ పెత్తనం లోనుండి విముక్తులను జేసే ప్రజాప్రతినిధి సభ లంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోగలరు. రైతుల యొక్క అత్యవసర ప్రత్యక్ష సమస్యలను ఆధారంగా తీసుకొని, ఆందోళన చేస్తే దాని ఫలితం గలుగుతుంది. "వర్గ సమరాన్ని గ్రామాలకు కూడా పాకిస్తుంది." ఆర్థిక దుర్లక్షణాన్ని (economic evil) విమర్శించి ఖండించేటప్పుడు దానిని స్పష్టమయిన రాజకీయ కోర్కెలతో జోడించి నప్పుడే యిది సాధ్యమౌతుంది.

మన విప్లవంలో ప్రస్తుతపు స్థాయి అయిన బూర్జువా డెమోక్రేటిక్ స్థాయిలో భూస్వామ్య పద్ధతి (land lordism) రద్దుచేయాలి అనేది అత్యవసర నినాదం.

"ఇరుపక్షాలలోనూ కూడా, మన అంతిమ ఆశయాన్ని గాక, ప్రస్తుతపు కోర్కెలనే సూచిస్తాము. రెండు పక్షాలలోనూ కూడా ఈ నాటి బూర్జువా సమాజపు హద్దులలోనే వుంటాము. ఇదీ ఈ రెండు వర్గాలకు మధ్యనుండే సామ్యము (Simlarity) ఇందులో కార్మిక పక్షపు కోర్కెలు బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా ఉంటాయి. రైతుల యొక్క కోర్కెలు మధ్య యుగపు భూస్వాములకు వ్యతిరేకంగా ఉంటాయి. ఇవీ ఈ రెండు వర్గాల పోరాటాలలో నుండే ముఖ్యమయిన వ్యత్యాసము. మొదటిదాని (కార్మిక వర్గపు కోర్కెల) విషయంలో ప్రస్తుత బూర్జువా సమాజములో ఆచరణీయమయిన అభివృద్ధికర మార్పులనే వాంఛిస్తాము. కాని రైతుల విషయంలో ప్రస్తుత విధానం యావత్తూ ఇప్పటికీ మిగిలియున్న బానిసత్వ చిహ్నాలతోసహా ఊడిచి వేయుట మన ప్రస్తుత ఆదర్శము. కార్మిక వర్గమునకు సాంఘిక విప్లవానికి సంబంధించిన కోర్కెలు ఇప్పుడుండవు. యీ సాంఘిక విప్లవం శ్రామిక వర్గానిది. అది మన అంతిమ ఆశయం నెరవేరుటకు శ్రామికవర్గము బూర్జువా వర్గాన్ని కూడా కూలద్రోసే విప్లవము. రైతుల విషయంలో యిట్టి సాంఘిక విప్లవం మధ్య యుగపు భూస్వామి వర్గంయొక్క అధికారాన్ని నాశనం చేస్తుంది. (అనగా, ఫ్రెంచి విప్లవం వంటి బూర్జువా వర్గం చేసిన సాంఘిక విప్లవం అన్నమాట). ఈ విప్లవం ప్రస్తుత బూర్జువా సమాజపు హద్దులలో సానుకూల పడుతుంది.

★

రాజకీయ పోరాటంలో రైతులు.

1902 లో వచ్చిన రైతుల తిరుగుబాటు ఎందుకు ఎల్లా అణచివేయ బడిందో—జారు చక్రవర్తి యొక్క దాసులకు కాక, కార్మిక, కర్షకులకు విజయం సంపాదించాలంటే ఏమి చేయాలో. రైతులు స్పష్టంగా తెలుసుకొనునట్లు, వర్గ చైతన్యము పొందిన కార్మికులు శాయశక్తులా పని చేయాలి.

1902 లోని, ఆ తిరుగుబాటు సాగించినది అమాయకులు, అజ్ఞానులూ, అయిన రైతాంగము అవడం చేతనూ, రాజకీయ కోర్కెలు, అనగా రాజ్యాంగ యంత్రపు నిర్మాణంలో మార్పులు కావాలనే కోర్కెలను, సూచించక పోవుట చేతనూ, ఆ తిరుగుబాటు అణచివేయ బడింది. ఆ తిరుగుబాటు ముందుగా తగు సన్నాహాలను ఏర్పాటు చేసుకొనక పోవుటచే, అలా జరిగింది. గ్రామాలందలి శ్రామికవర్గం పట్టణపు శ్రామిక వర్గంతో యింకను సహకారమును ఏర్పాటు చేసుకొనక కలియక పోవుట చేత కూడా ఆ తిరుగుబాటు అణచివేయ బడింది. మొదటి పోరాటంలో రైతులు ఓడిపోవుటకి మూడూ కారణాలు. నెగ్గాలంటే ప్రతి తిరుగుబాటునకూ, విదితమైన ఒక ఆశయం, ముందు అందుకు తగు సన్నాహాలు, పట్టణములందలి కార్మిక వర్గం యొక్క పోరాటముతో జోడింపబడి దేశమంతటా జరిగేలాగున కట్టుదిట్టం చేసుకోవాలి. పట్టణపు కార్మిక వర్గం యొక్క పోరాటాలలో కలిగే ప్రతి అభివృద్ధియు, గ్రామీయ శ్రామిక వర్గానికై యివ్వబడిన వర్గ విజ్ఞానవంతుడగు కార్మికుని ప్రతి ఉపన్యాసము, ప్రతి సోషలిస్టు పత్రికా, పుస్తకమూ, విప్లవ పోరాటాన్ని తిరిగి తీసుకు వచ్చుటకును, దానిని దగ్గరకు కొనివచ్చుటకును జయప్రద మగునట్లు చేయుటకు సహాయకారి యగును.

పడే బాధలను భరించలేక పోవుటచేతనూ, నోరులేని జీవాలవలె మాడి చావడానికి నిరాకరించుట చేతనూ, పోరాడక ఉండజాలక పోవుట చేతను రైతాంగం ఒక ఆదర్శం లేకుండా, తిరుగబడ్డారు—దోపిడీ, నిర్బంధం, పీడల, వలన రైతాంగం ఇంతింతనరాని పాట్లు పడ్డారు. పాపం జార్ చక్రవర్తి దయను గూర్చిన పుకార్లు నమ్మారు. బతికి ఉన్నన్నాళ్ళూ పరులకై పాటుబడి, ఏటి పొడుగునా, ఊడ్చి పెంచి, కోసిన రైతు ఒక వంక మాడిపోతూంటే, ఇంకొకవంక "గౌరవనీయుల" ఇండ్లలో పుచ్చిపోతూ ధాన్యం కుప్ప తిప్పలుగా పోగుపడి ఉంటే, వారికి ధాన్యం పంచిపెట్టించడం న్యాయమేనని ఇంగిత జ్ఞానమున్న ప్రతివాడు తలుస్తాడని అనుకొన్నారు. కాని దేశమందలి మంచి భూములన్నీ ఫ్యాక్టరీలన్నీ భాగ్యవంతులు పెద్ద భూస్వాములూ తమ స్వాధీనంలో ఉంచుకొన్నారనీ, ధనాధికారులకు చాకిరీ చేసేటందుకు ప్రజలను మాడ్చడానికే అల్లా చేస్తున్నారనీ, పాపం ఆ రైతులు మరచిపోయారు. ధర్మ శాస్త్రజ్ఞుల ఉపదేశాలే కాకుండా, లక్షలాది సైనిక బలగం కలిగి, నిరంకుశా పాలకుల (Bureaucrats) తో నిండియున్న జారు చక్రవర్తి ప్రభుత్వము కూడా యీ ధనిక వర్గాన్ని రక్షిస్తోందని మరచిపోయారు. అది తాత్కాలికంగానే. తరువాత, జార్ ప్రభుత్వం తానేమిటో తానెవరికి సేవజేస్తుందో, యెవరి రక్షణకై తాను ఏర్పడి ఉన్నదో, పైశాచిక స్వరూపంలో వారికి చూపించింది.' యీ గుణపాఠాన్ని రైతులకు మనం పదే పదే జ్ఞాపకం చేయాలి. ప్రభుత్వ నిర్మాణంలో ఎందుకు మార్పు అవసరమో, రాజకీయ స్వేచ్ఛ ఎందుకు అవసరమో, రైతులు సులభముగా అప్పుడే, అర్థం చేసుకో గలుగుతారు.

ఎక్కువమంది ఇవన్నీ అర్థం చేసుకొన్నప్పుడే, రైతుల తిరుగుబాటుకి ఒక ఆశయం ఏర్పడుతుంది. చీనికితోడు చదువను, వ్రాయను నేర్చినవాడు తనను గూర్చి తానాలోచించే ప్రతి మనిషీకూడా తానీదిగువ మూడు విషయాలకై ముందుగా పోరాడాలని తెలుసుకోవాలి. రష్యాలో ప్రస్తుతమున్న నిరంకుశ ఏక ఛత్రాధిపత్య పరిపాలనా విధానం బదులు, ప్రజాహితమైన బాధ్యతాయుత ప్రజాపరిపాలన ఏర్పాటు చేయాలనే ఆశయంతో ప్రజా ప్రతినిధి పరిషత్తును దేశములో ఏర్పాటు చేయుటకు పూనుకొనుట మొదటిది. తన యిచ్చవచ్చిన పుస్తకాన్నిగాని పత్రికనుగాని ప్రకటించుట ప్రతి వ్యక్తికీ సంపూర్ణ స్వాతంత్ర్యముండ వలయును. ఇది రెండవది. ఇతర ఆస్తులకువలెనే, వ్యవసాయదారుల ఆస్తికి కూడ సమాన ప్రతిపత్తీ, హక్కులూ శాసనము ద్వారా గుర్తింపబడవలెను. అన్నిరకములయిన మధ్య యుగపు బానిసత్వాన్ని రూపుమాపుటకు పూనుకొనే ప్రధాన ఆశయములో రైతు కమిటీలను ఎన్నుకొన వలయును. ఇందుకు సంపూర్ణావకాశా ముండవలయును. ఇది మూడవది. సోషలిస్టుల యొక్క ప్రధాన కోర్కెలు యీమూడు. వీటిని రైతులు అర్థం చేసుకోలేకపోరు. ప్రజల రాజకీయ హక్కుల స్థాపనకై ఎక్కడ నుండి పోరాటము ప్రారంభించాలో పూర్తిగా ప్రపంచానికి అర్థమవుతుంది. ఇవన్నీ అర్థం చేసుకొన్నాము యిందుకై సన్నాహాలు నిర్బంధీకితో చాలా కాలము ముందు నుండియు చేసుకోవాలనియు ఈ ప్రయత్నం రనమట్టుక తాను వేరుగా చేసుకోకూడదనియు, పట్టణాలలోనున్న సోషలిస్టు కార్మికులతో కూడా కలసి పనిచేసుకోవాలనియు, రైతులు పూర్తిగా అర్థం చేసుకో గలుగుతారు.

(నేషనల్ ఫ్రంటు నుండి)

వార్తాలహరి

చిత్తూరు జిల్లాలో కాంగ్రెసు

సోషలిస్టుల ప్రచారము

ఇటీవల యస్. నారాయణ, ఆర్. యం. రత్నం, ఆర్. బి. పెండ్యాలగారలు బయలుదేరి పుత్తూరు, చంద్రగిరి, కాళహస్తి తాలూకాలలోని యీ క్రింది గ్రామముల యందలి రైతులోకమున రైతు కూలీ పాటలను పాడియు, చక్కని ఉపన్యాసములు చేసియు రైతుల నేటి దుస్థితిని గుర్తించునటులచేసి ఎస్టేటు ల్యాండు ఆక్టును గురించియు, జమీందారీపద్ధతి పూర్తిగా నశించాలి అనియు, నాటికి రైతులు చేయవలసిన ఆందోళనను గూర్చియు విపులముగా తెలియజేసిరి. ప్రతి పల్లెయందు రైతు సంఘము స్థాపించిరి. చాలా పల్లెలలో జమీందార్ల వల్ల లంచాలు పొంది రైతు సంఘాలకు ప్రతికూల ప్రచారము చేయువారు కొందరు వీరికి అడ్డుతగులు చుండిరి. జిల్లా రైతు సంఘములో మెంబర్లను చేర్పించు చున్నారు. ప్రచారంచేసి రైతు సంఘాలు స్థాపించిన గ్రామాలు:

చెంగారెడ్డిపల్లె, కరకంబాడు, మామండూరు, పర్చేదు, కోబాకు, కందాడు, మోదుగుల్లపాలెం, సరస్వతి కండిగ, రాజుపాలెం, మెరకలపుత్తూరు, మునగల పాళెం, గురువరాజులపల్లె, అడపారేవుపల్లె, యెగువ రామాపురం, దిగువ రామాపురం, వెంకటాపురం, కమ్మపల్లి, రావిళ్ళవారి పల్లె, ఎగువ కండిగ, వెంకట పెరుమాళపురం, చెట్టిపల్లె, యింకనూ కొన్ని గ్రామాల్లో రైతులతో, కూలీలతో కలుసుకొని వారి కష్టాలు ప్రభుత్వమునకు, జిల్లా కలెక్టరుకు, జమీందార్లకు, పత్రికలకు పంపిరి.

ఆర్. బి. పెండ్యాల,

ఆర్. యం. రత్నం.

★ ★ ★

జిల్లాబోర్డు ఎన్నికలు

26 వ తేదీ 2 గం॥ పశ్చిమ గోదావరి జిల్లా మహిళా సంఘము జిన్నూరులో భూపతిరాజు వెంకమ్మగారి గృహమున భూపతిరాజు వెంకమ్మగారి అధ్యక్షత క్రింద సమావేశమై ఈ క్రింది తీర్మానము తీర్మానించినారు.

రాబోవు ప॥ గో॥ జిల్లాబోర్డు ఎన్నికలయందు స్త్రీ అభ్యర్థులను నియమించుట యందు ప॥ గో॥ జిల్లా మహిళా సంఘమువారితో సలహాచేసి స్త్రీ సంఘ శ్రేయోభిలాషులగు దేశసేవికులనే నియమించ వలసినదిగా ప॥ గో॥ జిల్లా కాంగ్రెసు సివిక్ బోర్డువారిని కోరుచు తీర్మానించు చున్నారు."

★ ★ ★

కాంగ్రెస్ ఎన్నికలు

సోషలిస్టు పార్టీవారు పోటీ లేకుండా ఎన్నుకొనబడుట

నర్సాపురము తాలూకా • గుమ్మలూరు సర్కిల్ యొక్క జిల్లా, తాలూకా, కాంగ్రెస్ సంఘ ప్రతినిధుల యెన్నికలు యిదివరలో తగాయిదాలు వచ్చుటచేత అగిపోయినవి. మరల యిప్పుడు, సదరు స్థానములకు ఎన్నికలు జరుప వలసినదని, రాష్ట్ర సంఘమువారు వుత్తర్వులు యిచ్చిరి. ఆ ప్రకారము పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెస్ సంఘ కార్యదర్శి గారైన శ్రీ ముదుగంటి జగన్నాథ శాస్త్రిగారు పాలకొల్లు కాంగ్రెసు ఆఫీసులో నామినేషనులు దాఖలు చేసుకొన్నారు. యీ దిగువ నుదహరించిన సోషలిస్టు పార్టీకి చెందినవారు ఎట్టిపోటీ లేకుండగనే ఎన్నుకొన బడిరి. శ్రీయుతులు భూపతిరాజు లక్ష్మీనర్సు రాజుగారు (వుపాధ్యక్షులు జిల్లారైతుసంఘము) జిల్లా కాంగ్రెసు సంఘమునకునూ, శ్రీపాద రామకృష్ణ శర్మ గారు, (ప్రెసిడెంటు, రైతు సంఘము, గుమ్మలూరు) వడాల వెంకట సుబ్బారావుగారు, కనుమూరి సుబ్బరాజుగారున్నూ తాలూకా కాంగ్రెస్ సంఘమునకున్నూ ఏకగ్రీవముగా యెన్నుకొన బడిరి.

మహిళా సంఘము

నర్సాపురం 26—8—38.

నిన్న సాయంకాలము 2 గంటలకు నర్సాపురం పట్టణమున పశ్చిమ గోదావరి జిల్లా మహిళా సంఘాధ్యక్షురాలగు శ్రీమతి భూపతిరాజు వెంకమ్మగారున్ను, గుంటూరు కాపురస్థులగు శ్రీమతి జొన్నలగడ్డ అన్నపూర్ణమ్మగారున్ను వచ్చి పట్టణ మహిళా సంఘమును స్థాపించిరి. నర్సాపురం పట్టణ మహిళా సంఘమునకు యీ క్రింద నుదహరించినవారు సభ్యులచే ఆయా పదవులకు యెన్నుకోబడిరి. శ్రీమతి వారణాశి వెంకటరత్నమ్మగారు అధ్యక్షురాలుగను, శ్రీమతి మద్దుల అన్నపూర్ణమ్మగారు కార్యదర్శిగను, శ్రీమతి బుర్రా పుల్లమ్మగారు, శ్రీమతి మద్దుల సుభద్రమ్మగారు, శ్రీమతి భాస్కర్ల పురుషోత్తంగారు కార్యనిర్వాహక సంఘ సభ్యులుగను యెన్నుకోబడిరి. తరువాత సదరు సంఘాధ్యక్షురాలగు శ్రీమతి వారణాశి వెంకటరత్నమ్మగారి అధ్యక్షతను ప్రత్యేక సమావేశము జరిగి యీ క్రింది తీర్మానములు ఏకగ్రీవముగా అంగీకరించ బడెను. భారత శాసన సభలో శ్రీమతి పి. రాధాభాయి సుబ్బరాయన్ గారు పెట్టబోయే బహు భార్య నిరోధక చట్టమును గురించి ఏకగ్రీవముగా అంగీకరించిరి. రేపు అక్టోబరులో జరుగబోవు జిల్లా బోర్డు యెన్నికలలో జిల్లా మహిళా సంఘము వారిచే సూచించిన స్త్రీ సభ్యులను సదరు ఎన్నికలలో స్త్రీ స్థానములకు నిలువబెట్టవలసినదిగా జిల్లా కాంగ్రెసు సంఘమువారిని, సివిక్ బోర్డు వారిని కోరుటకు అంగీకరించిరి. రేపు జరుగబోయే జిల్లాబోర్డు యెన్నికలలో మహిళా సంఘ సభ్యులందరు కాంగ్రెస్ పక్షమున పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థుల విజయమునకే పాటుబడ వలసినదిగా ఏకగ్రీవముగా అంగీకరించబడెను. తరువాత అధ్యక్షురాలిచే సదరు సభ్యులకు ప్రేక్షకులకు అల్పాహార విందు చేయబడెను. తరువాత సదరు సంఘ సభ్యులందరు కలసి గ్రూపు ఫొటో తీయించుకొనిరి. అంతటితో సభ ముగిసెను.

యస్. వి. రత్నమ్మ.

మహిళా సభ

కాకినాడ, 22-8-38.

21 ఆగస్టు ఆదివారం మధ్యాహ్నం పట్టణ సోదరీమణులు శ్రీమతి జి. రత్నమ్మగారి (ఏలూరు) అధ్యక్షత క్రింద సమావేశమైరి. సభలో [illegible] కామ్రేడ్ పి. జగదాంబగారు స్త్రీ విద్యమావశ్యకతను గురించి, శ్రీమతి జి. కమలమ్మగారు బాల్య వివాహములను గురించి, శ్రీమతి వి. సరస్వతిగారు అస్పృశ్యతను గురించి, శ్రీమతి పి. కనకరత్నమ్మగారు స్త్రీ విద్యావశ్యకతను గూర్చి శ్రీమతి బి. మణిగారు ఘోషా పద్ధతిని గురించిన్నీ మాట్లాడిరి.

పిమ్మట ఈదిగువ తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదింపబడెను.

1. "యుద్ధ ప్రతికూల తీర్మానము": —రాజ్యముల కొరకు ప్రాకులాడుచున్న సామ్రాజ్య దేశాలు అప్పుడే యుద్ధాలు సాగించుచున్నాయి. ఇటలీ, జర్మనీ దేశాలు స్పెయిను ప్రభుత్వము మీద రెండు సంవత్సరముల నుంచి తిరుగుబాటు కొనసాగించు చున్నారు. జపాను చైనా మీద దాడి వెడలింది. బ్రిటిషు సామ్రాజ్యము ఈ యుద్ధాలు చేయుచున్న ఫేసిస్టులను ఒక మూల ప్రోత్సహించుచూ, వేరొకమూల ఎంతో ధనము వ్యయముచేసి యుద్ధ ప్రయత్నాలు చేయుచున్నది. బ్రిటిషు సామ్రాజ్య యుద్ధ ప్రయత్నాలు భారతదేశ ప్రజలకు పూర్తి నష్టము కనుక యీ సభ బ్రిటిషు ప్రభుత్వానికి ఎట్టి సహాయము చేయరాదని ప్రజలను హెచ్చరించు చున్నది. స్పెయిను, చైనా ప్రజలకు సానుభూతిని తెలుపుచున్నది.

2. సంఘ సంస్కరణ విషయములు చర్చించుటకై, ఆర్థిక రాజకీయ సమస్యలు చర్చించుటకై పుస్తకములు, వార్తా పత్రికలు చదివి క్రొత్త విషయములు తెలుసు కొనుటకై ఈ సభ ఒక పఠన సమితిని స్థాపించుటకై తీర్మానించుచున్నది.

ఇట్లు

పి. జగదాంబ

కాకినాడ పట్టణ మహిళా సంఘ కార్యదర్శిని.

★ ★ ★

శ్రీమతి మూల్పూరి చుక్కమ్మగారి ధర్మనిధి

ఈ నిధియొక్క ధర్మకర్తలు గత మాసాంతమున ఏలూరులో సమావేశమయి ఈ సంవత్సరము ఈ దిగువ రీతిని విరాళముల నిచ్చుటకు తీర్మానించిరి:

హరిజన బాలికా వసతి గృహము (ఏలూరు)	రు 50-0-0
శారదా నికేతనము (గుంటూరు)	50-0-0
వితంతూద్వాహము (కాజ సీతారామయ్య దంపతులు)	50-0-0
హరిజన విద్యార్థులు	
కుసుమ రాజా రామ మోహనరావు	15-0-0
అంగులూరి వీరయ్య	10-0-0
సుంద్రు కాసీ అన్నపూర్ణాదేవి	20-0-0
సక్కా షకీరు	5-0-0

ఇట్లు

కార్యదర్శి

మూల్పూరి [illegible]

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘ సహాయార్థం.

గుంటూరులో 15-8-38 న మిస్ పద్మావతి శాలిగ్రాం (బొంబాయి) చే ప్రదర్శింపబడిన గాన ప్రదర్శన లెక్క.

టిక్కెట్ల అమ్మకం జమ	రూ	188-12-0
ప్రకటన వగైరా ఖర్చులు	,,	36-5-0
మునిసిపాలిటీకి ప్రదర్శన పన్ను క్రింద డిపాజిటు చేసినది	,,	10-0-0
మిస్. సాలిగ్రాం అండ్ పార్టీకి ఖర్చులు వగైరాల క్రింద ఇచ్చినది.	,,	62-9-0
		108-14-0
		188-12-0
		108-14-0
		79-14-0
పత్రికలకు ప్రకటన ఖర్చులు		0-4-0
పోను నిల్వ		79-10-0

ఈ పై మొత్తములో రు 47-0-0 లు ఇంకా వసూలు కావలసి యున్నది. మిగత రు 32-0-0 లు నిల్వ ధనం. ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘ కార్యదర్శిగారికి లెక్కలతో ఒప్పగించడమైనది.

(మునిసిపాలిటీకి ప్రదర్శన పన్ను తీసివేయ వలసినదిగా కోరినాము. అట్లు తీసివేసిన, డిపాజిటు ధనము రు 10-0-0 లు సంఘాదాయములోనే కలుపబడును.)

ఇట్లు,

వి. శ్రీ కృష్ణ.

ఆర్గనైజరు.

★ ★ ★

విశాఖపట్నం విద్యార్థి సంఘము.

ఈపై సంఘము యొక్క సెంట్రల్ కౌన్సిల్ 21 వ తేదీ సాయంత్రము సమావేశమై యీ క్రింది విషయములపై చర్చచేసి తీర్మానములనామోదించెను.

అఖిలభారత స్టూడెంట్సు ఫెడరేషన్ వారు మెడ్రాస్ సమావేశమందు చేసిన తీర్మానము ననుసరించి, యీ విద్యార్థి సంఘమువారు, యిక్కడి ప్రజా సామాన్యమందు విద్యావిహీనతను పారద్రోలుట యందు సహాయపడుటకై రాత్రి స్కూళ్ళను స్థాపించవలెను. దీనికై మొదట జాలరులకై (fisher men) వక రాత్రి స్కూలు స్థాపించి నడుపవలెను. ఈ పాఠశాలకగు ఖర్చుకై 10 రూపాయలు యిచ్చుటకు తీర్మానింపబడెను. మరియు రాత్రి స్కూళ్ళ స్థాపనార్థమై జీ. రామకోటేశ్వరరావు గారిని ఆర్గనైజరుగా నియమించుటకు నిశ్చయింపబడెను. రాత్రి స్కూలును విద్యార్థులు 1 వ తేది సెప్టెంబరు నుండి నడుపుదురు.

ఆపై ఆంధ్రరాష్ట్రపు విద్యార్థులందరకును గల సామాన్య ప్రత్యేక కష్టములను గురించియు తెలిసికొనుటకై ప్రశ్నోత్తర రూపమున విద్యార్థులను గురించిన అన్ని విషయములను ఒకచో తయారు చేయవలెననియు తీర్మానింపబడెను. అందుకై ఒక Statistics కమిటీ నొకదానిని (5 మెంబర్లు) నియమింపబడెను.

తరువాత కాంగ్రెసు ఆఫీసులో నొకభాగము విద్యార్థుల ఆఫీసుగా వాడుకొనుటకై అనుమతి వచ్చినందులకు పట్టణ కాంగ్రెసువారికిని, రాత్రి పాఠశాల కొరకై వాడుటకు మ్యునిసిపల్ ఎలిమెంటరీ స్కూలును వాడుటకు అనుమతి నిచ్చినందులకు మ్యునిసిపల్ చైర్మను గారికిని కృతజ్ఞత తెల్పుచూ తీర్మానింపబడెను. మరియు [illegible] విద్యార్థులు [illegible] నుండి [illegible] పోలీసులు జరిపిన దౌర్జన్యమును నిరసించుచు తీర్మానము [illegible] బడెను.

కమ్యూనిస్టులపై పరిషత్వ కమ్యూనిక్

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్య నిర్వాహక సభవారి తీర్మానం.

కమ్యూనిస్టు ప్రచారం మీద యివ్వబడిన మద్రాసు మంత్రివర్గం యొక్క కమ్యూనిక్కును యీ సభవారు తీవ్రంగా ఖండించుచూ, కేరళ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శులగు శంకరన్ నంబూద్రిపాద్‌గారు యీ కమ్యూనిక్కుకు జవాబుగా నిచ్చిన ఈక్రింది స్టేటుమెంటుకు తగిన జవాబని బలపరుస్తూ ఉన్నారు.

"కమ్యూనిస్టు ప్రచారము" మీద మద్రాసు ప్రభుత్వము ప్రకటించిన కమ్యూనిక్కును చూచి ఆశ్చర్యపడ్డాను. ఒక అఖిలభారతోద్యమాన్ని మోసపు ఎత్తుగడలతో అణచివేయడాని కిట్టి మార్గమును కాంగ్రెసు ప్రభుత్వము అవలంబించడము చూచి చాల బాధపడ్డాను.

"కమ్యూనిస్టు పార్టీ ప్రకటించినదన్న కరపత్రముల గూర్చి నేనేమియు చెప్పలేను. వానిని గూర్చి నాకు తెలుసునని ముందుకు రావడము లేదు. భారత కమ్యూనిస్టు పార్టీవియని గవర్నమెంటుచే ప్రకటించబడిన విషయాలు నేను సమర్థించడము లేదు. అవి అర్థములేనివి, తెలివితక్కువైనవి. నాకు తెలిసినంత వరకు, ప్రభుత్వముచే వెల్లడి చేయబడిన కరపత్రాలలోని ఉన్న భావాలు భారతదేశ కమ్యూనిస్టులెవరివీ లేవు. భారతదేశ సోషలిస్టులందరికీ తెలిసిన దత్తు బ్రాడ్లీ వ్యాసమే. జాతీయ పోరాటమును గూర్చి కమ్యూనిస్టుల యొక్క దృక్పథాన్ని తెలియజేస్తూ ఉంది. దానిలోని భావాలు ప్రభుత్వము ప్రకటించిన కరపత్రములలోనున్న భావాలు పూర్తిగా భిన్నము.

"ఏమైననూ, కమ్యూనిస్టు పార్టీ నిషేధించబడి యున్నప్పుడు, ఈ విధంగా కమ్యూనిస్టులపై మద్రాసు గవర్నమెంటు దాడివెడలడము (ఖండించడము) విరికి తనము. ప్రజా ప్రభుత్వము దేశము యొక్క నాగరికతను కాపాడడానికి కావలసిన చర్యలను తీసుకోవడము న్యాయమే. కాని ప్రజా ప్రభుత్వమని చెప్పుకొనే ప్రభుత్వమేది కూడ ఈ విధంగా నిషేధించబడిన పార్టీని - అది తన్ను సమర్థించుకోడానికి అవకాశము లేకుండినపుడు - విమర్శించినది చాల అరుదు. మీ ప్రజలను కమ్యూనిస్టు పార్టీ బోధించే సిద్ధాంతాల నుండి, అన్ని విధాల రక్షించుకోండి. కాని కమ్యూనిస్టు పార్టీపై నిషేధము తొలగించి, ఈ కరపత్రాలు నిజంగా అది ప్రకటించిందీ లేక ఎవరైనా పోలీసు ఏజంటు ప్రకటించిందీ తెలియజేయడానికి అవకాశ మివ్వండి.

"మద్రాసు కాంగ్రెసు ప్రధాని నేడే కమ్యూనిస్టులు ఈ ఆరోపణలకు జవాబు చెప్పుకో వచ్చునని ప్రకటించవలసి యుండి అప్పుడు అతని యెడల గాని, అతని ప్రభుత్వము యెడల గాని నాకెట్టి ఆక్షేపణ ఉండజాలదు. అతడా విధంగా చేయక - ఏది బ్రిటిషు సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పని చేయుటవల్ల అన్నిటికన్న అధిక నిర్బంధాలకు గురియైనదో - ఆ పార్టీపై ఈ విధంగా విరికి తనంతో, ఉంటరి తనంతో ప్రచారము చేసిన యెడల, అతడు, కాంగ్రెసేతరుడు లాగ పని చేస్తున్నాడని చెప్పడము చాల శాంతముతో చెప్పడము.

"అతడు, అతని మంత్రివర్గము, భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధము తొలగించడానికి జరిగే ఆందోళనలో చేరునని ఆశిస్తున్నాను."

పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యవర్గ సభ.

పై పార్టీ సమావేశము పాలకొల్లులో ది 26, 27, తేదీలలో కామ్రేడ్ గారపాటి సత్యనారాయణగారి అధ్యక్షతను సమావేశమై ఈ క్రింది విషయములు చర్చించి తీర్మానింపబడెను.

(1) రాబోవు జిల్లాబోర్డు ఎన్నికలలో సరియైన కాంగ్రెస్ వాదులను నిర్ణయించునట్లు ఆయా ఫిర్కా ప్రజలు ఆందోళన ద్వారా జిల్లా, రాష్ట్ర కాంగ్రెసు కమిటీలకు పంపుతూ ఎన్నికలలో కాంగ్రెసు విజయము కొరకు పాటుపడవలసినదని ఈ సభవారు తీర్మానించుచున్నారు.

(2) కాళీపట్నం రైతులు 2 నెలల పైనుండి శాంతియుతంగా భూములపై గల తమ న్యాయమైన హక్కుల కొరకు పోరాటాన్ని ధైర్య సాహసములతో సాగించుచున్నందులకు వారిని అభినందించుచూ అదే విధంగా ముందు కూడా పోరాటాన్ని జయప్రదంగా నడుప వలసిందని రైతులను ప్రోత్సహించుచూ, వారికి అవుసరమైన అన్ని సహాయములు చేయుటకు ఈ పార్టీ తరపున ఈ క్రింది వార్ని నియమించుచున్నారు.

1. అల్లూరి సత్యనారాయణ
2. భూపతిరాజు లక్ష్మీనరసరాజు
3. కలిదిండి బంగారాజు
4. ఉ. రామం

(3) ఏలూరు తాలూకా ఉప్పుగూడెం అగ్రహారం దారు అచటి రైతులను భూములనుండి బలవంతముగా తొలగించ వలెనని చేయుచున్న దౌర్జన్య ప్రయత్నములను ఎదుర్కొంటూ శాంతియుతంగా ఓపికతో తమ హక్కును నిరూపించు కొనుటకు రైతులు చేయుచున్న ప్రయత్నములను ఈ సభవారు బలపరుస్తూ వారి హక్కుల కొరకు ధైర్యముతో పోరాటాన్ని సాగించ వలసినదనియూ, అదే విధముగా—చింతలపూడి తాలూకా ముడిచెర్ల గ్రామ రైతులు, కూలీలు మొఖాసాదార్లను ఎదుర్కొని చేయుచున్న పోరాటాన్ని బలపరుస్తూ వార్ని కూడా యికముందు ధైర్యముతో పోరాటాన్ని సాగించ వలసినదని ఈ సభవారు హెచ్చరించు చున్నారు.

(4) ఏలూరు మంజువాణీ ప్రెస్సు సమ్మెలోనున్న పనివారలను అభినందిస్తూ ఏలూరు ప్రెస్సు వర్కర్సు యూనియనును ఏ విధంగానైనను భగ్నం చేయాలని ప్రెస్ యజమానులు చేయుచున్న ప్రయత్నములను, చర్యలను ఖండిస్తూ పనివారలలో చీలికలు తీసుకువచ్చి పనివారల బలాన్ని తగ్గించి సంఘాన్ని నాశనం చేయడానికి యజమానులు యిట్టి యెత్తులు వేయుదురని గ్రహించి పనివారలందరు ఇంకను చాల పట్టుదలతో నుండి వార్ల యూనియనును బలపరచుకొని యజమానుల ఎత్తులకు మోసపోక ధైర్యముతో యజమానుల చర్యలను ఎదుర్కొన వలయునని ప్రెస్ వర్కర్స్ యూనియనును యీ సభవారు హెచ్చరించుచున్నారు.

(5) నర్సాపురం డివిజను మోటారు వర్కర్సు యూనియనువారు తమ సక్రమ కోర్కెయగు "ఓవర్‌లోడ్" చేయుట మాని నందులకు గాను యింతవరకు 12 మంది డ్రైవర్లను యజమానులు పనిలోనుండి తొలగించి నందున నిరుద్యోగముచే బాధపడుచుండినను పట్టుదలతో పోరాటము సాగించుచున్నందులకు వారిని అభినందించుచూ, వెంటనే జిల్లాలో గల మిగతా మోటారు వర్కర్సు అందరూ యూనియనుగా ఏర్పడవలెనని హెచ్చరించుచూ జిల్లా ప్రజలందరూ నిరుద్యోగ పనివారలకు ధన సహాయము చేయవలసినదిగా కోరుచున్నారు.

స్థానిక ఎం. ఎల్. ఏ ల ద్వారా కాంగ్రెసు మంత్రి వర్గాలకు తెలియజేసి నప్పటికిన్నీ కాంగ్రెసు మంత్రులకు స్వయముగా వినతి పత్రములు సమర్పించు కొన్నప్పటికీ కాంగ్రెసు మంత్రులు కూడా మూకీభావము వహించి నందులకు విచారించుచూ,

ప్రజా సౌకర్యానికీ, చట్టానికీ అనుకూలంగా ఓవర్‌లోడు చేయుట మానిన వార్లకు పోలీసు వారు సహాయము చేయుటకు బదులు బస్సు యజమానులతో కలిసి "ఓవర్ లోడు" చేయుటకు అనుకూలంగా చేయుచున్న చర్యను ఈ సభవారు ఖండించు చున్నారు.

(6) మహాత్మా గాంధీగారు యీ మధ్య కార్మికులు తమ సమ్మె సమయములో పికెటింగు చేయుటయే దౌర్జన్యమనియు అట్టి దౌర్జన్యమును అణచుటకు యజమానులు పోలీసుల సహాయమును తీసుకొనుమనియూ కాంగ్రెస్ మంత్రులు పోలీసులను యజమానులకు సహాయముగా పంపవలెననియు చేసిన హెచ్చరిక కార్మికులపట్ల చాల ఘోరమగు అన్యాయము కలిగించు చున్నదనియూ, యజమానుల దౌర్జన్యముల నుండి బైట పడుటకు ప్రభుత్వపు బిగింపులన్నియు పోగా మిగిలిన పికెటింగు స్వాతంత్ర్యము గూడ నిరోధించుటయే యనియూ, గాంధీ—ఇర్విన్ ఒడంబడికలో ఒప్పుకొనబడిన పికెటింగు స్వాతంత్ర్యమును ఈనాడు గాంధీగారు కార్మికులకు లేకుండ చేయుట స్వాతంత్ర్య పోరాటమును భగ్నపరచుటయేయని ఈ సభవారు తలచుచున్నారు.

క్రిమినల్ లా అమెండుమెంట్ ఆక్టు.

(7) మద్రాసు శాసనసభలో "క్రిమినల్ లా అమెండ్‌మెంటు ఆక్టును రద్దు చేయుటకు ప్రవేశపెట్టబడ్డ తీర్మానాన్ని కాంగ్రెసు సభ్యులందరూ త్రోసివేయుట కాంగ్రెసు యొక్క ప్రధాన సూత్రాలకే భంగకరమని ఈసభ వారు అభిప్రాయపడుచున్నారు.

యుద్ధ ప్రతికూలం.

(8) బ్రిటిష్ సామ్రాజ్యము తన నిరంకుశ అధికారాన్ని సుస్థిరంగా నిలుపుకొనడానికి తన స్వార్థము కొరకు చేయబోయే సామ్రాజ్యవాద యుద్ధంలో భారత దేశాన్ని యిదివరకువలెనే ఉపయోగించు కొనాలనే ప్రయత్నానికి ఫలితంగా సెంట్రల్ ఎసంబ్లీలో యుద్ధప్రతికూల ప్రచార నిరోధక బిల్లును ప్యాసుచేసిన ప్రభుత్వ చర్యను మన్నిస్తూ దానికి స్వాతంత్ర్యము కోరుచున్నామని పైకి ఉపన్యాసాలు చేస్తూ సమయానికి బ్రిటిషు సామ్రాజ్యంతో చేతులు కలిపి తీర్మానానికి ఓటు చేసిన ముస్లింలీగ్ పార్టీ చర్యనున్ను ఈ సభవారు ఖండించు చున్నారు.

(9) ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులను పురస్కరించుకొని రేపో మాపో ప్రపంచ యుద్ధము రానున్నది గాన ప్రజా సామాన్యాన్ని మేల్కొలుపుటకై సేనలో ఎవరు చేరరాదని తీవ్ర ప్రచారము వెంటనే గ్రామ గ్రామాన సాగించుటకై హరిపుర కాంగ్రెస్ తీర్మానాన్ని అక్షరాలా ఆచరణలో పెట్టడానికై వెంటనే రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారు కరపత్రాలు, ప్రత్యేక డిమాన్‌స్ట్రేషన్సు, సభలు, ద్వారా తీవ్ర ఆందోళన చేయుటకుగాను రాష్ట్ర ప్రజలందరికి శాస్త్రీయ కార్యక్రమమును సూచించుటకు పూనుకొనవలెనని ఈ పార్టీ వారు రాష్ట్ర పార్టీవార్ని కోరుచున్నారు.

(10) నెల్లూరుజిల్లాలో వ్యవసాయ కూలీలు తమ ప్రాథమిక హక్కులకై సమ్మెలుచేసి అనేక స్థలాలలో విజయము పొందినందులకు ఈ సభవారు అభినందించు చున్నారు.

★ ★ ★

యుద్ధ ప్రతికూల సభ.

మొన్న సాయంత్రం 8 గంటలకు పట్టణ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పట్టణ యువజన, విద్యార్థి సంఘాల యాజమాన్యాన గాంధీ పార్కులో యుద్ధ వ్యతిరేక ప్రచార నిరోధక బిల్లును ఖండించుటకు పెద్ద బహిరంగ సభ జరిగింది, ఆ సభకు కామ్రేడ్ వి. జి. కృష్ణమూర్తి బి. యే. బి. యల్. గారు అధ్యక్షత వహించారు.

మొదట కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్యగారు, కేంద్ర శాసన సభలో చర్చింపబడుచున్న యుద్ధ వ్యతిరేక ప్రచార నిరోధక బిల్లును ఎందుకు వ్యతిరేకించాలో, యుద్ధాలను ఎందుకు బహిష్కరించాలో, యుద్ధ వ్యతిరేక ప్రచార కావశ్యకతను గురించి విపులంగా ముప్పావుగంట సేపు మాట్లాడిరి. పిమ్మట యం. అబ్దుల్ సలాం బి. యే. బి. యల్. గారు కూడ బిల్లును ఖండించుచు మాట్లాడిరి. అంతట అధ్యక్షుని అంతోపన్యాసంతో సభ ముగిసింది.

గుంటూరు, 31—8—38. ఇట్లు, పి. రామసుబ్బారావు.

మంచి తరుణము

కుట్టు పనివారలకు మాత్రమే:

కంబైండ్ స్పోర్టింగు సూటు, నవీన పద్ధతుల్లో శాస్త్రోక్తముగా కత్తిరించు విధానము.

"The Tailors' Practical Cutter"

"టైలర్సు ప్రాక్టికల్ కట్టరు."

వెల 0—8—0 మాత్రమే.

3 కాపీలు ఆర్డరు యిచ్చువారికి పోస్టు ఖర్చులు లేవు.

వలయువారు:—

జి. యస్. నారాయణ

జంట్సు టైలరు,

భీమవరం, పశ్చిమ గోదావరి.

సప్తమ ఆంధ్ర రాష్ట్ర రైతు మహా సభ

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షోపన్యాసం.

వీరవల్లి: 5—9—38.

సోదర సోదరీమణులారా!

గౌరవాతిశయమున మీరు నాకొసంగిన స్వాగతమునకు కృతజ్ఞుడను.

గత సంవత్సరము యీ పదవినందుండి నా శక్తి కొలది సేవ యొసర్చితిని. ప్రేమాతిశయము వలన అధ్యక్షులుగా నుండమని ఆజ్ఞాపించిన జిల్లా రైతు సంఘముల వారికి నా వందనములు. ఈ భారము నాపై నిడిన మీరే బాధ్యత వహించి సంఘ కార్యక్రమమును, ఈ సభను జయప్రదముగా నిర్వహింపబడుటకు తోడ్పడుదు రను విశ్వాసమున మీ ఆజ్ఞను వుల్లంఘించలేకపోతిని.

సోదరులారా:

ఈ విశాల ప్రపంచమున మనముండవలసిన స్థానమెద్ది? నే డెట్టి స్థితియం దున్నాము? నేటి మన దుర్బల, దారిద్ర్య, దాస్యమునకు కారణ మెద్ది? తన్నివారణోపాయ మేమి? అను విషయములను గూర్చి ఆలోచించుకొని కర్తవ్యమును నిశ్చయించుకొని తత్సాఫల్యత కొరకు కృషి యొనర్చుటకు యొక నిర్ణీత కార్యక్రమమును యేర్పాటు చేసుకొనుటకే యిక్కడ సమావేశమైతిమి.

మన స్థానము

ప్రకృతి నిర్మితమగు యీ సృష్టియందు సకల జీవరాసులు ఉపాధిని కల్గి యున్నవి. అట్టి ఉపాధికే భుక్తి యని పేరు. అట్టి భుక్తికి మూలకారకులు రైతులు, కూలీలు. కావుననే మనము ప్రపంచ సౌధమునకు పునాది. సృష్టికి జీవగట్టు. కాన విశాల ప్రపంచమున మన స్థానము అగ్రగణ్యము, మాన్యమనుట నిర్వివాదాంశము.

నేటి మన స్థితి.

ఆహారోత్పత్తిదారులము కాని మనకు కడుపునిండా తిండి, ఒంటినిండా బట్ట, నివాసయోగ్యమగు యిల్లు మనలో నూటికి 70 మందికి సున్న. కష్టించి పండించుతాము గాని పంటపై మనకు పెత్తనం లేదు. భూదేవి మనకు శరణ్యము; కాని భూమి రాను రాను దూరమగుచున్నది. ఈ క్రింది లెఖ్ఖలే రాను రాను భూమి యెటుల రైతుల చేతుల నుండి జారి పోవుచున్నదో స్పష్టము చేస్తాయి.

1771 సం॥లో రైతునకు గల సగటు భూమి	40 య.
1818 సం॥	$17\frac{1}{2}$ య.
1820 సం॥—40	12 య.
1915 సం॥	7 య.

యీ నాటికి యీ పరిమితి య 2 లకు దిగినదను టలో వింత యేమి! దీనిపై వచ్చు స్వల్ప ఆదాయము రైతు కుటుంబ జీవనమునకు సరిపోదని వేరు చెప్పవలెనా! అంతే గాక 1842 వ సంవత్సరము సర్ థామస్ మన్రో యీ దేశంలో భూమి లేని రైతు అరుదని నుడివెను. 30 సం॥ నాటికి (1872 సం) 75 లక్షల రైతులు తమ భూములను కోల్పోయిరి. తరువాత 50 సం॥లకు (1920 సం) 1000/274 మంది భూములను కోల్పోయిరి. 1931 సం॥ నాటికి వెయ్యింటికి 407 మంది భూమిని కోల్పోయిరి. అనగా నూటికి 40 మంది వ్యవసాయ కూలీలుగా మారి రన్న మాట.

"ఇండియా అండర్ లార్డు రిప్పన్" అను గ్రంథములో విల్ఫ్రెడు స్కాలెన్ బ్లంటు గారు యిలా వ్రాసిరి: "రైతునకు మరణ భయము లేకుండా మనము రక్షించుచున్నాము గాని, ఆకలి మంట వలన మరణ భయము వృద్ధి నొందించుచున్నాము." ఈ మాటలలోని సత్యము డిగ్బీ గారి కరవు లెక్కల వలన ఋజువగుచున్నది. 1793 మొదలు 1900 వరకు గల 107 సం॥లలో ప్రపంచ మందు జరిగిన యుద్ధము లన్నిటిలో 50 లక్షల మంది జనం నశించితే, 1890-1901 వరకు అనగా 10 సం॥లలో మన దేశములో కరవు వలన 190 లక్షల మంది నశించారు. అంటే రోజుకు 5760 గంటకు 240, నిముషానికి 4 గురు మరణించా రన్న సంగతి మన విషాద దుర్గతి యెట్టి భీకర రూపము దాల్చినదో తెలియ జేయుచున్నది. నేడు రాయలసీమ మున్నగు ప్రదేశములలో వేలకొలది ప్రజలు కరవు దేవతకు గురి యగుచుండుట మనము గాంచుచునే యున్నాము. మనము నిత్యము కండ్లార గాంచుచున్న యీ దారిద్ర్యానికి కారణ మేమిటి?

దేశములో పంట తగ్గుచున్నదా? లేదు. పైగా సాగగుచున్న భూమి హెచ్చుచునే యున్నది. 1892-93 సం॥లలో సాగు చేయు భూమి 1949 లక్షల యకరములు. 1931-32 సం॥ల నాటికి 9321 లక్షల యకరములు. అనగా 40 సం॥ రాలలోను సాగు చేయు భూమి 372 లక్షల యకరములకు పెరిగింది.

మన దేశంలో 1900 సం॥న క్షామ పీడిత మగు గుజరాతు రాష్ట్రమున ధాన్యపు వర్తకుల వద్ద రెండు సంవత్సరములకు సరిపడు సరుకు నిల్వ యుండెనని అప్పటి ప్రభుత్వ లెఖ్ఖలు తెలుపుచున్నవి. పై హంశములను బట్టి "అన్నీ వున్నవి అల్లుని నోట్లో శని" అన్నట్లు యున్నది మన బ్రతుకు.

దున్న పుష్ట దర్శనమే జీవన హేతువని నమ్మి, దున్నపోతులవలె అహర్నిశలు అష్ట కష్టములు పడి పంటలు పండించుతాము; మన భూమి, మన రాశి అని మురుస్తాము; తుదకు రాశి తయారైనదని వార్త చెవి పడగానే ప్రభుత్వం, జమీందారు, షాహుకారు, దానిని పన్నుల రూపమున, బాకీల నెపమున, మామూళ్ల సాకున ఆరగించుతారు. మనకు మిగిలేది పొల్లు గింజలు, కుంటు గడ్డి. మరునాడు ఋణదాత గారికి దయవుంటే తిండి; లేకుంటే పస్తు. నూటికి 80 మంది రైతుల దుర్గతి యిటు లున్నదన్న విషయం మన మెరిగినదే.

మన దుర్గతికి కారణం ఏది?

మనం పండించే పంటను వినియోగించుకొనే హక్కు మన చేతులలో నుండక పోవుటయే. మన పంటపై మనకు నిజమైన అధికారముంటే మనం తినగా మిగిలిన దానిని మన శ్రమ రక్తమును పీల్చుకొనుచున్న దేవతాశ్రయమునకు అవసరమును బట్టి అర్పింపు చేసుకొంటాము. కావున మన పంట వారు దోచుకొనగా మిగిలిన మన మనుభవించాలను పద్ధతి మారి మనము తినగా మిగిలినది వారు అనుభవించే పద్ధతికి రావాలి. ఈ మార్పు వస్తే కష్ట జీవి "అన్నమో రామచంద్రా" యని అరచి, అరచి అంతరించు గతి యుండదు. ఆ హక్కే, ఆ స్వాతంత్ర్యమే, ఆ యధికారమే మనకు సుఖ జీవన మార్గమగును. అదే మనకు కావలసిన స్వతంత్రము, స్వరాజ్యము. ఆ మార్పును కోరుటయే మన జన్మహక్కు. మన సంఘ ఆదర్శము అదియే. తత్ సాఫల్యత కొరకు కృషి చేయుటయే మన సంఘ కర్తవ్యము.

ఆ స్వాతంత్ర్యాన్ని యెట్లా పొందగలుగుతాము?

ప్రతి సం॥రము మన దేశము నుండి ఇంగ్లాండునకు ప్రవహించుచున్న ధనం 1921 లో, కె. టి. షాగారి అంచనా ప్రకారం 219 కోట్ల 86 లక్షలు, 1931 లో అమెరికా వారి అంచనా ప్రకారం 303 కోట్ల 90 లక్షలు. యీ దోపిడి వలనే మన రైతు సగటు ఆదాయం రూ 0—1—7 లకు పడిపోయింది. ఇదియే బ్రిటిషు పరిపాలనా ఫలితం. పై విధంగా వివిధ రూపముల దేశ సంపదను, కష్ట జీవుల శ్రమ శక్తిని కొల్లగొట్టుచున్న బ్రిటిషు సామ్రాజ్య వాదాన్నీ తనకు పునాదులుగా నియమించుకున్న జమీందారీవిధానాన్నీ నాశనం గావించాలి. దాని స్థానే నూటికి 80 మందిగా వున్న కూలీ రైతు రాజ్యమును స్థాపించుకోవాలి. దానికి మన మందరము బద్ధ కంకణులము కావాలి. అట్టి రాజ్యాంగాన్ని ఈ దేశములో స్థాపించువరకు శాంతి యుండదని స్పష్టముగా ప్రకటించాలి.

అట్టి రాజ్యాంగ నిర్మాణంకోసం పోరాటము సాగింపటానికి మన సంఘ నిర్మాణము బలపడాలి. ప్రస్తుత సంఘ బలహీనతకు కారణాలు గ్రహించి క్రిమానుభవము వలన వానిని సవరించుకొని, సంఘములను బలపర్చుకోవాలి.

సంఘ ముఖ్యలోపములను కార్యదర్శి గారు తన వార్షిక నివేదిక వలన విశద మొనర్చిరి. సంఘములో సభ్యులు 56 వేల వరకు పెరిగిరి. సంఘముల స్థాపన కూడ హెచ్చయింది. ఈవిషయం మన మద్రాసు ప్రభుత్వం తన పోలీసు నేరముల రిపోర్టు మూలముగనైనా అంగీకరించక తప్పలేదు. ఈ హెచ్చుదలకు కారణం కేవలం రైతుసేవకుల కృషియే ప్రధానము కాదనియు, పూర్వముకన్న రైతులలో పెరిగిన వర్గ చైతన్యము, జమీన్‌దార్ల, షాహుకార్ల దౌర్జన్యములు, కాంగ్రెసు మంత్రివర్గము లేర్పడుటయు కారణము లనుట నిస్సంశయము. అయితే సంఘ సభ్యులను చేర్పించుటలోను, సంఘాలను విరివిగా స్థాపించడములోనే రైతు సేవకుల పని పూర్తి కానేరదు.

ప్రతి రైతు సంఘం, రైతుల దైనందిన కష్టములకు తోడ్పడునప్పుడే, ప్రతి రైతు తనకున్న యిబ్బందులను రైతు సంఘాల ద్వారా తొలగించుకొనుటకు పూనుకొనునప్పుడే మన సంఘం రైతులకు నిజమైన ప్రతినిధి కాగలదు.

ప్రతి గ్రామ, తాలూకా, జిల్లా రైతు సంఘములు ఆఫీసును స్థాపించుకోవాలి. ఆ ఆఫీసు ప్రతి గ్రామ రైతుకు అవుసరమైన భోగట్టా, సలహా నిచ్చునదిగా వుండాలి. ప్రతి ఆఫీసునందు రైతుకు సంబంధించిన డి. పి. డబ్ల్యు. రెవిన్యూ గవర్నమెంటు పబ్లికేషన్ లు, ఆక్టులు, గ్రామ ప్లాను, ల్యాండు రికార్డులతో ఒక లైబ్రరీ యుండాలి. ఈ పనులన్నీ సక్రమముగా నెరవేరాలంటే, సంఘం సరిగా పనిచెయ్యాలంటే, డబ్బు కావాలి. అవుసరమైన ధనాన్ని ఆ జిల్లా రైతులు విరాళముల ద్వారా, పరస్పర సహకారముతో వసూలు చేసుకోవాలి. ఇటుల చేయుటవలన సంఘం బలపడి, మన దైనందిన కష్టములు తొలగించుకొనుటకు మార్గము యేర్పడును.

పై నిర్మాణమువలన మన దైనందిన కష్టములను తొలగించుకొనగలము గాని, మన సంపూర్ణ స్వాతంత్ర్యమును పొందజాలము. దానికి యింకా బలము కావాలి. అందుకు దేశంలోని యితర కష్టజీవు లందరి తోడ్పాటు కావాలి. ముఖ్యముగా మనతోపాటు కొంచెము ఇంచుమించుగా సమాన సంఖ్యాకులై, మనకు అనుదిన సహాయులను భూమి యుండి, మనము, భూమిలేక వారును సకల భూమి పంట దినుసులను మనతోపాటు మన

కంటె కూడ అధిక శ్రమజీవులు వృత్పత్తి కారకులును అయిన సోదర వ్యవసాయకూలీల తోడ్పాటు అవసరమని మన మెంతత్వరలో గుర్తించిన అంత మంచిది. వారు భూమిలేని రైతులు. మనం యెండమావులవంటి (మన చేతినుండి జారిపోవుచున్న) భూమి గల రైతులము. ఇద్దరి జీవనం వ్యవసాయమే. విశేషభూమిగల నూటికి 10 మందిగానున్న ధనికరైతులుతప్ప నూటికి 70 మందిగానున్న బీదరైతులస్థితి కూలీల దారుధ్యము ఒకటిగా నున్నది. మనం—వారు, విద్యలేని వింతగొఱ్ఱెలమే. వారిది మనది దున్నేకులమే. భూమిమీద ఆధారపడి జీవించుచున్న కులమే. కనుక వ్యవసాయ కూలీల కనీసపు కోర్కెల సఫలత కొరకు మనం వారికి తోడ్పడాలి. మన సంఘ ఆశయాలలో వారి కనీసపు కోర్కెల సఫలత కూడ ఒకటియే అను విషయాన్ని, ప్రతి రైతు అను దినం, వారితో వ్యవహరించు నప్పుడు జ్ఞాపకముంచుకోవాలి. వాళ్లు మనము చీలితిమా, జమీన్దారీ, షాహుకారీ తోడేళ్ల మన రెండు గొఱ్ఱె గుంపులను, పీల్చి పిప్పి చేయుట నిస్సంశయము. ఆ సంఘముతో మనము మన సంఘముతో వారు కలిసి మెలసి ఐక్యముగా నడుపుకొని పోవుటయందే మన, వారల భావి భాగ్యోదయ దశ గలదని ఉభయులము విశ్వసించి వర్తించాలి.

వారికి మనకు ఏ తగయిదాలు ఏ గ్రామాదులలో వచ్చినప్పటికి సుహృద్భావముతో, సామరహస్యముగా పరిష్కరించు కోవాలి. మన కంటె వారు విద్యా విహీనులు గాన తగవులు పరిష్కరించుకొనుటలో యెక్కువ ఉదారతను చూపించ వలసిన బాధ్యత మన యందే గలదు. ప్రతి జిల్లా, తాలూకాకు, రాజీ బోర్డులను ఏర్పర్చుకోవాలి. ఆ బోర్డులలో మన సంఘ ప్రతినిధి ఒకడు. వార్ల సంఘ ప్రతినిధి ఒకడు, కష్ట జీవుల రాజ్య స్థాపన కొరకు కృషి చేయుచున్న సోషలిస్టు సంఘ ప్రతినిధి ఒకడు ఉండి, అవసరమైనపుడు రాష్ట్ర రాజీ బోర్డుల సలహాలను తీసుకొని తగవులను పరిష్కరించు కోవాలి.

వీరు గాక పారిశ్రామిక జీవులు, చేతి పనివారలు మున్నగు దేశములో గల పీడిత వర్గము లన్నియు తమ సంఘాల ద్వారా తమ తమ దైవం దిన కష్టముల నివారణ కొరకు స్వాతంత్ర్య హక్కుల కొరకు, సల్పుచున్న పోరాటములకు మనం తోడ్పడాలి. ఆ శక్తులన్నిటిని కేంద్రీ కరించుకొని సామ్రాజ్య శక్తులను యెదుర్కొని స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించాలి. ఇట్టి శక్తులను కేంద్రీ కరించుకొని స్వాతంత్ర్య పోరాటమును సాగించవలసిన సంస్థయే జాతీయ కాంగ్రెసు.

రైతు సంఘాలు - జాతీయ కాంగ్రెసు.

జాతీయ మహా సభ స్వాతంత్ర్యము కోరు భారతీయ ప్రజలందరి రాజకీయ సంస్థ. దేశంలోని వివిధ వర్గాల పీడిత ప్రజలు తమ తమ సంఘాల ద్వారా తమ ఆర్థిక పౌరసత్వ హక్కుల కొరకు సల్పు పోరాటాన్ని సమన్వయ పరచి, సమగ్రమైన జాతీయ, రాజకీయ దృక్పథము సమకూర్చుట దాని కర్తవ్యము. రైతు సంఘం రైతుల దైనందిన కష్టముల నివారణ కొరకు పోరాడుచు. వారిలో వర్గ చైతన్యము పెంపొందించుచు ఆ పోరాటాలలో అగ్రగాములైన వారికి అనుభవముల ద్వారా రాజకీయ తరిబీయదు నిచ్చుచు, జాతీయ పోరాటానికి మూల బలాన్ని చేకూర్చుతుంది. అందుచే రైతు సంఘాలు, కాంగ్రెసు, పరస్పర విరుద్ధమైనవి గాక ఒక దాని కొకటి బలము చేకూర్చు సంస్థలు.

జాతీయ మహా సభ ప్రత్యేక రైతు సంఘ స్థాపన అంగీకరించినను మితవాద కాంగ్రెసు నాయకులు కొందరు కాంగ్రెసే అందరి ప్రజల ప్రతినిధి యనియు, ప్రత్యేక రైతు సంఘా లనవసరమనియు చెప్పుచున్నారు. దీనికి కారణం జాతీయ పోరాటాన్ని కొనసాగించవలసిన విధానములో మనకు వారికి గల భేదమే. వారు జాతీయ స్వతంత్రమును అపేక్షించెదరు. గాని, కష్ట జీవుల హక్కుల కొరకు నిత్యము జరుగు పోరాటాన్ని, ప్రజాందోళనను అపేక్షించరు. వారి ఆదర్శము పెట్టుబడి దారీ ప్రజా స్వామికము: అనగా తెల్ల దొరతనము పోయి దాని నల్ల దొరతన మేర్పర్చుట. ఆ రాజ్యాంగ విధానంలో యిప్పటి దోపిడి విధానం యిలాగే ఉంటుంది. అందుచేతనే వారు నేటి మన ఆందోళనను నిర్లక్ష్యము చేస్తున్నారు.

పీడిత ప్రజలు సామాజిక విప్లవాన్ని తెచ్చే శక్తి గల సైన్యంగా తయారగుటకు వారిష్టపడరు. కాని మన దృష్టిలో కార్మిక కర్షక ప్రజా స్వామికానికి సోపానమైన సంపూర్ణ స్వాతంత్ర్యము సైతము పై మార్గం వల్ల తప్ప మరొక విధంగా సాధించలేము.

అంతే గాక వివిధ వర్గాల సామ రస్యము సమకూర్చే కాంగ్రెసు రైతుల వర్గ కోర్కెలకు సరిగా పోరాడ జాలదు. రైతుల టెనెన్సీ చట్టము మార్పు సందర్భమున బీహార్ జమీణాదారీ కాంగ్రెసు ఒడంబడికయే ప్రత్యక్ష సాక్ష్యము. వివిధ రాష్ట్రాలలోని రైతు ఉద్యమమును గురించి చెప్పుచూ "మొత్తం మీద కాంగ్రెసు కార్య క్రమం కర్షకులకే సంబంధించినది. కాని మంత్రి పదవులు వచ్చిన తర్వాత కర్షకులకు వీలుగా పని జేయడానికి కొన్ని చిక్కులు వచ్చినాయి. ఇవి రెండు విధాలు. మొదటిది కాంగ్రెసులో కొందరు భూస్వాములు ఉండటం, అందువల్ల కర్షక శాసనాలకు అభ్యంతరం కల్గింది. రెండవది శాసన సభలలో రెండు తరగతులుండటం. వీరిలో పై శాసన సభకు భూస్వాములు ఎన్నుకోబడ్డ ప్రతినిధులు వస్తారు. ఈ సభ పెద్ద కర్షక చట్టాన్ని దేన్నీ అంగీకరించదు." అని జవహరలాల్ నెహ్రూ గారు ఇటీవలనే లేబరు మాస పత్రికలో వ్రాశారు. ఆసంగతియే ప్రత్యేక రైతు సంఘాల ఆవశ్యకతను నిరూపించుట లేదా! కాన రైతు సంఘ నిర్మాణమునకు బలం చేకూర్చండి. సంపూర్ణ స్వాతంత్ర్యము కొరకు పోరాడు కాంగ్రెసులో రైతులు విరివిగా సభ్యులు జేరి, జాతీయ పోరాటానికి బలము నిస్తూ, కాంగ్రెసును రైతుల కనీసపు కోర్కెలు సఫల మొనర్చు నటులను కాంగ్రెసు నిర్మాణములలో కార్మిక కర్షక సంఘ ప్రాతి నిధ్య మంగీకరించునట్లును మనం కృషి చేయాలి.

మనకు కాంగ్రెసు ప్రభుత్వం ఏమి చేసింది ?

కాంగ్రెసు శాసన సభలు ఆక్రమించా లనియు, పదవుల స్వీకరించాలనియు తీర్మానించేటప్పటికి మనలో ఆశాజ్యోతి వెలిగింది. జమీందార్లు యెంత బెదిరించినా, ఎన్ని కష్టాలు పెట్టినా యోర్చుకొని కాంగ్రెసును గెలిపించాము. కాంగ్రెసు అధికారం పుచ్చుకొని సంవత్సరము దాటినది. మద్యపాన నిషేధానికి పూనుకుంది. జయప్రదంగా దాన్ని అమలుపరుచుచున్నందులకు మనం కృతజ్ఞులము. ఇక రైతులకు ఋణ పరిష్కార చట్టమొనర్చినందులకు సంతోషించితిమి. కాని అనుభవముమీద పరపతి సౌకర్యము ప్రభుత్వము తగినంతగా చూపించనందునను, వాయదాల బందీలుగా తీర్చుకునే యేర్పాటులు గావింపనందునను, రైతుల నిత్యావసరమునకు షాహుకారు దగ్గరకు వెళ్ళకుండా గ్రామ గ్రామాన బ్యాంకుల ద్వారా అప్పుల నిచ్చు సౌకర్యము గావించనందునను, చట్టము యొక్క లాభాలను మన మెంత మాత్రము పొందజాలకున్నాము. నేటి షాహుకారు దగ్గరకు వెళ్ళితే 100 కి 150 గా నోటు వ్రాయమంటున్నాడు. పాత అప్పు బిల్లు ప్రకారం తీర్చుకుందామంటే పరపతివుట్టక షాహుకారు బాకీ అసలు ఫాయిదాలుసహా కలిపి రొఖ్కం తీసుకున్నట్లు నోటువ్రాసి వారి యొత్తిడిని తగ్గించుకోవలసివస్తున్నది. ఏదైన పొలమమ్మి ఋణములను తీర్చుకుందామంటే 8 వ సెక్షనులోని వసూళ్ళ విషయమై ఏప్రకారం వసూళ్లు యిచ్చినా యేప్రకారం లెఖ్ఖ కట్టుకోవలయునో స్పష్టముగా నిర్వచింపనందున షాహుకారు రైతును కోర్టుకు యీడ్చుచున్నాడు.

రైతుకు బాకీల భారానికి తోడు కోర్టు వ్యయప్రయాసములు కలుగుచున్నవి. మనవలె భూమి మీద ఆధారపడి జీవించుచున్న వ్యవసాయ కూలీల ఋణములను సంపూర్ణముగా రద్దు గావలెనని మన మెంత ఆందోళన చేసినను వారి నింతవరకు ఋణ విముక్తులను చేయలేక పోయినది.

అడవి పుల్లరి సగానికి తగ్గించుట రైతులకు, కూలీలకు ఆర్థికముగా నించుక లాభము కలిగించినది.

పన్నులు పూర్వపు ప్రభుత్వముల వలెనే రిమీషన్ యిచ్చినదియే గాని, కాంగ్రెసు యెన్నికల మానిఫెస్టో ననుసరించి రైతుల ఆర్థిక క్షేమాన్ని బట్టి పన్ను తగ్గించు విధానాన్ని అవలంబించ లేదు. పన్ను భారమెంతో తగ్గునని ఆశతో వేచియున్న రైతులకు ఆశాభంగము కలిగించు చున్నది.

ఎస్టేటు ల్యాండు ఆక్టు సవరణ చేసి, జమీన్దారీ పీడ నుండి తప్పించుతారని జమీన్ రైతులు ఎన్నికల నాటనుండి యెన్నో కష్టములను భరించు చున్నారు. జమీన్దారీ విచారణ కమిటీ యెదుట యెంతో ఉత్సాహముతో కష్టము లీడేరు దినములు ఆసన్నమైనవని ఆశతో తమ బాధలను తెల్పు కున్నారు. దాని ఫలితం జమీన్ రైతుల కష్టాలు ద్విగుణీకృతమైనవి. నేడు మునగాల, తిరువూరు, కాళీ పట్నం, కొండపర్వ, బొగోలు, వెంకటగిరి మున్నగు జమీన్దారీ గ్రామాదులలో ఆయా జమీన్దార్లు, ముఖాసాదార్లు చేయుచున్న దౌర్జన్యములు, కోర్టుల కీడ్చు రైతులకు కల్గించు చున్న వ్యయ ప్రయాసలు, రైతులను చావమోదించు టాదిగా గల దారుణ కృత్యములు ఎస్టేటు ల్యాండు ఆక్టు సవరణకు కాలయాపనా ఫలితములే అనవచ్చును.

కాంగ్రెసు మంత్రి వర్గం యేమి చెయ్యాలి?

కాలయాపన జరిగినను ఎస్టేటు ల్యాండు ఆక్టు వచ్చే నవంబరులోనైనా ఆంధ్ర రాష్ట్ర రైతు రక్షణ యాత్ర వారు సమర్పించిన అత్యవసరపు కోర్కెలకు కొరవడని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం వారిచే చేయబడిన సూచనలకు యెంత మాత్రము తగ్గని విధంగా ఎస్టేటు ల్యాండు ఆక్టును సవరణ చట్టము చేయ్యాలి. అందుకు యే మాత్రము కొరవడినను మనం జయము పొందేవరకు అవసరమయితే సత్యాగ్రహము సాగించుటకు మనము తయారుగా వుండాలి. మన సత్యాగ్రహం మన కాంగ్రెసు ప్రభుత్వం మీద కాదు. మన కాంగ్రెసు ప్రభుత్వాన్ని, బెదరింపులతో లొంగతీయుటకు యత్నించు జమీందార్ల యొత్తిడిని గవర్నర్ల అసాధారణాధికాన్ని యెదిరించి మన తీవ్ర అసంతృప్తిని వెల్లడించి, మన మంత్రులను మన ఆందోళనా బల మిచ్చి, చట్టాన్ని మన కనీస వాంఛల కనుకూలముగా చేసుకొనుటకు మాత్రయే.

ప్రస్తుత భూమి శిస్తు విధానాన్ని మార్పు గావించి, రైతుల ఆదాయ వృద్ధి ననుసరించి పన్ను విధానము నేర్పాటు చేయునట్లు శాసనము చేసి రాబోవు పన్నులు చెల్లించుకోవలసిన సమయానికైనా బీదరైతుల పన్నుల భారాన్ని పూర్తిగా తొలగించాలి.

ప్రస్తుత ఋణ చట్టములోనున్న లోపములను సవరించి, పరపతి సౌకర్యము వచ్చే బడ్జెట్టులోనైనా వృద్ధి చెయ్యాలి. వ్యవసాయ కూలీల ఋణములను పూర్తిగా రద్దుపర్చునట్లు వెంటనే శాసనం చేయాలి. ఏజన్సీ ప్రజల ఋణాల కూడ బిల్లును వర్తింపచేయాలి. రైతులకు సంబంధించిన ఋణ రాజీబోర్డులు, యిరిగేషన్ బోర్డులు మున్నగువాటి నన్నిటియందును రైతు సంఘములకు తగిన ప్రాతినిధ్యము యివ్వాలి. మరియు రైతు సభల ద్వారా, యాత్రల ద్వారా, సంఘములద్వారా, యిదివరకనేక మారులు వెల్లడించి, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం వారిచే ఆమోదించబడినంతవరకయినా రైతుల కనీసపు కోర్కెల ప్రణాళికలోని సూచనల ననుసరించి రైతులకు మేలు చేయుటకు కాంగ్రెసు ప్రభుత్వము కాలయాపన చేయకుండా పూనుకోవాలి. లేనిచో కాంగ్రెసు జయానికి తోడ్పడిన రైతు ప్రజానీకములో నిస్పృహ యేర్పడుతుంది. కాంగ్రెసు బలమే సన్నగిల్లుతుంది. స్వాతంత్ర్య పోరాటమే మందగించుతుంది.

(ఇంకా ఉంది.)

సాహిత్యం విప్లవానికి సాయపడుతుంది!

ఆదర్శ గ్రంథ మండలి, యలమర్రు. (కృష్ణా జిల్లా)

కారల్ మార్క్సుది—కమ్యూనిస్టు కరపత్రం(నిషేధింపబడినది): లెనిన్ ది—సామ్రాజ్యవాదము (నిషేధింప బడినది): ఏంజిల్సుది—సామ్యవాద సిద్ధాంతాలు 0-2-0; మాక్సింగోర్కీ—ది—అమ్మ (నిషేధంపోయింది) 1-8-0; క్రోపాటకిన్ ది—మనధనం (అయిపోయింది): టాలుస్టాయిది—కర్షకునికాలగతి 0-1-0; తుమ్మల వారిది—కామ్రేడ్ డిమిట్రాఫ్ 0-2-0; లింగయ్యవి—దేవీజోన్ (జీవితము) 0-8-0; డివేలరా (జీవితము) 0-8-0; వలసదేశాల సమస్య 0-1-0; స్టాలిన్—లడ్విగ్‌తో సంభాషణ 0-1-6.

నవ్యసాహిత్యమాల, అనంతపురం.

1. ఫాసిజం 0-8-0 2. లెనిన్ 0-8-0 3. ఆస్ట్రియా 0-1-0 4. 1937 లో మాస్కో: 0-8-0

అందమైన గెటప్‌తో, అందరికీ అర్థమయ్యే సులభశైలితో, అందరికీ అందుబాటులో ఉండే వెలలతో, వెలువడినాయి. పత్రికలూ, ప్రముఖులూ ఈ పుస్తకాలనుగూర్చి సదభిప్రాయాలిచ్చారు.

విశ్వసాహిత్యమాల, ముంగండ, (via.) అంబాజీపేట. తూ. గోదావరి.

లెనిన్ ఉపదేశాలు: వెల 6 అణాలు (సాహీదత్తు రచన కనువాదము). పారిస్ కమ్యూన్: వెల 6 అణాలు (లెనిన్ రచన కనువాదము). సోషలిజం ఎందుకు 1-0-0
నా రష్యాయాత్ర 0-8-0. సోవియట్ కమ్యూనిజం 0-5-0. 1905 రష్యా విప్లవం (నిషేధింపబడినది.) కారల్ మార్క్సు ఉపదేశాలు (నిషేధింపబడినది.)
నాడు-నేడు గ్రంధకర్త: అడయాంకో వెల 1-4-0 500 పుటలు—చక్కని బైండు—మంచి గెటప్.

పెట్టుబడిదారీ విధానంలో నాడు - సోషలిస్టు విధానంలో నేడు రష్యాలోని శ్రామికవర్గం యొక్క స్థితి ఏలాగవుంది? పెట్టుబడిదారీ విధానం—సామ్రాజ్యవాద యుద్ధం కారణంగా దిక్కు - ఆధారమూ లేకుండా తయారయిన వేలకొలదిమంది అనాధ బాలురకి విప్లవం ఇచ్చిన సుఖం ఏమిటి? గ్రంథకర్త స్వయంగా ఒక అనాధ బాలుడు అవడం ఈ నవల యొక్క ఔన్నత్యానికి ముఖ్య కారణం.

ప్రొలిటేరియన్ సీరీస్

అన్నా. జర్మనీలో కార్మికులు, కమ్యూనిస్టులు సల్పిన పోరాటం—త్యాగం—విప్లవం—కనులకు కనబడేటట్లు చిత్రించాడు నవలాకరుడు అన్నా'లో. అశ్వనీకుమార్ దత్తుగారు మంచి రసవంతంగా అనువదించి ఆంధ్రులకు అందించారు. ఇలాంటి వీరగాథను చదవండి! ధన్యులుగండి! 300 పేజీలు. అర్థరూపాయే సుమా! మీ కాపీకి వెంటనే ఆర్డరు యివ్వండి. ఏజన్సీ కావలసినవారు అణా బిళ్లతో వ్రాయండి. పుస్తకము కావలసినవారు పది అణాల ఆరు పైసలు తపాలా బిళ్లలు పంపించండి.

దర్భా శ్రీరామమూర్తి, న్యూస్ ఏజంటు, ఛీమవరం; పశ్చిమ గోదావరి.

నవశక్తి కార్యాలయం, బెజవాడ.

మాప్లా తిరుగుబాటు, వెల ఒక అణా. భారత కార్మికోద్యమ చరిత్ర. వెల 0-4-0 గ్రంధకర్త: తుమ్మల వెంకట్రామయ్య.
నిర్మాణ సమస్యలు, వెల 0-1-0. గ్రంధకర్త:-పుచ్చలపల్లి సుందరయ్య

అతివాద గ్రంథమండలి, గుంటూరు.

1922 మన్యంలో రైతుల తిరుగుబాటు (అల్లూరి సీతారామరాజు) (నిషేధింపబడింది). విలువ, ఖరీదు, లాభము. (అచ్చులో ఉంది.)
స్టాలిన్ ఉపన్యాసము—నూతన రాజ్యాంగవిధానం. 0-5-0 ఇతరులకు 0-8-0.

హిందీ పత్రికలు.

జనతా సోషలిస్టు వార పత్రిక. బీహారు రాష్ట్రంలో స్వామి సహజానందుని నాయకత్వం క్రింద జరిగే రైతు ఉద్యమాన్ని గూర్చి తెలుసుకోవాలంటే దీనిని చదువాలి.
సం॥ చందా రు 3-0-0. మేనేజరు, జనతా బంకిపూరు, పాట్నా.

నయా హిందూస్తాన్ సోషలిస్టు పక్ష పత్రిక. సంపాదకుడు : సయ్యద్ జహీర్. 'నయా హిందూస్తాన్.' కార్మిక కర్షక పోరాటాలను వృద్ధి చేస్తుంది. తీవ్ర వాదుల, సోషలిస్టుల అందరియొక్క ఐక్యతకు నాయకమణి. అక్టోబరు ౧ వ తేదీనుండి వెలువడుతుంది. విఖ్యాత సోషలిస్టుల, రచయితల వ్యాసాలు ఉంటాయి. ఇపుడే చందా దారులు కండి! సంవత్సరం చందా రు. 2-0-0. మేనేజరు నయాహిందుస్థాన్ 90. జీరో రోడ్డు, అల్లాహాబాదు.

Printed, and Published by M. Annapurniah at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE